ఆంధ్రజ్యోతి 5 ప్రకాశం
శుక్రవారం 24, జనవరి 2025

ఇటీవల చీమకుర్తి బాలికల వసతిగృహాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడ పరిస్థితులను మంత్రి దృష్టికి తీసుకెళ్లి శిథిలావస్థకు చేరుకున్న భవనాన్ని కూల్చివేసి తిరిగి నూతన భవనం, గదుల నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ నుంచి రూ.2కోట్లు మంజూరు చేశారు. అందుకు అవసరమైన అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ అనుమతులు రావాల్సి ఉంది.

గిద్దలూరులో బాలికల గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలకు నూతన భవనం కోసం స్థానిక ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి... ప్రభుత్వం నుంచి రూ.5కోట్ల నిధులను మంజూరు చేయించారు. నిధులు మంజూరై 3 నెలలు గడుస్తున్నా భవన నిర్మాణానికి స్థలం దొరకలేదు. యడవల్లి సమీపంలో స్థలం కేటాయిస్తారని తెలిసింది. త్వరితగతిన స్థలం కేటాయిస్తే పనులు మొదలుపెట్టే అవకాశం ఉందని ఐటీడీఏ ఏఈ జయరాజ్ తెలిపారు.

ఎర్రగొండపాలెం సంక్షేమ హాస్టళ్లలో వసతులు సరిగా లేవని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఇటీవల విద్యాశాఖ మంత్రి లోకేశ్, కలెక్టర్‌ల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ వసతిగృహాల నిర్మాణాలు, మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసింది. స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్ మరమ్మతుల కోసం రూ.40లక్షల నిధులు మంజూరయ్యాయి. ఆ పనులు త్వరలో చేపట్టనున్నారు.



వసతికి మహర్దశ

- కొత్త భవనాలకు రూ.54.65 కోట్లు మంజూరు
- హాస్టళ్ల మరమ్మతులకు మరో రూ.9.3కోట్లు
- విద్యార్థులకు తీరనున్న కష్టాలు
- త్వరలో ప్రారంభం కానున్న పనులు
- కొన్నిచోట్ల స్థల సమస్యతో ఆలస్యం

జిల్లాలో సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు మంచిరోజులు వచ్చాయి. ఇప్పటికే ఉన్న భవనాలకు మరమ్మతులతో పాటు అవసరమైన చోట కొత్త భవనాలను నిర్మించ నున్నారు. ఆమేరకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాలు మొత్తం 81 ఉండగా ఇందులో దాదాపు 8 వేల మంది విద్యార్థులు చదువును కొనసాగిస్తున్నారు. అందులో 42 మాత్రమే ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్నాయి. వీటిలో మౌలిక వసతులు అందుబాటులోకి రానున్నాయి.

ఒంగోలు నగరం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సమస్యలతో సతమతమవుతున్న సంక్షేమ వసతిగృహాల విద్యార్థుల వెతలు తీరనున్నాయి. జిల్లాలో అన్ని ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాల్లో త్వరలో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం బడుగువర్గాల పిల్లలు ఉండి చదువుకునే వసతిగృహాల బాగోగులను ఏ మాత్రం పట్టించుకోలేదు. కనీస సౌకర్యాల కల్పనకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతో ఎక్కడికక్కడే సమస్యలు తిష్టవేశాయి. విద్యార్థులు చదువు కొనసాగించటానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి స్వామి వసతిగృహాల్లో కనీస సౌకర్యాల కల్పనపై దృష్టిసారించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 810 సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాల్లో కనీస సౌకర్యాల కల్పనకు మొత్తం రూ.133కోట్లు విడుదల చేశారు. జిల్లాలో ఉన్న 42 ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాల్లో సౌకర్యాల కల్పనకు మొత్తం రూ.10 కోట్లు విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 81 వసతిగృహాలు ఉండగా వీటిలో 42 మాత్రమే ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్నాయి. ఆ వసతి గృహాల్లో కనీస వసతులు కల్పనకు నిధులు విడుదలయ్యాయి. మేజర్ పనుల నిర్వహణకు రూ.1.94 కోట్లతో, మైనర్ పనులు రూ.7.4 కోట్లతో చేపట్టనున్నారు.



సంతపేటలో బాలికల హాస్టల్‌కు శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, కలెక్టర్, ఎమ్మెల్యే జనార్దన్ (ఫైల్)

రూ.54.65 కోట్లతో నూతన భవనాలు



జిల్లాలోని పలు వసతిగృహాలకు నూతన భవన నిర్మాణాలకు కూడా నిధులను కేటాయించారు. ఈ నిధులు జిల్లా మినరల్ ఫండ్, కేంద్రప్రభుత్వం నుంచి ప్రధాన మంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన ద్వారా విడుదల చేశారు. జిల్లా మినరల్ ఫండ్ నుంచి రూ.16.25కోట్లు కేటాయించగా ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన కింద రూ.38.40కోట్లు రాబట్టనున్నారు. వీటితో నూతన భవనాలను నిర్మించనున్నారు. నీడలేక ఇబ్బందులు పడుతున్న సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహ విద్యార్థులకు జీప్లస్ పద్ధతిలో అధునాతన భవనాలను నిర్మించనున్నారు. వీటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తేనున్నారు.

నిర్మాణాలు - నిధులు ఇవీ..

- ఒంగోలు సంతపేటలోని బాలికల వసతిగృహాన్ని రూ.6.15కోట్లతో జీప్లస్3 పద్ధతిలో నిర్మించనున్నారు. ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.
- రూ.2కోట్లతో సంతనూతలపాడులోని బాలుర వసతిగృహం, చీమకుర్తిలో ఉన్న బాలికల హాస్టల్‌లో అదనపు వసతి గదుల నిర్మాణానికి మరో రూ.2కోట్లు మంజూరయ్యాయి.
- ఒంగోలులో కళాశాల వసతిగృహాల విద్యార్థులకు జీప్లస్3 పద్ధతిలో రూ.5.50 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించనున్నారు.
- వీటితోపాటు వెలుగు టీడీసీ భవనాలకు సమీపంలో ఉన్న పరివర్తన భవన్‌కు రూ.60లక్షలతో మరమ్మతు పనులను చేపట్టనున్నారు. ఈ నిర్మాణాలను జిల్లా మినరల్ ఫండ్ నిధులతో చేపట్టనున్నారు.
- 'ప్రధాన మంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన' కింద ఒంగోలులోని బాలుర హాస్టల్‌కు జీప్లస్ 3 పద్ధతిలో రూ.6కోట్లతో, కళాశాల బాలుర వసతిగృహాన్ని రూ.9కోట్లతో, బాలుర వసతిగృహం-2ను రూ.9కోట్లతో నిర్మించనున్నారు.
- వీటితోపాటు వైపాలెంలో బాలుర వసతిగృహాన్ని రూ.3కోట్లు, బాలికల వసతిగృహాన్ని రూ.6కోట్లు, గిద్దలూరులో బాలుర వసతిగృహం రూ.3కోట్లు, బాలికల వసతిగృహం మరో రూ.3 కోట్లతో నిర్మించనున్నారు.
- సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాలతోపాటు జిల్లాలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాల నిర్మాణాలు, మరమ్మతులకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.



వాగు పోరంబోకు భూమిలో సాగైన వరి

వాగు పోరంబోకు భూమి
ఆక్రమణ

- సుమారు 50 ఎకరాలు మాయం
- ఒక్కో ఎకరా రూ.10 లక్షలపైనే మార్కెట్ ధర
- వేముల పరిధిలో కుచించుకుపోయిన వాగు
- యథేచ్ఛగా వరి, పశువుల మేత పెంపకం
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

మండలంలోని వేముల పంచాయతీలో భూ ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. వాగు పోరంబోకు భూమిని సమీప రైతులు తమ పొలాల్లో కలిపి దున్నేసుకుంటున్నారు. వేముల నుంచి వేములబండ వరకు రెండున్నర కిలోమీటర్ల పొడవున కాలువకు ఇరువైపులా ఆక్రమించేశారు. దాదాపు 50 ఎకరాలకుపైనే యథేచ్ఛగా దున్నేశారు. వరి, పశువుల మేతకు ఉపయోగిస్తున్నారు. అయినా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

ముండ్లమూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : వేముల పరిధిలో 182, 183, 406 తదితర సర్వే నెంబర్లలో దాదాపు 50 ఎకరాలకుపైగా ఉన్న పోరంబోకు భూములు అక్రమార్కుల చేతుల్లో చిక్కుకున్నాయి. గత ప్రభుత్వ హయాంలో భూములన్నీ మాయమయ్యాయి. వేములతోపాటు కమ్మవారిపాలెం, వేములబండ గ్రామాల పరిధిలో కూడా వాగు పోరంబోకు భూమి ఆక్రమణలతో వాగు పిల్లకాలువలా మారిపోయింది. సమీప రైతులే వాగు పోరంబోకు భూములను తమ పొలాల్లో కలిపేసుకున్నారు. ఆక్రమణకు గురైన భూమి ఎకరా ధర రూ.10 లక్షలు పలుకుతోంది. వాగుపోరంబోకు భూములు ఆక్రమణకు గురికావటంతో వాగులో నీరు లేకుండాపోతోంది. మేత కోసం వెళ్లిన మూగజీవాలకు దాహం తిప్పలు తప్పటం లేదు. ఆక్రమణదారులు తీసిన బావుల దగ్గరకు వెళ్లి దాహార్తి తీర్చుకుంటున్నాయి. ఈ క్రమంలో కొన్నిసార్లు అవి మృత్యువాత పడుతున్నాయి.

విచారించి చర్యలు తీసుకుంటాం

వేముల నుంచి వేములబండ వరకు ఉన్న వాగు ఆక్రమణకు గురైంది. పరిశీలించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం. ఆర్ఐ, వీఆర్‌వోలను పంపించి ఆక్రమణదారులను గుర్తిస్తాం.
- ఎల్ లక్ష్మీనారాయణ, తహసీల్దార్



సింగరాయకొండలోని కందుకూరు రోడ్డు కూడలిలో మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకల్లో కేక్‌కట్ చేస్తున్న మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

వేడుకగా లోకేశ్ జన్మదినం

- జిల్లావ్యాప్తంగా కేక్ కటింగ్‌లు, విద్యార్థులకు పుస్తకాల పంపిణీ
- ఉత్సాహంగా పాల్గొన్న టీడీపీ శ్రేణులు

ఒంగోలు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు గురువారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. టీడీపీ శ్రేణులు పలుచోట్ల కేక్ కటింగ్‌లు చేయడంతోపాటు వివిధ ప్రాంతాల్లో విద్యాసంస్థలు, హాస్టళ్లలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, ఇతర వస్తువులు పంపిణీ చేశారు. ఆయా ప్రాంతాల్లో టీడీపీ ప్రజాప్రతినిధులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తన నియోజకవర్గ పరిధిలోని సింగరాయకొండలో పార్టీశ్రేణులు నిర్వహించిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కేక్ కట్ చేయగా, మార్కాపురంలో అక్కడి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నేతృత్వంలో కేక్ కటింగ్‌తోపాటు రక్తదాన శిబిరం జరిగింది. దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి దర్శి, ముండ్లమూరులలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొనగా, వైపాలెంలోని బాలికల వసతిగృహంలో జరిగిన కార్యక్రమంలో అక్కడి టీడీపీ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు పాల్గొని విద్యార్థినులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. గిద్దలూరులో టీడీపీ నాయకులు ఈ వేడుకలను నిర్వహించగా ఎస్ఎన్‌పాడులో జడ్పీ హైస్కూలులో టీడీపీ మహిళా నాయకురాలు ఆరికట్ల సుమతి పాల్గొని విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. కొండపిలో జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి రామయ్య కేక్ కట్ చేయగా కనిగిరిలో స్థానిక నాయకులు వేడుకలను నిర్వహించారు. పొదిలిలో శ్రేణులు పుస్తకాలు పంపిణీ చేశారు. కనిగిరిలోని అమరావతి గ్రౌండ్స్‌లో ఎమెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు.

వెలిగొండపై నిర్లక్ష్యం వీడాలి

- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు
- ఎరుపెక్కిన కనిగిరి
- పార్టీ శ్రేణుల భారీ ప్రదర్శన

7

ఒంగోలు-దొనకొండ రైల్వేలైన్‌పై కదలిక

- త్వరలో డీటైల్ ప్రాజెక్టు రిపోర్టు
- కేంద్ర రైల్వేమంత్రి ప్రకటన



ఒంగోలు కలెక్టరేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా జిల్లా ప్రజానీకం ఎదురుచూస్తున్న ఒంగోలు-దొనకొండ నూతన రైల్వేలైన్ పొదిలి మీదుగా ఏర్పాటు చేసేందుకు డిటైల్ ప్రాజెక్టు రిపోర్టును రూపొందిస్తున్నట్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. ఈ మేరకు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి లిఖితపూర్వకంగా తెలిపారు. రైల్వేలైన్ ఏర్పాటు కోసం ఇటీవల కేంద్రమంత్రిని ఎంపీ కలిసి ఆవశ్యకతను వివరించారు. ఆ ప్రాంతంలో రైల్వేలైన్ ఏర్పాటు చేయడంతో కలిగే ప్రయోజనాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ పొదిలి మీదుగా ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఒంగోలు-పొదిలి రైల్వేలైన్‌ను కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మాగుంట కోరారు. ఈ నేపథ్యంలో స్పందించిన కేంద్రమంత్రి ఆ రైల్వేలైన్ ప్రాజెక్టు డిటైల్ ప్రాజెక్టు నివేదికను రూపొందిస్తున్నట్లు లేఖను పంపారు.





పాఠశాల విద్యలో సంస్కరణలు

- పాఠశాలల హేతుబద్ధీకరణ
- ప్రతి పంచాయతీకి మోడల్ ప్రైమరీ స్కూలు
- హైస్కూళ్ల నుంచి 3, 4, 5 తరగతులు వెనక్కి
- ఐదు రకాల బడులకు ప్రతిపాదనలు

ఒంగోలు విద్య, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా విధానం 2020కి అనుగుణంగా పాఠశాల విద్యలో సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పాఠశాలల హేతుబద్ధీకరణ చేపట్టింది. ప్రధానంగా ఐదు రకాల బడులను ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించింది. గత ప్రభుత్వం అమలులోకి తెచ్చిన అత్యంత వివాదాస్పద జీవో 117ను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు పాఠశాల విద్యా కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. 117జీవో రద్దు నేపథ్యంలో భవిష్యత్ పాఠశాలల రూపురేఖలు ఎలా ఉండాలో ఒక ముసాయిదా ప్రతిని కూడా కమిషనర్ విడుదల చేశారు. ఈ ప్రతిపై విద్యాశాఖాధికారులు, ఇతర మేధావి వర్గాల అభిప్రాయాలు సేకరించి దానికి అనుగుణంగా రాష్ట్రంలో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టారు. ప్రతి పంచాయతీలో ఒక ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు, ప్రతి మిగతా 6లో...

2025-26 విద్యా సంవత్సరం నుంచి అమలులోకి వచ్చే విద్యా విధానమిలా..

శాటిలైట్ ఫౌండేషన్ స్కూలు

పూర్వ ప్రాథమిక విద్య(ఎల్‌కేజీ, యూకేజీ) బోధించే అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ పాఠశాలలను నిర్వహిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఇక నుంచి శాటిలైట్ ఫౌండేషన్ స్కూళ్లుగా పిలుస్తారు.

ఫౌండేషన్ స్కూలు

ఈ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యతోపాటు 1, 2 తరగతుల విద్యార్థులకు కూడా బోధిస్తారు. ఈ పాఠశాలలకు 30 మందికి ఒక టీచర్‌ను నియమిస్తారు. విద్యార్థుల సంఖ్య 31 దాటితే రెండో టీచర్‌ను నియమిస్తారు.

బేసిక్ ప్రైమరీ స్కూలు

ఈ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యతోపాటు 1 నుంచి 5 తరగతుల టీచర్లు బోధిస్తారు. ఈ పాఠశాలల్లో 20మందికి ఒక సెకండరీ గ్రేడ్ టీచర్‌ను, 21 నుంచి 60 మందికి రెండో ఎస్జీటీని కేటాయిస్తారు.

ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు

ప్రతి పంచాయతీలో 60మంది కంటే ఎక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలను ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా ఏర్పాటు చేస్తారు. ఇక్కడ పూర్వ ప్రాథమిక విద్యతోపాటు 1 నుంచి 5 తరగతులు బోధించేందుకు ఐదుగురు ఎస్జీటీను నియమిస్తారు. ఆ గ్రామంలో ఒకటి కంటే ఎక్కువ ప్రాథమిక పాఠశాలలు ఉంటే కిలోమీటర్ పరిధిలో పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల విద్యార్థులను ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలి. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో 45 నుంచి 60మంది వరకు ఉన్న బడులను కూడా ఆదర్శ పాఠశాలలుగా పరిగణిస్తారు.

ఉన్నత పాఠశాలలు

ఉన్నత పాఠశాలల్లో ఇక నుంచి కేవలం 6 నుంచి 10 తరగతుల వరకు మాత్రమే విద్యార్థులు ఉంటారు. 75 మందిలోపు ఉన్న హైస్కూళ్లకు హెచ్ఎం, పీడీ/పీఈటీ పోస్టు రద్దవుతుంది. ప్రతి సెక్షన్‌కు 40మంది చొప్పున ఐదు సెక్షన్లు 200 మందికి ప్రతి సబ్జెక్టుకు ఒక స్కూలు అసిస్టెంట్ చొప్పున ఏడుగురు ఎస్ఏలు, ఒక హెచ్ఎం, ఒక పీడీ/పీఈటీ పోస్టు మాత్రమే ఉంటుంది. విద్యార్థుల సంఖ్య, సెక్షన్లు పెరిగే కొద్ది అదనపు టీచర్ పోస్టులు మంజూరవుతాయి.



క్లస్టర్ రిసోర్స్ సెంటర్లకు రూ.1.50 కోట్లు విడుదల

ఒంగోలు విద్య, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా ఏర్పాటైన క్లస్టర్ రిసోర్స్ సెంటర్ (సీఆర్‌సీ) స్కూలు కాంప్లెక్స్‌లకు 2024-25కి సీఎస్‌సీ గ్రాంటు విడుదల చేస్తూ సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో గతంలో 241 స్కూలు కాంప్లెక్స్‌లు ఉండగా వాటిని తాజాగా 150కి కుదించారు. సమగ్రశిక్ష ప్రాజెక్టు అప్రూవల్ బోర్డు 2024-25 (పీఏబీ) ఆమోదం మేరకు సీఆర్‌సీ గ్రాంటును విడుదల చేశారు. కొత్తగా ఏర్పాటైన సీఆర్సీ స్కూలు కాంప్లెక్స్‌లు ఒక్కొక్క దానికి రూ.లక్ష చొప్పున జిల్లాలోని 150 సీఆర్సీ స్కూలు కాంప్లెక్స్‌లకు రూ.1.50 కోట్లను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నిధులు ఎలా వినియోగించుకోవాలో మార్గదర్శకాలు కూడా జారీచేశారు. ఒక్కొక్క సీఆర్సీ స్కూలు కాంప్లెక్స్‌కు ఇచ్చిన రూ.లక్షలో మెయింటెనెన్స్‌కు రూ.30వేలు, కంటింజెన్సీకి రూ.35వేలు, టీఎల్ఎంకు రూ. 25వేలు, రవాణా భత్యాలకు రూ.10వేలు వ్యయం చేసేందుకు అనుమతించారు.

అన్ని పాఠశాలల్లో గణతంత్ర వేడుకలు
గ్రామాల్లో విద్యార్థులతో మార్చ్‌ఫాస్ట్
విద్యా కమిషనర్ విజయరామరాజు 6
సమ్మోహనభరితం.. సందేశాత్మకం
అలరించిన ఎన్టీఆర్ కళాపరిషత్ ప్రదర్శనలు
ఆలోచింపజేసిన నాటిక 7

వెలిగొండ ప్రాజెక్టుపై నుంచి దూకి యువకుడి ఆత్మహత్య

మార్కాపురం రూరల్, జనవరి23 (ఆంధ్రజ్యోతి). వెలిగొండ ప్రాజెక్టు పై నుండి దూకి గురువారం యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వేమలకోట గ్రామ పంచాయతీ జంకె రామిరెడ్డి కాలనీ చెందిన కన్నెబోయిన సుబ్బయ్య(20) తన అమ్మ వారి ఇళ్లు కడపజిల్లా ఖాజీపేటలో ఉండి కొన్ని సంవత్సరాలుగా చదువుకుంటున్నాడు. గురువారం అక్కడ నుండి బయలుదేరి వచ్చాడు. మండలంలోని గొట్టిపడియ గ్యాప్ వద్ద వెలుగొండ ప్రాజెక్టు డ్యామ్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలాన్ని రూరల్ ఎస్ఐ అంకమ్మరావు సిబ్బందితో కలిసి పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దివ్యాంగులకు ఉచితంగా ల్యాప్‌ట్యాప్‌లు, టచ్‌ఫోన్లు

- ఇతర పరికరాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు నగరం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దివ్యాంగులైన విద్యార్థులకు అవసరమైన ల్యాప్‌ట్యాప్‌లు, టచ్‌ఫోన్లను ప్రభుత్వం ఉచితంగా అందజేయనుంది. వీటితో పాటు ఇతర దివ్యాంగులకు అవసరమైన పరికరాలను కూడా అందించేందుకు చర్యలు తీసుకుంది. ఇందు కోసం ప్రకాశం, బాపట్ల జిల్లాలోని అర్హులైన దివ్యాంగులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అర్చన గురువారం ఓ ప్రకటన జారీ చేశారు. ట్రైసైకిళ్ళు, వీల్‌ఛైర్లు, చంకకర్రలు, వినికిడి యంత్రాలు, వృద్ధులకు చేతికర్రలు ఉచితంగా అందజేయనున్నారు. ఇందుకోసం అర్హులైన దివ్యాంగులు తమ దరఖాస్తులను డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.ఏపీడీఏస్‌సీఏసీ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. ల్యాప్‌ట్యాప్ కోసం డిగ్రీ చదివి ఉండాలన్నారు. టెక్నికల్ కోర్సులు చదువుతున్న వారు కూడా అర్హులేనని తెలిపారు. సదరమ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఆదాయ సర్టిఫికెట్, కుల సర్టిఫికెట్, 3,10 తరగతుల సర్టిఫికెట్‌లతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. టచ్‌ఫోన్లను ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన బధిర విద్యార్థులకు అందజేస్తారు. వీరు దరఖాస్తు చేసుకునే సమయంలో పాఠశాలల హెచ్‌ఎం నుంచి గాని, ఆడియాలజిస్టు నుంచి గాని సైన్‌ల్యాంగేజ్ సర్టిఫికెట్ తీసుకోవాన్నారు. వీల్‌ఛైర్లు, మూడు చక్రాల బళ్ళు, చంక కర్రలు, డైసీ ప్లేయర్, ఫోల్డింగ్ వాకింగ్ స్టిక్స్, వృద్ధుల చేతికర్రలు, వినికిడి యంత్రాల కోసం కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 08592-281310 నంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

గుణాత్మక విద్యే లక్ష్యం

- వివాదాస్పద 117 జీవో రద్దు
- పాఠశాలలను బలోపేతం చేస్తాం
- అన్నిస్థాయిలలో మార్పులు చేస్తాం
- పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు



మాట్లాడుతున్న విద్యా కమిషనర్ విజయరామరాజు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పాఠశాలలను బలోపేతం చేసి గుణాత్మక విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు పేర్కొన్నారు. స్థానిక ఫంక్షన్ హాలులో గురువారం జోనల్ స్థాయి నెల్లూరు ప్రకాశం జిల్లాల వర్క్ షాపులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో ప్రభుత్వం జారీ చేసిన 117 జీవో ప్రకారం 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేయడం, ప్రైమరీ పాఠశాలల్లో కేవలం 1, 2 తరగతుల ఉండటం వల్ల డ్రాపవుట్ల సంఖ్య పెరిగిందన్నారు. దానిని నివారించి పాఠశాల విద్యను బలోపేతం చేయడం కోసం బడులను పునఃనిర్మాణం చేసేందుకు 117 జీవోను రద్దు చేస్తూ మార్గదర్శకాలు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో 60 మందికి పైగా విద్యార్థులు ఉన్నచోట మోడల్ స్కూల్స్‌గా మార్చి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూస్తామన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7, 8 తరగతుల్లో 60మందికిపైగా విద్యార్థులు ఉండి మౌలిక వసతులు ఉంటే దానిని ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తామని పేర్కొన్నారు. 30మంది కంటే తక్కువగా ఉంటే ఆ పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా మార్చుతామన్నారు. దూరంగా ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో 60 మంది లోపు ఉంటే 1 నుంచి 5 తరగతులు బేసిక్ ప్రైమరీ స్కూలుగా మారుస్తామని వివరించారు. 1, 2 తరగతులు ఉన్నచోట ఫౌండేషన్ స్కూళ్లుగా ఉంటాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను కూడా ప్రైమరీ స్కూల్స్‌లో కలిపి పీపీ1, పీపీ2 క్లాసులుగా చేస్తామని కమిషనర్ తెలిపారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా క్లస్టర్, మండల, జిల్లాస్థాయిలో కమిటీల ద్వారా ఈ ప్రక్రియ చేపడతామన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డీఈవోలు, ఉప విద్యాధికారులు, ఎంఈవోలు, క్లస్టర్ హెచ్‌ఎంలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ అన్సారియా, నెల్లూరు కలెక్టర్ ఆనంద్, ఆర్జేడీ లింగేశ్వర రెడ్డి, డీఈవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు

ఎంపీడీవోకు సైబర్ నేరగాళ్ల ఫోన్

- మీడియా ప్రతినిధిని అంటూ పరిచయం
- ఫోన్‌పే ద్వారా నగదు పంపాలని డిమాండ్
- అప్రమత్తమై నెంబరును బ్లాక్ చేసిన అధికారి
- పోలీసులకు ఫిర్యాదు



వీసీపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి):సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రభుత్వం, పోలీస్ డిపార్ట్‌మెంట్ ఎన్ని పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నా నేరగాళ్లు మాత్రం కొత్తకొత్త మార్గాల్లో నేరాలకు పాల్పడుతూనే ఉన్నారు. నిన్నమొన్నటి వరకు లక్కీ లాటరీలు, వెడ్డింగ్‌కార్డ్ ఇన్విటేషన్స్, పీఎం కిసాన్ పేర్లతో ఏపీకే ఫైల్స్‌ను వాట్సాప్ గ్రూపుల్లో పంపి వాటిని ఓపెన్ చేసిన వ్యక్తి స్మార్ట్‌ఫోన్‌ను హ్యాక్‌చేసి మోసాలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం మీడియా ప్రతినిధులమంటూ కాల్ చేసి అధికారిని మోసగించేందుకు ప్రయత్నించిన సంఘటన రెండురోజుల క్రితం వీసీపల్లి మండలంలో జరిగింది. వీసీపల్లి ఎంపీడీవో తెలిపిన వివరాల మేరకు మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా ప్రభాకరశర్మ విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి ఓ గుర్తుతెలియని వ్యక్తి 8328297788 సెల్‌నెంబరుతో ఫోన్‌చేశాడు. తాను విలేకరిని అని పరిచయం చేసుకున్నాడు. అయితే ఏదో సమాచారం కోసం ఫోన్‌చేశాడని భావించిన ఎంపీడీవో ఏం కావాలని అని అవతలి వ్యక్తిని ప్రశ్నించాడు. విలేకర్లందరికీ విజయవాడలో మీటింగ్ ఉంది.అక్కడికి వెళ్తున్నాం.అత్యవసరంగా కొంతనగదు అవసరం.మీ ఫోన్‌పే నుంచి పంపించమని అడిగాడు. ఫోన్ చేసిన వ్యక్తి తెలుగు, హిందీ కలగలిసిన యాసలో మాట్లాడాడు. ఫోన్‌పేని హ్యాక్ చేసి అకౌంట్‌లో నగదు కొల్లగొట్టేందుకే తనను లక్ష్యంగా చేసుకున్నారని భావించిన ఎంపీడీవో వెంటనే అప్రమత్తమయ్యాడు. ప్రభుత్వం ఇచ్చిన డిపార్ట్‌మెంట్ మొబైల్‌నెంబర్లకు ఎటువంటి ఫోన్‌పేలు, గూగుల్ పేలు, యూపీఐలు ఉండవు. ఈ విషయం ప్రతిఒక్కరికీ తెలుసు. ప్రభుత్వ ఉద్యోగులు వారి శాలరీ అకౌంట్‌కు వారి పర్సనల్ నెంబరే యాడ్ అయ్యి ఉంటుంది. ఆ నెంబరుకే ఫోన్‌పే ఉంటుంది. అయినా ప్రభుత్వ నెంబరుకు కాల్ చేసి డబ్బు పంపించమంటున్నాడేంటని ఎంపీడీవో ఆలోచించి మీ పేరేంటి, మీరు ఎప్పుడూ నాకు కనిపించలేదు, మీరు ఏ మీడియాలో పనిచేస్తున్నారు.అయినా నేను మీకు ఎందుకు డబ్బులు పంపించాలని ఎంపీడీవో ఎదురు ప్రశ్నించాడు. ఇంతలో అవతలి వ్యక్తి ఫోన్ కట్‌చేశాడు. ఆ తరువాత ట్రూకాలర్‌లో నెంబరును చెక్‌చేయగా టీఆర్ న్యూస్‌గా ఉంది. ఇదేదో సైబర్‌నేరగాళ్ల పనిలా ఉందని భావించిన ఎంపీడీవో అప్రమత్తమై ఆ వ్యక్తి చేసిన మొబైల్ నెంబరును బ్లాక్‌చేశాడు.నెంబరును బ్లాక్ చేసినా మంగళవారం 4గంటల సమయంలో మరోమారు అదే నెంబరుతో ఎంపీడీవోకు కాల్‌చేసినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో గురువారం ఎంపీడీవో ప్రభాకరశర్మ పోలీసులను కలిశారు. జరిగిన విషయాన్ని వివరించిన ఆయన ఆగంతకుడి నుంచి వచ్చిన ఫోన్ నెంబరును పోలీసులకు ఇచ్చి ఫోన్‌చేసిన వక్తి ఎవరు, ఎక్కడి నుంచి ఫోన్ చేశారో విచారించమని కోరారు.

ఉత్తమ ఎన్నికల పద్ధతులపై కలెక్టర్‌కు అవార్డు

- ఒంగోలు ఆర్డీవో, పూర్వపు ఎస్ఎస్‌వోతోపాటు మరి కొందరికి కూడా
- రేపు ఓటరు దినోత్సవం సందర్భంగా అందజేత


కలెక్టర్ అన్సారియా

ఒంగోలు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణ, ఓటర్లు జాబితా సవరణలలో ఉత్తమ పద్ధతులు అందించి, పారదర్శకంగా నిర్వహించినందుకు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు లభించింది. ఆమెతోపాటు ప్రస్తుత, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఇటీవల వరకు ఇక్కడ ఎఫ్ఎస్‌వోగా పనిచేసిన ఎఫ్ఎస్‌వో లోకేశ్వరరావుల తోపాటు మరి కొందరు ఇతర అధికారులు, సిబ్బందికి కూడా అవార్డులు అందాయి. గత ఏడాది సాధారణ ఎన్నికల జరిగిన సమయంలో రాష్ట్రంలో జిల్లా ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన పలువురు కలెక్టర్‌లు, నియోజక వర్గ ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన డిప్యూటీ కలెక్టర్‌లతోపాటు ఇతర వివిధ స్థాయిలో సేవలు అందించిన వారికి అలాగే, గత ఏడాది అక్టోబరు నుంచి నెల తొలివారం వరకు జరిగిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకంగా పనిచేసిన వారికి ఈ అవార్డులు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇవ్వనుంది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో జిల్లా ఓటర్ల నమోదు అధికారిగా ఉన్న ప్రస్తుత కలెక్టర్ తమీమ్ అన్సారీయా, అలాగే ప్రస్తుత ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్నలకు అవార్డులు రాగా సాధారణ ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితాలో సరవణ, రెండు అంశాలలో దర్శి రిటర్నింగ్ అధికారిగా ఉత్తమ సేవలు అందించిన పూర్వపు ఒంగోలు ఎఫ్ఎస్‌వో వీఎస్.లోకేశ్వరరావుకు అవార్డు లభించింది. ప్రస్తుతం ఆయన ఏఎస్ఆర్ జిల్లాలో ట్రైబల్ అధికారిగా పనిచేస్తున్నారు. అలాగే ఆయా విభాగాలలో జిల్లాకు చెందిన ఎస్పీ కార్యాలయంలోని సోషల్ మీడియా, సైబర్ విచారణ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన సీఐ సూర్యనారాయణ, దర్శి తహసీల్దార్, ఆ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎం.శ్రావణ్‌కుమార్, సంతనూతలపాడు నియోజకవర్గం 181వ నెంబరు పోలింగ్ బూతు బీఎల్‌వోగా పనిచేసిన ఎస్.మీరావలిలకు కూడా ఈ అవార్డులు దక్కాయి. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఈనెల 25న విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగే సభలో వారికి అవార్డులను గవర్నర్ నజీర్‌అహ్మద్ అందజేయనున్నారు. ఆ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

అన్ని పాఠశాలల్లో గణతంత్ర వేడుకలు

- గ్రామాల్లో విద్యార్థులతో మార్చ్‌ఫాస్ట్
- పాఠశాల విద్యా కమిషనర్ వి.విజయరామరాజు

ఒంగోలు విద్య, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఈనెల 26న రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పాఠశాల విద్యా కమిషనర్ వి.విజయరామరాజు ఉత్తర్వులు జారీచేశారు. పాఠశాలల్లో హెచ్‌ఎంలు జాతీయజెండాను ఎగురవేయాలన్నారు. ఉదయం పూట విద్యార్థులతో గ్రామాల్లో జాతీయ, దేశభక్తి గీతాలు ఆలపిస్తూ మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాలన్నారు. గణతంత్ర వేడుకల సందర్భంగా పాఠశాలలో నిర్వహించాల్సిన కార్యక్రమాలను అన్ని విద్యాసంస్థలకు తెలియజేసి ఘనంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆర్జేడీ, డీఈవోలను కమిషనర్ ఆదేశించారు.

ఎస్సీ వర్గీకరణకు మద్దతివ్వాలి

కనిగిరి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు మద్దతివ్వాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీరాఘవులును ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. వెలుగొండసాధన సదస్సు కార్యక్రమంలో భాగంగా కనిగిరి వచ్చిన ఆయనను ఎమ్మార్పీఎస్ నేతలు కలసి వినతి పత్రం ఇచ్చారు. అందుకు సానుకూలంగా స్పందిస్తూ ఇప్పటికే ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి మద్దతు పలికామని ఇది సామాజిక న్యాయమని ఆయన ఎమ్మార్పీఎస్ నాయకులతో అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జేవీరాజుమాదిగ, జైభీం వ్యవస్థాపకులు సూరే రాజన్నమాల, తాతపూడి సురేష్‌బాబు, నాని తదితరులు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్ త్యాగనిరతిని ఆదర్శంగా తీసుకోవాలి

దర్శి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): యువత నేతాజీ సుభాష్‌చంద్రబోస్ త్యాగ నిరతిని, పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలని టీడీపీ దర్శి నియోజకవర ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పేర్కొన్నారు. మండలంలోని తూర్పుచౌటపాలెంలోని ప్రభుత్వ పాఠశాలలో నేతాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన గొప్ప యోధుడు సుభాస్‌చంద్రబోస్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, దర్శి నగర పంచాయతీ ఛైర్మెన్ నారపుశెట్టి పిచ్చయ్య, సాగర్ కాలువల డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ వెలుగొండారెడ్డి, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు మారం శ్రీనివాసరెడ్డి, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

పామూరులో..

పామూరు : మండలంలోని కంభాలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 138వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు పి. మహబూబ్‌ఖాన్, శ్రీనివాస్, ఎస్డీ ఖాదర్ వలి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు కృష్ణమోహన్, రషీద్, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పామూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పశు సంరక్షణే ధ్యేయంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నాయకలు యారవ శ్రీనివాసులు కోరారు. మండలంలోని పడమట కట్టకిందపల్లి గ్రామంలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పశువులకు, మేకలు, గొర్రెలకు ఉచితంగా రోగనిరోధక టీకాలు వేశారు. పశుపోషకులకు మందులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ ఈమని శ్రీసాయి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

పామూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మహిళల్లో అక్షరాస్యత పెరిగినప్పుడే కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని ఏపీఎం జి. విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని కంభాలదిన్నె గ్రామంలో ఉల్లాస్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. మహిళలను వయోజనులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. అనంతరం పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగురైతు అధ్యక్షులు మన్నం రమణయ్య, గోళ్ల భాస్కరరావు, వీరబాబు, మండల సమైక్య అధ్యక్షురాలు ఓరుగంటి సుబ్బమ్మ, భారతి, పోకా గీత, మంచు ధనలక్ష్మి పాల్గొన్నారు.

రేపు ఏలూరి క్యాంప్ కార్యాలయంలో జాబ్ ఫెయిర్

మార్టూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం 8 గంటలకు గ్రీన్‌స్పార్క్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్ ఫెయిర్ ను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన సారథ్యంలో గ్రీన్‌స్పార్క్ ఫౌండేషన్, హెచ్ఆర్‌కో కంపెనీలు సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ ఫెయిర్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ జాబ్ ఫెయిర్‌లో 10వతరగతి నుంచి పీజీ వరకు విద్యార్హత కలిగిన వారికి ఇంటర్వ్యూలను నిర్వహిస్తారు. మొత్తం 8 ప్రముఖ కంపెనీలు పాల్గొని నిరుద్యోగులకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తారు. అందులో గ్రీన్‌స్పార్క్ ఫౌండేషన్ టీం రిజిస్ట్రేషన్ చేసిన అభ్యర్థులతోపాటు, ఆన్‌లైన్‌లో రిజిస్టర్ అయిన ప్రతి ఒక్కరికీ వారి అర్హతలను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ జాబ్‌ఫెయిర్‌ను నిర్వహిస్తున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

నాగులపాలెం(పర్చూరు), జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేవిధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా పశు వైద్య శాఖ అధికారి వేణుగోపాల్ అన్నారు. గురువారం మండలంలోని నాగులపాలెంలో పశు సంవర్థక శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని ముఖ్య అతిధిగా పాల్గొన్న జిల్లా అధికారి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీహెచ్‌వో మాట్లాడుతూ పశువులకు మెరుగైన వైద్య సేవలను అందించడంతోపాటు, పశుపోషకులను పోత్సహించే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మండల ప్రత్యేక అధికారి పి.షానిలా పాల్గొన్నారు.

హిమవర్షిణి..!



ఒకవైపు చల్లని మంచుతెమ్మర్లు.. మరోవైపు మలయమారుతం.. వీటి నడుమ పొద్దుపొద్దున్నే బాలభాస్కరుడు సైతం ఆలోచించి ఆగమనం చేశాడు..!

ఒంగోలు నగరంలో గురువారం ఉదయం దట్టంగా మంచు కురిసినప్పటికీ ప్రజలు తమదైనందిన కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారు.ఉద్యోగాలకు బయలుదేరేవాళ్లు.. సెంట్రింగ్ పనులకెళ్లే వారు.. పాఠశాలలకెళ్లే విద్యార్థులు చలికి గజగజ వణుకుతూనే తమతమ కార్యస్థానాలకు చేరుకున్నారు.







తూర్పుగంగవరం యువకుడికి నేషనల్ యూత్ ఇన్‌స్పిరేషన్ అవార్డు

అవీఇవీ



కేంద్రమంత్రి సతీష్‌చంద్ర ద్వివేది చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మస్తాన్‌వలి

తాళ్లూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : యువతకు ఉపాధికల్పించటంలో మార్గదర్శిగా నిలిచిన తూర్పుగంగవరం యువకుడు మస్తాన్‌వలి నేషనల్ యూత్ ఇన్‌స్పిరేషన్ అవార్డు 2025 ను గురువారం ఢిల్లీలో అందుకున్నారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా కేంద్ర రూరల్ డెవలప్ మెంట్ మంత్రిత్వ శాఖ, డిఫెన్సు మంత్రిత్వ శాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ ఇండ్రస్టీ మంత్రిత్వశాఖలు నేతాజీ సుబాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఢిల్లీలో సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి సతీష్ చంద్ర ద్వివేదీ చేతుల మీదుగా మస్తాన్ అవార్డును అందుకున్నారు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది నేషనల్ అవార్డును తూర్పుగంగవరం వాసి అందుకోవటం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహిళల అభ్యున్నతికే 'ఉల్లాస్'

- టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు


కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ ఇంచార్జి ఎరిక్షన్‌బాబు

పెద్దారవీడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికే ఉల్లాస్ కార్యక్రమాన్ని టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో డ్వాక్రా మహిళలకు ఉల్లాస్ అక్షర కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ మహిళలకు చదువు చెప్పించి అక్షరాస్యులను చేయడమే కార్యక్రమ ప్రధాన లక్ష్యమన్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో 4920 మంది నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించినట్లు తెలిపారు. 492 మంది విద్యావలంటీర్ల ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జాన్ సుందరం, వయోజన విద్య ఉపసంచాలకులు పి.వెంకటేశ్వరరావు, విద్యాశాఖ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణారెడ్డి

పొదిలి, జనవరి (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో భూసమస్యల పరిష్కారం కోసం ప్రతిఒక్కరూ రీసర్వేను సద్వినియోగం చేసుకో వాలని తహసీల్దార్ కృష్ణారెడ్డి కోరారు. గురువారం మండలంలోని నందిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన సర్వే గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రీసర్వే నిర్వహిస్తోందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూసమస్యలు, సరిహద్దుల పరిష్కారాన్ని చూపనున్నట్లు తెలిపారు. ఈ సర్వే చేపట్టడంతో ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవచ్చన్నారు. దీర్ఘకాలికంగా గ్రామాల్లో ఉన్న సమస్యలు పరిష్కారం చేసుకోవాలని కోరారు. గతంలో మాదిరిగా కాకుండా నేటి ఆధునిక డ్రోన్‌ల వ్యవస్థ ద్వారా సమస్యలను అధికమించేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నరసింహారావు, మండల సర్వేయర్ గురవయ్య, వీఆర్వోలు బాలవెంకటరెడ్డి, సంతోష్‌కుమార్, సురేష్, గ్రామ సర్వేయర్లు, మాజీ సర్పంచ్ రమణారెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సమాచార హక్కుచట్టంపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీవో శోభన్‌బాబు

పొదిలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ సమాచార హక్కుచట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో శోభన్ బాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి ఆయన అవగాహన కల్పించారు. సమాచార హక్కుచట్టం కమిషనర్ ఆదేశాల మేరకు చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు కోరిన సమాచారాన్ని 30 రోజుల్లో విధిగా ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ పాలనలో జవాబుదారితనం తీసుకువచ్చేందుకు సమాచార హక్కుచట్టం -2005 రూపొందించారన్నారు. ప్రత్యేక అధికారి విద్యాసాగర్ మాట్లాడుతూ సమాచారం అడిగిన వారికి వివరాలు ఇవ్వకుండా దాటవేత ధోరణి అవలంబించవద్దన్నారు. 30 రోజుల్లో సమాచారం ఇవ్వకపోతే దరఖాస్తు దారుడు అప్పీల్ చేసే అవకాశం ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఏవో శ్రీనివాసులు, మండలపరిషత్, ఉపాధిహామీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల విద్యలో సంస్కరణలు

(5వ పేజీ తరువాయి)

తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున 1 నుంచి 5 తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులను ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం హైస్కూళ్లలో విలీనమైన 3, 4, 5 తరగతుల విద్యార్థులను వెనక్కు తెచ్చి వారిని ఈ పంచాయతీకి ఒకటి చొప్పున ఏర్పాటుచేస్తున్న ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో చేర్పిస్తారు. గత ప్రభుత్వ హయాంలో ఆరు రకాల పాఠశాలల వ్యవస్థను ఐదు రకాలకు కుదించారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను కూడా వచ్చే ఏడాది నుంచి పాఠశాలలకు అనుసంధానం చేయనున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో జడ్పీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రారంభించిన ఇంటర్మీడియేట్ కోర్సు(హైస్కూలు ప్లస్)లను రద్దు చేయనున్నారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి పాఠశాల విద్యలో ఐదు రకాల పాఠశాలల విధానం అమలులోకి రానుంది.

పంచాయతీకి ఒక ఆదర్శ పాఠశాల

గత ప్రభుత్వం 117 జీవోను అడ్డుపెట్టుకొని ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను హైస్కూళ్లలో విలీనం చేయడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలలు ఉనికిని కోల్పోయాయి. జిల్లాలో 201 జడ్పీ హైస్కూళ్లలో 273 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతుల విద్యార్థులను హైస్కూళ్లకు తరలించారు. దీంతో ఆ ప్రాథమిక పాఠశాలల్లో కేవలం 1, 2 తరగతుల విద్యార్థులు మాత్రమే మిగలడంతో అవితమ ప్రాభల్యాన్ని కోల్పోయాయి. నాడు-నేడు కింద రూ.లక్షలు వ్యయం చేసి ఆ పాఠశాలలకు కల్పించిన వసతులు కూడా నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో ప్రస్తుతం హైస్కూళ్లలోని 3, 4, 5 తరగతుల విద్యార్థులను హైస్కూళ్ల నుంచి వెనక్కు తెచ్చి పంచాయతీకి ఒకటి చొప్పున ఏర్పాటు చేయనున్న ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించనున్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా హనుమంతరావు

తాళ్లూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి) :తాళ్లూరు ఇన్‌చార్జి ఎంపీడీవోగా హనుమంతునిపాడు ఈవోఆర్డీ దారా హనుమంతరావు గురువారం బాధ్యతలు చేపట్టారు.ప్రస్తుతం ఉన్న ఎంపీడీవో కె.సుందరామయ్య విద్యాభ్యాసశిక్షణ నిమిత్తం సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో హనుమంతునిపాడు ఈవోఆర్డీని ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలతో నియమించగా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావును, జడ్పీటీసీ వెంకటరెడ్డి అభినందనలు తెలిపారు.

కష్టపడి తేనె లాభాలు

తిన్నవారికి ఆరోగ్యం పుష్కలం

- మాధుర్యం తయారీ వెనుక మహా యజ్ఞం
- చీరాల సమీపంలోని పొలాల్లో ఈగల బాక్స్‌ల ఏర్పాటు
- 20 రోజులుగా శ్రమిస్తున్న ఉత్పత్తి కేంద్రం నిర్వాహకుడు

మన పూర్వీకుల నుంచే తేనెను పలు రోగాలకు ఔషధంగా వినియోగిస్తున్నారు. దాని వాడకం వలన రక్తపోటు, హైపర్ టెన్షన్ వంటివి కూడా తగ్గుతాయని వైద్య నిపుణులు చెప్తున్నారు. దీనిని తీసుకోవడం వల్ల కిమోథెరపీ రోగులలో తక్కువగా ఉన్న తెల్ల రక్తకణాల సంఖ్యను నియంత్రిస్తుందన్న విషయం తెలిసిందే. చక్కెర వాడకం వలన శరీరంపై చెడు ప్రభావాలు కలుగుతున్నాయి. దానికి ప్రత్యామ్నాయంగా తేనె వాడకంతో బహుళ ప్రయోజనాలున్నాయని చెప్తున్నారు. దీంతో తేనెకు డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం నాణ్యమైన తేనె మార్కెట్లో దొరకడం కష్టంగానే ఉంది.

చీరాలటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి)

నాణ్యమైన తేనె ఉత్పత్తి అంత సులువేంకాదు. దాని తయారీలో పడే కష్టాలు మాటల్లో చెప్పలేం. ఈక్రమంలో ఆంధ్రజ్యోతి.. చీరాలలో తేనె ఉత్పత్తి చేస్తున్న అందె తులసీ రామచంద్రరావును పలకరించింది. ఆయన సుమారు 20 రోజులుగా చీరాల మండల పరిధిలోని తోటవారిపాలెం హైవే వెంబడి తేనె టీగల కుటీర పరిశ్రమ నిర్వహిస్తున్నారు.



తేనె ఉత్పత్తిని పరిశీలన చేస్తున్న రామచంద్రరావు

తేనె ఎలా తయారవుతుందంటే...

తులసీ రామచంద్రరావు, తేనె తయారీదారుడు



మాది గుంటూరు జిల్లా పొన్నూరు మండలం దండమూడి గ్రామం. మా తండ్రి దాదాపు యాభై ఏళ్లుగా తేనె టీగల పెంపకంతో తేనె ఉత్పత్తి చేస్తున్నారు. ఈక్రమంలో ఆయన నుంచి మెళకువలు నేర్చుకున్నా. ప్రస్తుతం సుమారు 150 తేనె టీగల బాక్సులను హైవే పక్కన పొలాల్లో ఉంచి తేనెను ఉత్పత్తి చేస్తున్నారు. వీటిల్లో ఒక్కో బాక్సులో సుమారు 40 - 50 వేల వరకు తేనె టీగలు ఉంటాయి. ఒక్కో బాక్సులో సుమారు నాలుగు అరలు ఉంటాయి. ఒక్కో అరకు ఒక్కో రాణి, వేల సంఖ్యలో సిపాయిలు, పూత ఈగలు, పూలు ఈగలు ఉంటాయి. రాణి ఈగ పిల్లల పెంపకం చేస్తుండగా, పూలు ఈగలు ఏయే ప్రదేశాల్లో తేనె పుప్పొడికి అనుకూలంగా ఉన్నదో ఆ సమాచారాన్ని పూత ఈగలకు చేరవేస్తాయి. దీంతో పూత ఈగలు తేనెను పూల నుంచి పీల్చుకుని బాక్సుల్లోకి చేరతాయి. ఇదంతా జరుగుతుండగా సిపాయి ఈగలు(సైనికులు) బాక్సుల్లో ఉన్న తేనె వద్దకు ఎవ్వరినీ రానీయకుండా కాపలా కాస్తుంటాయి. ఇన్ని ప్రక్రియలతో తేనె తయారవుతుంది.





రాణి ఈగ చుట్టూ సిపాయి ఈగలు

● కష్టిస్తే ఆదాయం అందినట్లే...

ఈ ప్రక్రియ సక్రమంగా సాగితే ఒక్కో బాక్సు నుంచి సుమారు 4-5 కేజీల తేనె లభిస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ తేనె విలువ రూ.400-500 మధ్య ఉంది. మొత్తంగా పంట కాల పరిమితి ముగిసే సరికి 750 కేజీల వరకు తేనెను సేకరించి హోల్‌సేల్, లేదా రిటైల్ మార్కెట్‌లకు విక్రయిస్తున్నారు. అంటే సుమారు 40 రోజుల్లో రూ.4లక్షలకు వరకు చేతికి అందగా, ఖర్చులు, శ్రమ రూ.2 లక్షలు మినహాయించిన రూ.2లక్షల వరకు ఆదాయం వస్తుంది.

పంట కాల పరిమితి, విధి విధానం

సాధారణంగా ఒక్కచోట ఉత్పత్తి ప్రారంభిస్తే నలభై రోజులకు పంట చేతికి అందుతుంది. ఈ నలభై రోజులపాటు నిత్యం రామచంద్రరావుతో సహా ఉన్న నలుగురు వ్యక్తులు ప్రతిరోజూ లేదా రోజుమార్చి రోజు పర్యవేక్షిస్తుంటారు. వైరస్ సోకకుండా బాక్స్‌ల బయట వైపు నివారణ మందు చల్లుతారు. అలాగే ఈ నలభై రోజుల్లో పెద్ద వర్షం సంభవిస్తే నష్టం వాటిల్లినట్లే. నిత్యం బాక్సులను శుభ్రం చేసుకుంటూ పరిరక్షించాలి. బాక్సుకు సమస్య వస్తే దానిని తొలగించి జార్ఖండ్ నుంచి సుమారు రూ.5-6 వేలకు ఒక బాక్సు తెచ్చి ఏర్పాటు చేశారు. ఒక్కో బాక్సులో సుమారు 40 - 50వేల వరకు తేనె టీగలు ఉంటాయి.



టెన్త్ విద్యార్థులకు సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజనం

ఒంగోలు విద్య, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ రంగ ఉన్నత పాఠశాలల్లో ఎస్‌ఈఆర్టీ రూపొందించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సెలవు రోజుల్లో కూడా పాఠశాలలకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు బడిలోనే మధ్యాహ్న భోజనం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు అధిక ఉత్తీర్ణత సాధించేందుకు, విద్యార్థుల్లో పరీక్షలంటే భయాన్ని పోగొట్టి ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు ఎస్‌సీఈఆర్టీ 100 రోజుల ప్రణాళికను రూపొందించింది. ఈ ప్రణాళిక ప్రకారం ప్రభుత్వ సెలవులు అయిన రెండవ శనివారం, ఆదివారం కూడా విద్యార్థులు పాఠశాలల్లో తరగతులకు హాజరు కావాలి. ఆ రోజుల్లో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మార్చి 10 వరకు సెలవు రోజుల్లో విద్యార్థులకు భోజనం అందిస్తారు. రెండవ శనివారం రోజు శనివారం మెనూ, ఆదివారం అయితే సోమవారం నాటి మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తారు.

సమ్మోహనభరితం.. సందేశాత్మకం

- అలరించిన ఎన్టీఆర్ కళాపరిషత్ ప్రదర్శనలు
- ఆలోచింపజేసిన నాటిక

ఒంగోలు కల్చరల్, జనవరి23(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పీవీఆర్ మునిసిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎన్టీఆర్ కళాపరిషత్ కార్యక్రమాలు ప్రేక్షకులను ఒకవైపు సమ్మోహపరిచే విధంగా మరోవైపు సందేశాత్మకంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం నాదస్వర కచ్చేరి, కోలాట ప్రదర్శనతో పాటు చర్చాగోష్ఠి, నాటక, నృత్య రూప ప్రదర్శనలు జరిగాయి.

● శ్రవణానందంగా నాదస్వర కచేరి

ఒంగోలు భారతి నాదస్వర బృందం ప్రదర్శించిన నాదస్వర కచేరి శ్రవణానందంగా కొనసాగింది. ఇందులో పాల్గొన్న కళాకారులు హంసధ్వని, కళ్యాణి, ఆరభి రాగాలలో త్యాగరాజ స్వామి, మైసూర్ వాసుదేవన్ వంటి వారు రచించిన పలు కీర్తనలను ఆలపించారు. లక్కవరం మస్తాన్‌రావు, భీమవరపు అశోక్‌కుమార్, పునుగోడు నాగేశ్వరరావు, నాదెళ్ల మహేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

● ఉత్సాహంగా కోలాటం

సంతమాగులూరు మండలం ఏల్చూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన కోలాట ప్రదర్శన ఉత్సాహభరితంగా కొనసాగింది. కోలాట శిక్షకులు సింహాద్రి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కొనసాగిన ఈ ప్రదర్శనలో గణపతి ప్రార్థన, ఆంజనేయ కీర్తన, మురళీగాన లోల, రేపల్లె వాడలో చల్లనమ్మబోవ, తల్లి యశోద తనయుడు నీవే, ఏరువాక వంటి పలు జానపద గీతాలకు బాలికలు లయబద్ధమైన కోలాటాన్ని ప్రదర్శించారు.

● ఆత్మనివేదనే అనన్య భక్తి మార్గం

ఇక నవవిధ భక్తులలో ఆత్మనివేదన అత్యంత విశిష్టమైదని తెలియజేసే విధంగా కొనసాగిన నృత్యరూపకం పాండురంగం భజే. కర్ణాటక బంగారుపేటకు చెందిన భారత కళా గ్రామ నాట్య గురుకులానికి చెందిన కూచిపూడి నృత్య కళాకారులు ప్రదర్శించిన ఈ నృత్య రూపకానికి డాక్టర్ వసంత్‌కిరణ్ నృత్య దర్శకత్వం వహించారు. వివిధ ప్రాంతాలలో పయనించిన ఒక భక్తుడు భాష ఏదైనా భావమొక్కటే, భగవంతుని ప్రార్థించే విధానం ఒక్కటే అని తెలుసుకుని అన్ని రూపాలలో ఉన్నదీ ఆ మహావిష్ణువే అనే సత్యాన్ని గ్రహించి చివరకు పండరీపురంలో వెలసిన పాండురంగని దర్శించుకుని అక్కడే ఆత్మనివేదన చేసి ప్రాణాలను వదిలిన వైనాన్ని ఈ నృత్యరూపకంలో ప్రదర్శించారు.



ఆకట్టుకున్న భరత నాట్యం

ఆలోచింపజేసిన 'ఇంద్రప్రస్థం'

ఇక అభినయ ఆర్ట్స్ గుంటూరు నటీనటులు ప్రదర్శించిన ఇంద్రప్రస్థం సాంఘిక నాటిక ఆలోచింపజేసేదిగా కొనసాగి ప్రేక్షకుల మన్ననలందుకుంది. సృష్టిలో ప్రేమ గొప్పదే అయినప్పటికీ అది వెర్రితలలు వేస్తే ఎంతటి అనర్థానికి దారితీస్తుంది, అలా తమ పిల్లలు ప్రేమ మోజులో పడి పెడతోవపట్టకుండా తల్లిదండ్రులు ఏ విధంగా వారిని సరైన మార్గంలో నడపాలి అనే కథాంశంతో ఈ నాటిక కొనసాగింది. ఎన్.రవీంద్రారెడ్డి దర్శకత్వం వహించిన ఈ నాటికలో వివిధ పాత్రలలో ఎన్.రవీంద్రా రెడ్డి, వి.సి.హెచ్.కె.ప్రసాద్, ఎన్.సూర్య, టి.శ్రీలేఖ, కుసుమ సాయి తదితరులు చక్కటి హావభావాలతో నటించి మెప్పించారు.





ఆహార వ్యర్థాన్ని అరికడదాం..

కళాపరిషత్ ఉత్సవాలలో భాగంగా నిర్వహించన చర్చాగోష్ఠిలో పలువురు వక్తలు పాల్గొని దేశంలో ఆహార పదార్థాలు ఏవిధంగా వ్యర్థం అవుతున్నాయి. ఒకవైపు ఒక పూట తినడానికి కూడా ఆహారం దొరక్క కోట్లాదిమంది ప్రజలు అలమటిస్తుంటే ఆడంబరాలతో శుభకార్యాలలో ఎంత ఆహారం వృధా పోతుంది అనే అంశంపై లోతైన చర్చాగోష్ఠిని నిర్వహించారు. బెజవాడ వెంకట్రావు సంధానకర్తగా వ్యవహరించిన ఈ చర్చాగోష్ఠిలో విశ్రాంత న్యాయాధికారి కె.బాలకృష్ణారెడ్డి, నాగభైరవ సాహిత్యపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు నల్లూరి శాంతి, డి.ఆంజనేయులు, ధనుశ్రీ తదితరులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలను ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు పర్యవేక్షించగా ప్రధాన కార్యదర్శి అన్నమనేని ప్రసాదరావు, శివప్రసాద్, ఈదర గౌతం నిర్వహణా సహకారాన్ని అందజేశారు.

వెలిగొండపై పాలకులు నిర్లక్ష్యం వీడాలి

సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

కనిగిరి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వీడాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. కనిగిరిలోని క్లబ్‌రోడ్డులో గురువారం సాయంత్రం జరిగిన వెలిగొండ జలాల సాధన సదస్సు బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు రూ. 4వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా పశ్చిమ ప్రకాశం ప్రజలు దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 35 ఏళ్ల క్రితం ఎన్టీ రామారావు వెలిగొండ ప్రాజెక్టుకు అంకురార్పణ చేస్తే చంద్రబాబు శంకుస్థాపనతో సరిపెట్టారని ఎద్దేవా చేశారు. తండ్రి వైఎస్ఆర్ భూమి పూజలు చేస్తే కుమారుడు జగన్‌రెడ్డి ప్రాజెక్టును గాలికొదిలేశారని మండిపడ్డారు. జగన్‌రెడ్డి నిర్లక్ష్యం కారణంగా 35ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఈ ప్రాంత ప్రజలు మంచినీళ్లు చూడకుండానే చనిపోయే దుర్గతికి పాలకులు తీసుకు వచ్చారని ధ్వజమెత్తారు. రూ. 500 కోట్లతో జగన్ విశాఖలో రుషికొండపై ఇల్లు కట్టుకున్నాడని, అదే నిధులు వెలిగొండ ప్రాజెక్టుకు ఇస్తే ఒక సొరంగం పూర్తి అయ్యేదన్నారు. తక్షణమే వచ్చే బడ్జెట్‌లో రూ. 2 వేల కోట్లు మొదటి దశలో మరో 2వేల కోట్లు రెండవ దశలో కేటాయంచకపోతే ఈ ప్రాంత ప్రజలు ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. జగన్ చేసిన పాపాన్ని చంద్రబాబు తీర్చాల్సిందేనన్నారు. రూ. 50వేల కోట్లు ఖర్చు చేసి పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తే 7లక్షల ఎకరాలకునీరు అందుతుందని, అదే వెలిగొండ ప్రాజెక్టుకు పదివేల కోట్లు ఖర్చు చేస్తే మూడున్నర లక్షల ఎకరాలకు నీరు అందించవచ్చనే విషయాన్ని పాలకులు గ్రహించాలన్నారు. స్థానిక ఎమ్మెల్యేపై ప్రజలు పెంచుకున్న విశ్వాసాన్ని వమ్ము చేయకుండా వెలిగొండకు సీఎం వద్ద నిధులు రాబట్టేందుకు కృషి చేయాలని హితవు పలికారు. పార్టీలకతీతంగా వెలిగొండ సాధనకు జరిగే పోరాటంలో పాలు పంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి, హనీఫ్, కంకణాల ఆంజనేయులు, డీ సోమయ్య, ఊసా వెంకటేశ్వర్లు, రాజ్యలక్ష్మి, రమాదేవి, పీసీ కేశవరావు, మాల్యాద్రి, ఎం.రమేష్, బడుగు వెంకటేశ్వర్లు, ఆర్. మాలకొండయ్య, పిల్లి తిప్పారెడ్డి, మహేష్, వీ మాలకొండారెడ్డి, మీగడ వెంకటేశ్వరరెడ్డి, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

ఎరుపెక్కిన కనిగిరి

సీపీఎం శ్రేణుల భారీ ప్రదర్శన

కనిగిరి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఎర్రజెండాలతో కనిగిరి రెపరెపలాడింది. కనిగిరిలో సుందరయ్య భవనం పునః ప్రారంభం, వెలిగొండ జలాల సాధనా సదస్సు సందర్భంగా గురువారం కనిగిరి వచ్చిన సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులుకు సీపీఎం శ్రేణులతో పాటు ప్రజలు ఘన స్వాగతం పలుకుతూ భారీ ర్యాలీ నిర్వహించారు. దాతల సహకారంతో పునర్ నిర్మితమైన సుందరయ్య భవనాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత పట్టణంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయం నుంచి సుగుణావతమ్మ సెంటర్ వరకు ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలోని 6 మండలాల నుంచి సీపీఎం శ్రేణులు, ప్రజలు, ప్రజాసంఘాల నాయకులతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో ప్రధాన వీధులన్నీ ఎర్రజెండాలతో కిక్కిరిసి పోయాయి. నేరేడుపల్లి గ్రామానికి చెందిన చిన్నారుల కోలాట ప్రదర్శన ఎంతో అలరించింది. ప్రజానాట్యమండలి గీతాలతో, డప్పుల వాయిద్యాలతో కనిగిరి హోరెత్తింది. బీవీరాఘవులుకు ప్రజలు, సీపీఎం శ్రేణులు అడుగడుగునా పూలవర్షంతో నడిపించారు. భారీ ప్రదర్శనగా క్లబ్‌రోడ్డు వరకు వెలిగొండ జలాల సాధన సదస్సు సభ వద్దకు సాగింది. ఈ ప్రదర్శనలో సీపీఎం జిల్లా నాయకులు, ప్రాంతీయ నాయకులు, మండలాల నాయకులు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న సీపీఎం శ్రేణులు



ఎస్సీ వసతిగృహాల్లో

మౌలిక వసతుల కల్పన షురూ..

- చీమకుర్తి బాలుర హాస్టల్‌లో రూ.23లక్షలతో మరమ్మతులు
- శిథిలావస్థలో బాలికల హాస్టల్
- పునర్నిర్మాణానికి రూ.2కోట్ల డీఎంఎఫ్ నిధులు
- అనుమతుల్లో జాప్యంతో అవస్థలు



ఎస్సీ బాలుర వసతిగృహానికి నిర్వహిస్తున్న మరమ్మతులు



శిథిలమైన బాలికల హాస్టల్ భవనం





బాలికహాస్టల్‌లో పెచ్చులూడిపోతున్న శ్లాబు, ఆరుబయట చదువుకుంటున్న విద్యార్థినులు

చీమకుర్తి, జనవరి23 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ వసతి గృహల అభివృద్ధి, బాగోగులపై చిన్నచూపు వహించటం జరిగింది. పేద విద్యార్థులకు ఆవాసం కల్పించే హాస్టల్స్ అధ్వానంగా, శిథిలస్థితికి చేరుకొని ప్రమాదకరంగా మారాయి. ఈ పరిసితుల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎస్సీ వసతిగృహాల్లో మౌలికవసతుల కల్పనపై దృష్టి సారించింది. సాంఘికసంక్షేమశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే జిల్లాకు చెందిన మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చీమకుర్తిలోని ఎస్సీ బాలుర వసతిగృహన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఉన్న పరిస్థితులను ప్రత్యక్షంగా చూసిన మంత్రి విస్తుపోయారు. అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు, పెచ్చులూడుతున్న పైకప్పులను చూసిన చలించిపోయి తక్షణమే స్పందించారు. వెంటనే మరమ్మతులు చేపట్టటంతో పాటు మౌలిక వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇదే సందర్భంగా శిథిలస్థితికి చేరుకున్న బాలికల వసతిగృహం విషయం మంత్రి దృష్టికి రాగా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈమేరకు బాలికల వసతిగృహాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా సందర్శించగా విద్యార్థినుల మాటల్లో అక్కడి దుర్భర పరిస్థితులను తెలుసుకున్నారు. వర్షం పడితే గదుల్లో చేరే నీటితో పడుతున్న అవస్థలు, ఏ క్షణాన ఏప్రమాదం జరుగుతుందో అన్న భయం వారిలో కనిపించింది. దీంతో ఇక్కడి పరిస్థితులను మంత్రి దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత అధికారులతో చర్చించారు. ఈమేరకు శిథిలస్థితికి చేరుకున్న బాలిక వసతిగృహన్ని కూల్చివేసి తిరిగి నూతనంగా భవనం, గదుల నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు డిస్ట్రిక్ మినరల్ ఫండ్ నుంచి రూ.2 కోట్ల నిధులను సైతం మంజూరు చేశారు.

అనుమతుల్లో జాప్యం..

శిథిలస్థితికి చేరుకున్న బాలిక వసతి గృహ భవనాన్ని పునర్ నిర్మించటానికి అవసరమైన అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ అనుమతుల్లో నెలకొన్న తీవ్ర జాప్యం విద్యార్థినులకు శాపంగా మారింది. అడ్మినిస్ట్రేషన్ అనుమతి కోసం ఎదురుచూస్తున్న దశలో ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫైల్ ఉంది. ఈ అనుమతులు వచ్చిన తర్వాత నిర్మాణానికి టెండర్లు పిలుపు, టెక్నికల్ అనుమతులు మంజూరు, తదుపరి నిర్మాణ పనులను ప్రారంభించాల్సి ఉంది. ఈలోపు శిథిల భవనంలో ఉంటున్న విద్యార్థినులు ఉండటానికి ప్రత్యామ్నయం చూడటం, తర్వాత ఇపుడున్న భవనాన్ని కూల్చి వేయాల్సి ఉంది. ఇవన్ని త్వరిత గతిన పూర్తి చేసేలా మంత్రి చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

బాలుర హాస్టల్‌లో మరమ్మతు పనులు

చీమకుర్తిలో ఉన్న ఎస్సీ బాలుర వసతిగృహంలో మంత్రి స్వామి ఆదేశాల మేరకు రూ.23లక్షలతో బుధవారం నుంచి మరమ్మతుల పనులు ప్రారంభించారు. దెబ్బతిన్న పైకప్పుకు మరమ్మతులు చేపట్టారు. తదుపరి మరుగుదొడ్లు, ఇతర గదులకు చేపట్టటంతోపాటు ఇతర మౌలికవసతులను కల్పించనున్నట్లు ఏఈ శ్రీహరి తెలిపారు. అదేవిధంగా బాలికల వసతిగృహం పునర్ నిర్మాణపనులను త్వరలోనే చేపడతామన్నారు. అడ్మినిస్ట్రేషన్ అనుమతులు కోసం ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు.

పవన్‌ను కలిసిన బాలినేని



పవన్‌కల్యాణ్‌తో బాలినేని

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి బుధవారం విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. పలు అంశాలపై వారు చర్చించుకున్నారు.

'మేరుగ' పరామర్శ

మద్దిపాడు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఒంగోలు వెంకటరమణ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మద్దిపాడు మండల వైసీపీ అధ్యక్షుడు మండవ అప్పారావును గురువారం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ మేరుగ నాగార్జున పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

మద్దిపాడు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 25న మద్దిపాడు ఎంపీడీవో కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ అధికారి తెలిపారు. వివిధ సంస్థలు పాల్గొంటాయని వివరాలకు 9963005209 సెల్ నంబరులో సంప్రదించాలని కోరారు.

ఘనంగా మంత్రి లోకేష్ పుట్టినరోజు వేడుకలు

- వేడుకల్లో పాల్గొన్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే దామచర్ల



ఒంగోలులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల



నాగులుప్పలపాడులో నాయకుల రక్తదానం

సింగరాయకొండ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ కీలక భూమిక పోషించారని మంత్రి డాక్టర్ స్వామి పేర్కొన్నారు. గురువారం సింగరాయకొండలో జరిగిన లోకేష్ జన్మదిన వేడుకల్లో ఆయన హాజరై కేక్ కట్ చేశారు. ఎన్టీఆర్, దామచర్ల విగ్రహాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, షేక్ సందానీ బాషా, కూనపరెడ్డి సుబ్బారావు, గాంధీచౌదరి, పులి ప్రసాద్, గాలి హరిబాబు, బ్రహ్మయ్య, బ్రహ్మేశ్వరావు పాల్గొన్నారు.

ఒంగోలులో..

ఒంగోలు కార్పొరేషన్: మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు గురువారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ప్రతినిధి బెజవాడ సురేష్‌రెడ్డి, మేయర్ గంగాడ సుజాత, నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శివం శరణాలయంలో..

స్థానిక సంతపేటలోని శివం శరణాలయంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ సహకారంతో లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న నలుగురు పేదలకు చీమకుర్తి మండలం రామతీర్థం క్యాంపు కాలనీకి చెందిన దేవాంగుల రుత్విక్‌కి రూ.10వేలు, నరసరావుపేటకు చెందిన సీహెచ్.సుబ్బారావుకు రూ.8వేలు, అన్నవరప్పాడుకు చెందిన కె.కొండయ్యకు రూ.8వేలు, ఒంగోలు మిలటరీ కాలనీకి చెందిన ఎస్.సుజాతకు రూ.5వేలు, సంతనూతలపాడుకు చెందిన బాషా అనే దివ్యాంగుడికి మూడు చక్రాల సైకిల్‌ను అందజేశారు. అలాగే అన్నదానం చేశారు. కార్యక్రమంలో మారెళ్ళ సుబ్బారావు, ఫౌండర్ శ్రీహరి, కొనిజేటి ధనుష్, సాయిచరణ్, ఆరేతోటి వెంకటేష్, పొందూరి హరి, చింతం తిరుమల, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు నాగులుప్పలపాడు బస్టాండ్ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి ముఖ్య అతిథిగా హాజరై కేక్‌ను కట్ చేశారు. అనంతరం మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన వీరయ్యచౌదరి రక్తదానం చేశారు. మరో 70 మంది రక్తదానం చేయగా ఒంగోలు నవ్య బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సేకరించారు. అలాగే అన్నదానం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, టంగుటూరు మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, డాక్టర్ చంద్రశేఖర్, రావూరి రవీంద్రనాథ్, మండల అధ్యక్షులు మండవ జయంత్‌బాబు, మద్దినేని హరిబాబు, తేళ్ల మనోజ్‌కుమార్, కాకర్ల లక్ష్మీవరప్రసాద్, ఢాకా శ్రీనివాసరెడ్డి, ఆళ్ల నాగార్జున, ఇంటూరి శ్రీనివాసరావు, మున్నంగి పున్నారెడ్డి, తెలగతోటి జాన్సన్ మెట్టు సుబ్బయ్యనాయుడు, నాయకులు కిషోర్‌బాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి: లోకేష్ జన్మదిన వేడుకలను కొండపిలోని బస్టాండ్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి కేక్ కట్ చేశారు.

జరుగుమల్లిలో..

జరుగుమల్లిలోని పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీసీనియర్ నాయకుడు పోటు శ్రీనివాసమురళి, నాయకులు ఏలూరి రాంబాబు పాల్గొన్నారు.

- పొన్నలూరులోని ఎన్టీఆర్ విగ్రహం కూడలిలో పార్టీ మండల అధ్యక్షుడు సాంబశివరావు కేక్ కట్‌చేశారు.

మర్రిపూడిలో..

మర్రిపూడి: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో లోకేష్ జన్మదినోత్సవం సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. నాయకులు ఎద్రమోతు శ్రీనివాసులు, చేరెడ్డి నర్సారెడ్డి, గొంటు హనుమారెడ్డి, వీరనారాయణ, తుళ్ళూరి నరసింహారావు పాల్గొన్నారు.

టంగుటూరులో..

టంగుటూరు: లోకేష్ జన్మదిన వేడుకలు టంగుటూరులోని బస్టాండ్ సెంటర్‌లో గురువారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కామని విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి : మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలను గురువారం చీమకుర్తి ఘనంగా నిర్వహించారు. ఎస్‌కేఆర్ బధిరుల పాఠశాలలో టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గొల్లపూడి సుబ్బారావు, నాయకులు యడ్లపల్లి రామబ్రహ్మం, కాట్రగడ్డ రమణయ్య, కౌన్సిలర్ గొల్లపూడి రమాదేవి, గోరంట్ల అంజలి, రావిపాటి రాంబాబు, కందిమళ్ల గంగాధరరావు, రఫి, గోగినేని శ్రీనివాసరావు, గంగుల శివపార్వతి, అవనిగడ్డ శేషయ్య, పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు సంతనూతలపాడు జడ్పీహైస్కూల్, పేర్నమిట్ట పరిధిలోని నవాబ్‌పేటలోని మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర మహిళా నాయకురాలు అరికట్ల సుమతి, మండల అధ్యక్షుడు మద్దినేనిహరిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు నోటుపుస్తకాలు, అట్టలు, పెన్నులను అందజేశారు. పేర్నమిట్టలోని పాలకేంద్రం వద్ద ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి వద్ద రాష్ట్ర మహిళా నాయకురాలు అరికట్ల సుమతి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భారీ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, రావులపల్లి సురేష్‌బాబు, నల్లూరి నారా యణరావు, సాధినేని శ్రీరామ్మూర్తి, పాతూరి నాగేశ్వరరావు, మందాడి వెంకటేశ్వర్లు తదితరలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న అరికట్ల సుమతి, హరిబాబు

మద్దిపాడులో..

మద్దిపాడు: మంత్రి లోకేష్ పుట్టినరోజు వేడుకలను మద్దిపాడు టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు జయంత్‌బాబు, ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, ఎంపీటీసీ దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్‌తో మెరుగైన జీవనం : దామచర్ల



కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : వెల్‌నెస్ సెంటర్ ద్వారా లభించే సేవలతో మెరుగైన జీవన విధానం అలవరుచుకోవాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో వెల్‌నెస్ సెంటర్‌ను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న జీవన శైలి కారణంగా మధుమేహం, హైపర్‌టెన్షన్ లాంటి వాటి నుంచి ముందు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, అందులో భాగంగా ప్రతి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వెల్‌నెస్ సెంటర్‌లను ఏర్పాటు చేస్తుందని చెప్పారు. ఫిబ్రవరి మొదటి వారంలో కలెక్టర్‌తో కలిసి జీజీహెచ్ అధికారులతో సమీక్ష నిర్వహించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, సూపరింటెండెంట్ డాక్టర్ టి.జమున, మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ ఏడుకొండలు, డిప్యూటీ సూపరింటెండెంట్ నామినేని కిరణ్‌కుమార్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక బండ్లమిట్టలోని కార్గిల్‌స్థూపం వద్ద చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీ జిల్లా అధ్యక్షుడు శెగ్గెం శ్రీనివాసరావు నివాళులర్పించారు. కార్యక్రమంలో యోగయ్యయాదవ్, పీవీ.కృష్ణారెడ్డి, డి.శివాజీ, నాగేశ్వరరావు, పి.దామోదర్, రాజేష్‌వర్మ, ఎ.అనిల్, కాటా రాధాకృష్ణమూర్తి, కొఠారి సుధాకర్, డి.శ్రీనివాసరావు, పి.మోజే, పి.లక్ష్మణ్, కొలా వాసు పాల్గొన్నారు.

నేతాజీ స్కూలులో

ఒంగోలు విద్య: నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలను బుధవారం స్థానిక రైల్‌పేటలోని నేతాజీ స్కూలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి అపుస్మా జిల్లా అధ్యక్షుడు కొల్లా మాధవరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కరస్పాండెంట్ మల్లికార్జునరావు, అపుస్మా నగర అధ్యక్ష, కార్యదర్శులు కె.మురళీకృష్ణ, వంశీకృష్ణ, లక్ష్మీనారాయణ, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో

స్థానిక కేంద్రీయ విద్యాలయంలో నేతాజీ జయంతి వేడుకలను పరాక్రమ దీవస్ పేరుతో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ, ప్రిన్సిపాల్ మనీష్‌కుమార్, మార్కాపురం జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఈదుమూడిలో..

నాగులుప్పలపాడు: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఈదుమూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శంకరరావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గాధంశెట్టి శ్రీనివాసరావు, కామిశెట్టి శంకరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జేఏసీ నేతలు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం అసోసియేషన్ కార్యకలాపాలను నిర్వహించుకునేందుకు కలెక్టరేట్‌లో ఒక గదిని కేటాయించాలని అసోసియేషన్ గురువారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిసి కోరారు. ఈ సందర్భంగా జేఏసీ అమరావతి మహిళా విభాగం ప్రతినిధులు మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో పనిచేసే మహిళా ఉద్యోగులకు వారు పనిచేసే చోటే వాష్ రూముల ఏర్పాటు చేయాలని కోరారు. అసోసియేషన్ భవనం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని వినతి చేశారు. కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా చైర్‌పర్సన్ జయలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు,పవన్ ఫొటోలకు పాలాభిషేకం

కొత్తపట్నం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గవళ్లపాలెంలో గురువారం తెలుగుదేశం పార్టీ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఫొటోలకు పాలాభిషేకం నిర్వహించారు. రాష్ట్రంలో గీత కార్మికులకు 335 మద్యం కేటాయించి తమ నిజాయితీని చాటుకున్నారని గుర్తు చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఏపీ గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంటు కార్పొరేషన్ డైరెక్టర్ జంపాని రామచంద్రగౌడ్ ఆధ్వర్యంలో పాలాభిషేకం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గవళ్లపాలెం సర్పంచ్ బలగాని వెంకటనారాయణ, నియోజకవర్గ బీసీ సెల్ అధ్య క్షులు బలగాని వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ తాతా శ్రీనివాసరావు, తాతా వెంకట్రావు, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవ బ్రోచర్ల ఆవిష్కరణ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో వచ్చేనెల 15, 16 తేదీల్లో జరగనున్న ప్రకాశం బలోత్సవ్ బ్రోచర్లు, ఎంట్రీఫారాలను ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి, డీఈవో కిరణ్‌కుమార్ ఆవిష్కరించారు. స్థానిక ఎంఎస్‌ఫంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో బాలోత్సవ్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బండారు లక్ష్మీనారాయణ, కె.సుబ్రహ్మణ్యంలు మాట్లాడుతూ బాలోత్సవాల ఎంట్రీ ఫారాలు ఈనెల 26వతేదీలోపు అన్ని పాఠశాలలకు అందిస్తామన్నారు. వాటిని నింపి వచ్చేనెల 8వతేదీలోపు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారులు చంద్రమౌళీశ్వరరావు, శామ్యూల్, ఎంఈవో కిషోర్‌బాబు, వెంకారెడ్డి, సరస్వతి, యుటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, డి.వీరాంజనేయులు పాల్గొన్నారు.

28న దివ్యాంగ పింఛనుదారుల పరిశీలన

మద్దిపాడు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలో దివ్యాంగుల పెన్షన్ వెరిఫికేషన్ ఈనెల 28న చేయనున్నట్లు ఎంపీడీవో వి.జ్యోతి గురువారం తెలిపారు. లబ్దిదారులు ఆ రోజు అందుబాటులో ఉండాలని ఆమె కోరారు.

కావలి ట్రంకురోడ్డుకు పార్వతమ్మ పేరు

- ప్రభుత్వం ఉత్తర్వులు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మాజీ ఎంపీ, కావలి అసెంబ్లీ నియోజకవర్గానికి దివంగత మాగుంట పార్వతమ్మ చేసిన సేవలకు గుర్తుగా కావలిలోని ట్రంకురోడ్డుకు పార్వతమ్మ పేరును ఖరారు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కావలి శాసనసభ్యుడు కావ్య కృష్ణారెడ్డి నెల్లూరు నియోజకవర్గ ప్రజలకు పార్వతమ్మచేసిన సేవలకు గుర్తింపుగా కావలి పట్టణంలోని ట్రంకురోడ్డుకు ఆమె పేరును పెట్టాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. దీంతో ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సీఎం చంద్రబాబునాయుడుకు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ ఎంపీపీ రమణమ్మకు పరామర్శ



రమణమ్మతో మాట్లాడుతున్న మంత్రి స్వామి

సింగరాయకొండ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపీపీ చీమకుర్తి రమణమ్మను మూలగుంటపాడులోని వారి స్వగృహంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి గురవారం పరామర్శించారు. ఆయన వెంట నేతలు కోట శ్రీనివాసులు, మల్లెబోయిన భాస్కర్, సన్నెబోయిన శ్రీను, సాదం బ్రహ్మయ్య, అంకమరావు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

సంతనూతలపాడు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఎండ్లూరు డొంకవద్ద మహిళాప్రాంగణంలో నిరుద్యోగ మహిళలకు శుక్రవారం నుంచి బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రవితేజయాదవ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 18నుంచి 45 సంవత్సరాల వయస్సుగల నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు స్కిల్‌హబ్ కో-ఆర్డినేటర్ షేక్ బాషాను 9963005209 సెల్ నంబరులో సంప్రదించాలన్నారు.

పశువులకు వైద్య సేవలు

నాగులుప్పలపాడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అమ్మనబ్రోలు పశువైద్యశాల వద్ద గురువారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యురాలు సురేఖ దూడలు, జీవాలకు నట్టల నివారణ మందు తాపించారు. అలాగే పశువులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఏడీఏ నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

స్కిల్‌హబ్‌లో నిరుద్యోగులకు శిక్షణ

కొండపి, జనవరి23 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొండపిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని స్కిల్‌హబ్ సెంటర్‌లో నిరుద్యోగ యువతీ, యువకులకు టైలరింగ్, డొమెస్టిక్ ఐటీ హెల్ప్‌డెస్క్ అటెండెంట్ కోర్సులలో మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఇస్తున్నామని సెంటర్ కోఆర్డినేటర్, గోపీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 88979 64505 సెల్‌నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రాంగ్‌రూట్‌లో ప్రయాణం ప్రమాదకరం

- ఎస్‌ఐ శివరామయ్య

మద్దిపాడు, జనవరి23(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతలో భాగంగా వాహనదారులు రాంగ్‌రూట్‌లో ప్రయాణం చేయటం ప్రమాదకరమని ఎస్‌ఐ శివరామయ్య పేర్కొన్నారు. గురువారం మద్దిపాడులో ఆయన మాట్లాడుతూ మండలంలోని వెల్లంపల్లి గ్రామం, తాళ్ళూరు రోడ్డులోని కొలచనకోట, దొడ్డవరం, తెల్లబాడు నుంచి మద్దిపాడు వచ్చే వారు వెల్లంపల్లి గ్రామం దగ్గర నుంచి రాంగ్‌రూట్‌లో ప్రయాణం చేయటం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. అందువల్ల వాహనదారులు రాంగ్ రూట్లో కాకుండా గుండ్లాపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి కిందుగా యూటర్న్ తీసుకుని ఒంగోలు వైపు రావాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణించే వాహనదారులపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

కొప్పోలు రోడ్డులో డ్రైనేజీ ఏర్పాటు



గుంతలను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు(రూరల్), జనవరి23(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర పరిధిలోని కొప్పోలు రోడ్డులో ఆర్‌అండ్‌బీ శాఖతో కలిసి డ్రైనేజీ నిర్మాణం చేపడతామని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక కొప్పోలు రోడ్డులోని బృందావన్ గార్డెన్స్‌లో గుంతలు పడిని రోడ్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. కొప్పోలురోడ్డులో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుతో పాటు సీసీరోడ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. ప్రస్తుతం చీమకుర్తి కొండ మట్టితో మరమ్మతు పనులు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఈఈ చంద్రయ్య, ఏఈ సౌజన్య , నాయకులు దివి బ్రహ్మానందం (బుజ్జి), పోస్టల్ మోహన్‌రావు, షేక్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

సింగరాయకొండ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య సూచించారు. మండలంలోని సోమరాజుపల్లి గ్రామంలో గురువారం సింగరాయకొండ పశువైద్య శాల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఉచితంగా పోషపోషకులకు మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి ఎస్.హజరత్, పాకల పశువైద్యాధికారి చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' వైద్యసేవల పరిశీలన



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

కొత్తపట్నం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈతముక్కల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గురువారం స్వర్ణాంధ్ర పట్టపుపాలెంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించే ప్రాంతానికి అన్ని రకాల మందులను తీసుకురావాలని చెప్పారు. కుష్టు కేసుల నిర్ధారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని ఆయన సూచించారు. వైద్యసిబ్బంది గ్రామంలోని అన్ని గృహాలను సందర్శించి వ్యాధులను గుర్తించి హెల్త్ ప్రొఫైల్ తయారు చేసి ఏఎన్‌ఎం యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి నవ్యారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

26న జరిగే ర్యాలీని విజయవంతం చేయాలి



అభివాదం చేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26న ఒంగోలులో జిల్లాస్థాయి మోటార్ సైకిల్, ట్రాక్టర్ ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు తెలిపారు. స్థానిక మల్లయ్యలింగంభవన్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల పట్ల చిన్నచూపు చూస్తుందని ఆరోపించారు. కొత్తగా తెచ్చిన సహకార చట్టం, వ్యవసాయ సాంకేతిక చట్టం రైతులను కార్పొరేట్ కంపెనీల పెత్తనం కిందకు తెచ్చేందుకేనని చెప్పారు. ఒంగోలులో జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు వడ్డె హనుమారెడ్డి, పమిడి వెంకట్రావు, ఎస్.లలితకుమారి, కె.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ

ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు



మాట్లాడుతున్న ఎస్ఐ బ్రహ్మనాయుడు

తర్లుపాడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడులోని వేణు గోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని తర్లుపాడు ఎస్ఐ బ్రహ్మనాయుడు ప్రారం భించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల కంటి జబ్బుల కలిగిన 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 20 మందికి శుక్లాలు గుర్తించి ఆపరేషన్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు జి.విజయ్, భాస్కర్‌రావు, పి.జనార్థన్, రవికుమార్, సుబ్రహ్మణ్యం, ఎన్.కార్తీక్, మల్లికార్జున్, రామకృష్ణారెడ్డి, ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యూత్‌వింగ్ అధ్యక్షుడిగా చంద్రమోహన్

గిద్దలూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ యూత్‌వింగ్ నియోజకవర్గ అధ్యక్షులుగా యల్లా చంద్రమోహన్ నియమితులయ్యారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ కె.నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ పటిష్ఠతకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

రోడ్లను శుభ్రంగా ఉంచాలి

గిద్దలూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రోడ్లను మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్ గురువారం తెల్లవారుజామున తనిఖీ చేశారు. రోడ్లు ఊడుస్తున్న పారిశుధ్య సిబ్బందితో మాట్లాడారు. నిర్ధేశించిన ప్రతీరోడ్డును శుభ్రంగా ఊడ్చాలని సూచించారు. తూతూమంత్రంగా ఊడిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సచివాలయం తనిఖీ

పట్టణంలోని కోటగడ్డ సచివాలయాన్ని కమిషనర్ వెంకటదాస్ గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి వెంటనే సమస్యకు పరిష్కారం చేయాలని సూచించారు. సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సచివాలయాల తనిఖీ



ఆధార్ సెంటర్‌ను తనిఖీచేస్తున్న ఎంపీడీవో

కొనకనమిట్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లగట్టు, చినమనగుండం గ్రామాల సచివాలయాలను ఎంపీడీవో ఈశ్వరమ్మ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాలకు సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చూడాలన్నారు. అంతేకాకుండా గొట్లగట్టు గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదుకేంద్రాని ఆమె తనిఖీచేసి ఆధార్ నమోదు లేని పిల్లలందరికి ఆధార్ నమోదు అయ్యేలా సచివాలసిబ్బంది, ఆశావర్కర్లు ఏఎన్ఎంలు చూడాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీదేవి, అంగన్‌వాడీ ఆయాలు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న కారు

● వ్యక్తికి గాయాలు

త్రిపురాంతకం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : వేగంగా ప్రయాణిస్తున్న కారు ఎదురుగా వస్తున్న బైకును ఢీకొన్న ప్రమాదంలో బైకుపై వెళుతున్న వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని గొల్లపల్లి వద్ద ఎన్‌హెచ్ 544డిపై గురువారం జరిగింది. గ్రామానికి చెందిన కటికి హరిబాబు బైకుపై వస్తున్న క్రమంలో కుంట నుండి త్రిపురాంతకం వైపు వెళుతున్న కారు వేగంగా ఢీకొట్టింది. ఈప్రమాదంలో హరిబాబు కాళ్లకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని ప్రదమ చికిత్స చేసి, వైద్యశాలకు తరలించారు.

అంత్యక్రియల విషయంలో వివాదం



వివాదస్పద స్థలంలో ఉంచిన మృతదేహం

పొదిలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏలూరు గ్రామ పంచాయతీలోని సల్లూరులో ఒక వ్యక్తి మృతి చెందాడు. మృతదేహానికి అంత్య క్రియల వ్యవహారంలో గ్రామంలోని ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకొంది. గ్రామంలో గతంలో హిందూ శ్మశాన వాటిక ఉంది. దానికి సమీపంలో ఆంజనేయస్వామి, పోలేరమ్మ దేవాలయాలు నిర్మాణం జరుగుతోంది. కనుక ఆప్రాంతంలో కాకుండా మరోచోట అంత్యక్రియలు నిర్వహించాలని ఒక వర్గం వాదన. అయితే మరోవర్గం మాత్రం గతం నుంచి ఇక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తున్నామని ఇప్పుడెలా మారుస్తామని పట్టుపడుతోంది. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, అధికారులు గ్రామానికి చేరుకొన్నారు. ఇరువురితో మాట్లాడి ఆప్రాంతంలో కాకుండా అంత్యక్రియల కోసం మరోమూడు ప్రదేశాలు చూపించారు. మృతదేహానికి సంబంధించి వర్గం వారు అందుకు సమ్మతించలేదు. దీంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది ఈ క్రమంలో అధికారులు ఈ పర్యాయం ఇక్కడే దహనసంస్కారాలు చేసుకోవాలని, ఆ తరువాత ఇలాంటి సమస్య రాకుండా వేరే ప్రాంతంలో ఎకరా స్థలం కేటాయిస్తామని ఇక నుంచి అక్కడకు వెళ్లాలని సూచించారు. అయితే అందుకు మృతదేహం తరఫువారు ఒప్పుకోలేదు. దీంతో వారు మృతదేహాన్ని అక్కడే వదిలి వెళ్లారు. రోజంతా ఇరువురి మధ్య సమోధ్య కుదరకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గ్రామంలో ఎలాంటి గొడవలు జరగకుండా సీఐ వెంకటేశ్వర్లు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

గ్రీవెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో పాటు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వివిధ వర్గాల ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు.







రక్తదానం చేసిన వారికి ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, కంభం టీడీపీ కార్యాలయం వద్ద కేకు కట్ చేస్తున్న నాయకులు, వై.పాలెంలో విద్యార్థినికి కేకు తినిపిస్తున్న టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు

ఘనంగా లోకేష్ జన్మదినం

- పలుచోట్ల సేవా కార్యక్రమాలు
- మార్కాపురంలో రక్తదాన శిబిరం ఏర్పాటు
- విద్యార్థులకు పెన్నులు, పుస్తకాల పంపిణీ

మార్కాపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక బొగ్గరపువారి కల్యాణ మండపంలో భారీ కేక్‌ను స్థానిక శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు కత్తిరించాయి. అనంతరం అక్కడే భారీ ఎత్తున మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మార్కాపురం, తర్లుపాడు మండలాలకు చెందిన సుమారు 302 మంది ఉదయం నుంచి సాయంత్రం వరకు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ జన్మదినం టీడీపీ శ్రేణులకు పండుగలాంటిదన్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆంధ్ర రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున్, యక్కలి కాశీవిశ్వనాథం, కనిగిరి బాలవెంకటరమణ, పెరుమాళ్ల కాశీరావు, షేక్ మౌలాలి పలు వార్డుల కౌన్సిలర్లు, జనసేన నాయకులు ఇమ్మడి కాశీనాథ్, సురేష్, బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కంభం : టీడీపీ అధ్యక్షులు తోట శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంత్రి లోకేష్ జన్మదినం సందర్భంగా కేకు కట్ చేశారు. మండలంలోని చిన్నకంభం, కంభం ఉర్దూ పాఠశాలలో ఎన్‌టీఆర్ టీడీపీ నాయకులు సయ్యద్ రఫి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

కంభం : రాష్ట్ర విద్యాశాఖమంత్రి మరియు ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ పుట్టిన రోజున అర్ధవీడు మండల క్లస్టర్ ఇన్‌చార్జి మారెడ్డి రంగారెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి చేగిరెడ్డి సుబ్బారెడ్డిలు విజయవాడ కనకదుర్గమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి అందచేశారు.

గిద్దలూరు : రాచర్లలో మంత్రి లోకేష్ జన్మదినం సందర్భంగా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, కేజీబీవీ, స్కూల్ 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. విద్యా వ్యవస్థలో పెనుమార్పులు తీసుకొచ్చి, నాణ్యమైన విద్యను అందించడంలో లోకేష్ పాత్ర కీలకమైనదని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షులు కె.యోగానంద్, నాయకులు జీవనేశ్వర్‌రెడ్డి, నల్లబోతుల శ్రీనివాసులు, లక్ష్మీరెడ్డి, సంజయ్, కాశిరెడ్డి, పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : రాష్ట్ర విద్యాశాఖ, ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు గిద్దలూరు ప్రాంతంలో ఆపార్టీ టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన భారీ కేకును కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. ఈ సందర్భంగా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాల లోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నా క్యాంటీన్‌లో ప్రజలకు ఉచితంగా అన్నదానం ఏర్పాటు చేసి కృష్ణకిశోర్‌రెడ్డి భోజనం వడ్డించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు షానేషావలి, మార్తాల సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్, నాయకులు దప్పిలి కాశిరెడ్డి, ఒ.వెంకటయ్య, దుత్తా బాలీశ్వరయ్య, కౌన్సిలర్లు చంద్రశేఖర్ యాదవ్, లొక్కు రమేష్, బిల్లా రమేష్ మహిళ నాయకురాళ్ళు బొంతా లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి బైలడుగు బాలయ్య ఆధ్వర్యంలో లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మర్రిబోయిన చంద్రశేఖర్, దాసరి విజయరాజు, కె.సుబ్బారావు, మాదాల వెంకటేశ్వర్లు, దాసరి దాసు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉయ్యాలవాడ మాజీ సర్పంచ్ బోదనబోయిన గోపాల కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో ఎంపీయూపీ పాఠశాలలో కేకు కట్ చేశారు. పిల్లల సమక్షంలో కేక్‌ను కట్ చేసి, స్వీట్లు, చాక్లెట్లు విద్యార్థులకు పంచిపెట్టారు. నాయకులు షేక్ మౌలాలి, నారాయణరెడ్డి, బోదనబోయిన అరుణ్‌యాదవ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : మంగళగిరిలోని రాష్ట్ర పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సీనియర్ నాయకులు వర్ల రామయ్య, ఎంఎల్‌సీ సభ్యురాలు అనురాధతో కలిసి ముత్తుముల అశోక్‌రెడ్డి లోకేష్ జన్మదిన కేక్ కటింగ్‌లో పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సాధనే టీడీపీ లక్ష్యం

కొమరోలు : ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చడమే టీడీపీ లక్ష్యం అని ఎంపీటీసీ మాజీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి అన్నారు. స్థానిక స్టేట్‌బ్యాంకు సమీపంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా భారీ కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. నియోజకవర్గం అభివృద్ధిలో నారా లోకేష్ కృషి ఉందన్నారు. ఆయన గిద్దలూరు నియోజవర్గంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, టీడీపీ ప్రధాన కార్యాదర్శి బిజ్జాల తిరుమలరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు పులకుర్తి వెంకటేశ్వర్లు, నాయకులు తుమ్మలపెంట రమణ, తిరుమలరెడ్డిలు, కుప్పాల బాలరంగయ్య, భూపాల్, లక్ష్మినరసయ్య, పెనుగొండ రమణ, మాదాల పుల్లయ్య, బి. బాలిరెడ్డి పాల్గొన్నారు.

తర్లుపాడు : మండలంలో విద్యాశాఖమంత్రి లోకేష్ జన్మదినం సందర్భంగా పలు పాఠశాలల్లోని విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో తర్లుపాడు ఎస్ఎంసీ చైర్మన్ వెన్నా రాజారామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, పి.గోపీనాథ్ చౌదరి, నంబుల లక్ష్మయ్య, జి.సుబ్బయ్య పలువురు తెలుగు తమ్ముళ్లు పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పఠాన్ నాగూర్ ఖాన్ కేక్‌కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రవిచంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : ప్రభుత్వ వసతి గృహాలలో ఉండే బాలికల రక్షణ, భద్రత కోసం టీడీపీ పనిచేస్తోందని ఎర్రగండపాలెం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. గురువారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలలో విద్యార్థినులకు మినీ గురుకుల పాఠశాలలోని విద్యార్థులు 800 మందికి అట్టలు, పెన్నులు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలలో ఎరిక్షన్‌బాబు నాయకులతో కలసి పాల్గొన్నారు. వసతి గృహాలు ఏర్పాటు చేసి బడుగు బలహీన వర్గాలకు విద్యకు చేరువ చేసిన వ్యక్తి దివంగత నందమూరి తారకరామారావు అని అన్నారు. ఆయన చొరవతో నేడు ఎంతో మంది విద్యలో రాణిస్తున్నారన్నారు. విద్యతోనే అభివృద్ధి ఉన్నత శిఖరాలకు చేరవచ్చునని అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, సంక్షేమ శాఖ మంత్రి డోల వీరంజనేయ స్వామి వసతి గృహాల శాశ్వత భవనాలకు, మరమ్మత్తులకు నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. విద్యార్థులు చక్కగా చదవి జీవితంలో రాణించాలన్నారు. ముందుగా ఆయా కార్యక్రమాలలో నారా లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా కేకుకట్ చేశారు. ఆయా కార్యక్రమాలలో ఏఎస్‌డబ్ల్యూవో ఎన్.అరుణ కుమారి, జబ్బార్, వార్డన్లు షేక్ యాసిన్‌బేగం, సుజాత, వి.బయన్న, నాయకులు చేకూరి సుబ్బారావు, షేక్ మస్తాన్‌వలి, మహేష్ నాయుడు, ఎంసీహెచ్ మంత్రునాయక్, కొత్తమాసు అనంత వెంకటసుబ్రహ్మణ్యం, వెంగల్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి, కంచర్ల సత్యనారాయణ గౌడ్, పేరం రమణా రెడ్డి, ముత్తుముల మల్లికార్జున చారి, శ్రీను తదిరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు పెన్నులు పుస్తకాల పంపిణీ

పొదిలి : రాష్ట్ర, విద్యా, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదినం గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పెద్దబస్టాండ్ కూడలిలో బాలికల ఉన్నత పాఠశాలలో సుమారు 500ల మంది విద్యార్థులకు శివాలయం మాజీ చైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు సొంతగా పెన్నులు, పుస్తకాలు, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి లోకేష్ చేస్తున్న కృషి మరువలేదని కొని యాడారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గును పూడి భాస్కర్, కాటూరి నారాయణబాబు, మండల పట్టణాధ్యక్షులు ఓబులరెడ్డి, ఖుద్దూస్, పీఎంసీ చైర్మన్ ఆదిలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మల్లవరం, ఈగలపాడు, తలమల్ల, మల్లవరం, సాయి బాలాజీ నగర్‌తోపాటు పట్టణంలోని వివిధ పాఠశాలలో స్వీట్లు, మిఠాయిలు పంచిపెట్టారు.







మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో లోకేష్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న అశోక్‌రెడ్డి, కొమరోలులో కేకు కట్ చేస్తున్న నాయకులు, గిద్దలూరులో వేడుకల్లో పాల్గొన్న కృష్ణకిషోర్‌రెడ్డి

మండల పరిషత్ నిధులు గోల్‌మాల్!

- రూ.6లక్షల మేర నిధులు స్వాహా
- తట్ట మట్టి పోయలేదు పైసా ఖర్చు పెట్టలేదు

తర్లుపాడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడు మండల పరిషత్ నిధులు యథేచ్ఛగా దుర్వినియోగమయ్యాయి..! నాలుగు నెలల క్రితం మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఇద్దరు వైసీపీ నాయకులు కుమ్మక్కై అభివృద్ధి పనులు చేయకుండానే నిధులు నొక్కేసినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. గత ఏడాది మండల పరిషత్‌లో రూ.15లక్షల సాధారణ నిధులు ఉన్నాయి. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా అధికారులను బెదిరించి వివిధ పనులు చేస్తున్నట్లు చూపి ఎం-బుక్‌లో నమోదు చేసుకున్నారు. అయితే అప్పటి ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ ఆ నిధులు డ్రా కాకుండా అడ్డుకున్నాడు. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత వైసీపీతో అంటకాగిన ఎస్.నరసింహులు మరోసారి తర్లుపాడు ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఈయన బాధ్యతలు చేపట్టిన రెండు నెలల తర్వాత సెప్టెంబరు 30న ఉద్యోగ విరమణ చేయనున్న ముందురోజు గుట్టుచప్పుడు కాకుండా రూ.15 లక్షల నిధులను ఒకే రోజు వైసీపీ నాయకుల ఖాతాలోకి తన డిజిటల్ కీ ద్వారా బదిలీ చేశారు. దీంతో సదరు నేతలు ప్రతిఫలంగా ఈయనకు కొంత నగదు, రిటైర్డ్ ఫంక్షన్‌లో బంగారపు ఆభరణాన్ని కూడా



తర్లుపాడు మండల పరిషత్ కార్యాలయం

బహుమతిగా అందజేశారు. నిధులు డ్రా చేసిన విషయం బయటకు పొక్కకుండా వైసీపీ నాయకులు పలు జాగ్రత్తలు తీసుకున్నారు. ఇటీవల ఈ విషయం బయటకు రావడంతో కార్యాల యంలో ప్రస్తుతం పనిచేస్తున్న అధికారులపై ఎంపీపీ భర్త కన్నెర్రజేశారు. డ్రా చేసిన రూ.15లక్షల్లో రూ.6లక్షల మేర ఎలాంటి పనులు చేయకుండా నిధులు నొక్కేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదాహరణకు తర్లుపాడు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో తట్టమట్టి పోయకుండా పైసా ఖర్చు చేయకుండా రూ.50 వేల నిధులు డ్రా చేశారు. చెన్నారెడ్డిపల్లెలో అక్కడకక్కడ కొంతమేర పైప్‌లైన్ వేసి రూ.2.25లక్షలను, నాయుడుపల్లె నుంచి తర్లుపాడు బీసీ రజక కాలనీకి జలజీవన్ మిషన్ పైపులు వేసి మరో రూ.2.50లక్షలు, తర్లుపాడు, మీర్జపేట సచివాలయాలలో వివిధ అభివృద్ధి పనులు చేసినట్లు ఒక్కొక్క సచివాలయానికి రూ.1.50 లక్షల చొప్పున నిధులు డ్రా చేశారు. ఇలా ఎన్నో అవకతవకలకు పాల్పడి మండల పరిషత్ నిధులను ఇద్దరు వైసీపీ నాయకులు కాజేశారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి నిధుల గోల్‌మాల్‌పై సమగ్ర విచారణ చేస్తే ఎన్ని లక్షల మేర అవినీతి జరిగిందో తేటతెల్లం కానుంది.

పాతనిధుల గురించి తెలియదు

గత ఏడాది మార్చిన మండల పరిషత్ నిధుల గురించి నాకేమి తెలియదు. నేను ఇటీవల కొత్తగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టాను. ఎంపీడీవో చక్రపాణిప్రసాద్ తెలిపారు.

జీవనోపాధి యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వ తోడ్పాటు

● డీఆర్‌డీఏ డీపీఎం డేవిడ్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం డేవిడ్

మార్కాపురం రూరల్. జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధి యూనిట్ల ఏర్పాట్లకు ప్రభుత్వం తోడ్పాటును అందిస్తోందని డీఆర్‌డీఏ జిల్లా డీపీఎం డేవిడ్ తెలిపారు. స్థానిక ఎస్సీ, బీసీ కాలనీలోని డ్వాక్రా బజారులో ఎస్‌వీఈపీ, వెలుగు సిబ్బందితో డీపీఎం డేవిడ్, ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్, బీపీఎం సుబ్బారావులతో కలసి గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం డేవిడ్ మాట్లాడుతూ రూ.5లక్షలు ఆ పైబడి పెట్టుబడిగా పెట్టే పెద్ద ఎంటర్ ప్రైజస్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం పీఎంఈజీపీ, పీఎంఈఎఫ్‌ఎంటీ పథకాలలో భాగంగా 35 శాతం రాయితీతో పాటు రుణం మంజూరు చేస్తోందన్నారు. కొంత నగదు బ్యాంకు ద్వారా కొంత నగదు యస్‌వీఈపీ, స్త్రీనిధి, ఉన్నతి ద్వారా రుణం మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మార్కాపురం క్లస్టర్ పరిధిలోని మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, దొనకొండ, కురిచేడు మండలాలలో ప్రతి మండలంలో యాభై యూనిట్లు ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమన్నారు. ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసుకునే వారికి మిషనరీ, ముడిసరుకు మార్కెటింగ్, ఫ్రాంఛైజీ, స్కిల్ డెవప్‌మెంట్ వంటి సహకారం ఉంటుందన్నారు. కొర్రమీను చేపల యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.4.40 లక్షలతో ఒక్కో యూనిట్‌కు మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ యూనిట్ ఏర్పాటుకు లబ్దిదారులకు బోరు సౌకర్యం ఉండాలన్నారు. ఎంటర్‌ప్రైజస్, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి ఉన్నవారు వారి మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎంను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, దొనకొండ, కురిచేడు ఏపీఎంలు పిచ్చయ్య, రమేష్‌బాబు, గోపాలకృష్ణ, సౌమ్య, సీమోను, స్త్రీనిధి మేనేజర్ సులోచన, ఎల్‌సీ నాగభూషణం, కెనరా బ్యాంకు సీనియర్ మేనేజర్ శ్రీనివాస్, ఫీల్డ్ ఆఫీసర్, క్లస్టర్ పరిధిలోని కమ్యూనిటీ కోఆర్డినేటర్‌లు, ఎస్‌వీఈపీ, సీఆర్‌పీలు, అకౌంటెంట్ నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

వర్ధంతి లేని మహానేత నేతాజీ



తర్లుపాడులో బోస్ పేరు ఆకారంలో విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జయంతి తప్ప.. వర్ధంతి లేని అమరవీరుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీ కృష్ణారావు అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని బాలుర ఉన్నత పాఠశాలలోని నేతాజీ విగ్రహానికి బీజేపీ నాయకులు గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ.. జాతీయ నాయకులలో జయంతి ఒక్కటే ఉండి వర్ధంతి లేని నాయకుడు నేతాజీ అని ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వాసవిప్రియ, బొంతల కృష్ణ, శాసనాల సరోజిని, చిన్నయ్య, ఎం.లక్ష్మీ, చంద్రశేఖర్, ఆంజనేయులు, సతీష్, కాశీం పాల్గొన్నారు.



నేతాజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

తర్లుపాడు : మండలంలోని తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాలలో, లక్ష్మక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో, కలుజువ్వలపాడు ఉన్నత పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పలువురు ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈమేరకు తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చంద్రబోస్ ఆకారంలో విద్యార్థులు కూర్చొన్నారు. ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌బాబు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటంలో సుభాష్ చంద్రబోస్ పాత్ర గురించి విద్యార్థులకు వివరించారు. ఇండియన్ నేషనల్ ఆర్మీని స్థాపించి రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ఐఎన్ఏను ఏర్పాటు చేశారన్నారు. అనంతరం పలు పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్కే మౌలాలి, కశ్శెట్టి జగన్‌బాబు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిద్దలూరు : పట్టణంలోని శాఖ గ్రంథాలయం ఆవరణలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ స్వేచ్ఛ స్వాతంత్రం కోసం ప్రాణాలు సైతం త్యాగం చేయడానికి వెనుకాడని మహామూర్తి చంద్రబోస్ అని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, రిటైర్డ్ ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు.

రహదారి భద్రత ప్రజలందరి బాధ్యత

మార్కాపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత ప్రజలందరి బాధ్యత అని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. రవాణశాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని రవాణశాఖ ఆధ్వర్యంలో గురువారం వాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్‌వీకేపీ కళాశాల నుంచి వాక్‌థాన్ కార్యక్రమం గడియార స్తంభం వరకు కొనసాగింది. ముందుగా ఎస్‌వీకేపీ కళాశాల వద్ద ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రతపై అందరూ దృష్టిసారించాలన్నారు. అధికార యంత్రాంగానికి ప్రజలు సహకరిస్తే, ప్రమాదాల నివారణ సాధ్యంకాదన్నారు. కార్యక్రమంలో ఆర్‌టీవో అమర్‌నాయక్, ఎంవీఐ ఎమ్.మాధవరావు, మార్కాపురం సీఐ పి.సుబ్బారావు, టౌన్ ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్‌రావు, రూరల్ ఎస్సై అంకమ్మరావు, పలుశాఖల అధికారులు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న దర్శి సీఐ వై.రామారావు

వాహనాలు నడిపే సమయంలో నిర్లక్ష్యం వద్దు

దర్శి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే సమయంలో నిర్లక్ష్యం వహించి విలువైన ప్రాణాలు కోల్పోతే కుటుంబ సభ్యులు అనాథలవుతారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని దర్శి సీఐ వై. రామారావు సూచించారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో గురువారం రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన కుటుంబ సభ్యులతో సమావేశం నిర్వహించారు. వారు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ హెల్మెట్ పెట్టుకోకపోవడం వలన, మద్యం సేవించి వాహనాలు నడపటం వలన, అతివేగం వలన ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఇంటి యజమానులు అకారణంగా మృతి చెందటం వలన ఆ కుటుంబాలు ఛిద్రమవుతున్నాయన్నారు. ఈ పరిస్థితి గుర్తించి వాహన చోదకులు వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, బాధిత కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.



కస్తూర్బా విద్యార్థినులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్న పోకా నాయుడుబాబు

పరీక్ష సామగ్రి అందజేత

పామూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మంత్రి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా స్థానిక కస్తూర్బా పాఠశాలలో టెన్త్, ఇంటర్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినులకు టీఎన్ఎస్ఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి పోకా నాయుడు ఆర్థిక సహకారంతో పరీక్షల సామగ్రిని గురువారం అందజేసారు. సింగిల్‌విండో మాజీ ఛైర్మన్ భైరెడ్డి జయరామిరెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపాల్ కటకం సృజన, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు. అలాగే సీఎస్‌పురం మండలంలోని కోవిలంపాడులో ఒంగోలు పార్లమెంట్ తెలుగుయువత అధికార ప్రతినిధి షేక్ రజ్జబ్‌బాష ఆధ్వర్యంలో, స్థానిక విరాట్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు.



రహదారి భద్రత పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించాలి

పామూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఆటోలు నడిపే డ్రైవర్లందరూ తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని కనిగిరి డీఎస్పీ పి. సాయి ఈశ్వర్ యశ్వంత్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో రహదారి భద్రతపై ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు ఎస్ఐ టి. కిశోర్ బాబు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఆటో స్టాండ్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే రోడ్లపై గేదెలను వదిలితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం రహదారి భద్రతకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎం. భీమానాయక్, పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఉత్తమ ఏఈఆర్వోగా శ్రావణకుమార్



దర్శి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : దర్శి తహసీల్దార్ ఎం.శ్రావణకుమార్ ఉత్తమ అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఎంపికయ్యారు. ఆయన గత ఎన్నికలలో బాపట్ల ఏఈఆర్వోగా పనిచేశారు. ఈ మేరకు ఎన్నికల సంఘ రాష్ట్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ఈనెల 25వ తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ అవార్డును అందుకోనున్నారు.

రెడ్డినగర్ వద్ద తెగి పడిన విద్యుత్ తీగ

- చెలరేగిన మంటలు
- రోడ్డుకు ఇరువైపులా నిలిచి పోయిన ట్రాఫిక్

ముండ్లమూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్డినగర్ వద్ద అద్దంకి - దర్శి ప్రధాన రహదారిపై గురువారం మధ్యాహ్నం విద్యుత్ తీగ తెగి రోడ్డుపై పడింది. దీంతో మంటలు చెలరేగాయి. అద్దంకి - దర్శి ప్రధాన రహదారి కావటంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు అరగంట పాటు నిలిచి పోయాయి. రెడ్డినగర్ .గ్రామానికి సమీపంలో విద్యుత్ లైన్ ఒక తీగ తెగి కింద పడింది. వెంటనే మంటలు చెలరేగటంతో అటుగా వెళ్లే వాహన చోదకులు భయాందోళనలు చెందారు. కొందరు విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఫోన్ చేయడంతో కరెంటును నిలుపుదల చేయించారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.

పాలకుల నిర్లక్ష్యం.. ఇరిగేషన్ శాఖ నిర్వీర్యం

తీవ్రమైన సిబ్బంది కొరత

40 సంవత్సరాలుగా భర్తీకి నోచని లస్కర్ల పోస్టులు

అస్తవ్యస్తంగా సాగునీటి పంపిణీ

దర్శి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పాలకుల నిర్లక్ష్యం వలన ఇరిగేషన్ శాఖ నిర్వీర్యం అవుతోంది. ఏళ్ల తరబడి సిబ్బంది నియామకాలకు నోచుకోలేదు. దాదాపు 80 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 50 ఏళ్ల క్రితం నిర్మించిన రేకుల షెడ్లలోనే ఇప్పటికీ పలుచోట్ల కార్యాలయాలు నడుస్తున్నాయి. తాత్కాలిక భవనాలు శిథిలమైనప్పటికీ నూతన భవనాల నిర్మాణం గురించి పట్టించుకోలేదు. 40 సంవత్సరాలుగా లస్కర్ పోస్టుల నియామకం జరగలేదు. 1985లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తాత్కాలికంగా పనిచేస్తున్న లస్కర్లను రెగ్యులర్ చేశారు. ఆయన నియమించిన లస్కర్లు ఇప్పటికీ కొనసాగుతున్నారు. ఆ తర్వాత ఒక్క పోస్టు కూడా భర్తీకి నోచుకోలేదు. దర్శి-2 సబ్ డివిజన్ పరిధిలో పరిస్థితి గమనిస్తే ఎంత అధ్వానంగా ఉందో అర్థమవుతోంది. దర్శి ఎన్ఎస్‌పీ డివిజన్ పరిధిలో మొత్తం 117 మంది లస్కర్ పోస్టులకు ప్రస్తుతం 15 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 17 మంది వర్క్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు తొమ్మిది మంది మాత్రమే ఉన్నారు. 16 ఏఈ పోస్టులకు ఎనిమిది మంది మాత్రమే పనిచేస్తున్నారు.



శిథిలావస్థకు చేరిన ఎన్ఎస్‌పీ దర్శి-2 సబ్ డివిజన్ కార్యాలయం

లక్ష ఎకరాల ఆయకట్టు భూమి ఉంది, అందులో 60 ఎకరాలు మాగాణి, 40 ఎకరాలు మెట్ట పైర్లు సాగుచేస్తారు. లస్కర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు లేకపోవటంతో సాగునీటి పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. మొత్తం 125 మేజర్లు, మైనర్లు ఉండగా కనీసం చిల్లచెట్లు కొట్టే పరిస్థితి కూడా లేదు. అదేవిధంగా దర్శి-2 సబ్ డివిజన్‌లో కీలకమైన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టు ఖాళీగా ఉంది. చీమకుర్తి డీఈఈ తాత్కాలికంగా ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. నాలుగు ఏఈ పోస్టులకు ప్రస్తుతం అన్నీ ఖాళీగా ఉన్నాయి. ఇతర ప్రాంతాల నుంచి ఇరువురు డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు.

ఐదు వర్క్‌ఇన్‌స్పెక్టర్ పోస్టులకు ఇద్దరు మాత్రమే ఉన్నారు. 36 మంది లస్కర్ పోస్టులకు కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఈ సబ్ డివిజన్ పరిధిలో 40 వేల ఆయకట్టు భూమి ఉంది. అందులో 30వేల ఎకరాల్లో వరిసాగు, పది వేల ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు చేస్తారు. మొత్తం 36 మేజర్లు, మైనర్లు ఉన్నాయి. లస్కర్లు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు కేవలం ఇద్దరు మాత్రమే ఉంటున్నందున మేజర్లు, మైనర్ల నీటి పంపిణీ దుర్లభంగా మారింది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి రంగాలపై దృష్టి సారించింది. అందువలన ఇరిగేషన్ శాఖలో కొనసాగుతున్న దుస్థితి గమనించి శిథిలావస్థలో ఉన్న భవనాల స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని, ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసి ఆయకట్టు భూములకు సక్రమంగా నీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



రూ.10 లక్షల బీమా చెక్కును అందజేస్తున్న పోస్టల్‌శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో శ్రీదేవి

పోస్టల్ బీమాను సద్వినియోగించుకోండి

మార్కాపురం డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు

దొనకొండ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తక్కువ ప్రీమియంతో ఎక్కువ లాభం పొందే పోస్టల్ బీమా పాలసీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రతి ఒక్కరూ గ్రామాల్లో ప్రజలను చైతన్యపర్చాలని మార్కాపురం డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు పేర్కొన్నారు. దొనకొండకు చెందిన ఖాసిం అనే ప్రభుత్వ ఉద్యోగి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన రూ.399 చెల్లించి పోస్టల్ బీమా చేయించుకోవటంతో ప్రమాద బీమా క్రింద మంజూరైన రూ.10లక్షల చెక్కును మృతుడి కుమారుడికి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పోస్టల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ గ్రామాల్లో నివసించే వారిలో కుటుంబ పెద్ద ఆకస్మాత్తుగా చనిపోతే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేలా పోస్టల్ బీమా పాలసీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తహసీల్దార్ బి. రమాదేవి , ఎంపీడీవో శ్రీదేవి, కంభం పోస్టల్ శాఖ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ అలీ, ఐపీపీబీ మేనేజర్ సాయిరామ్, స్థానిక పోస్టు మాస్టర్ హర్షద్‌ఖాన్, మండలంలోని పలు గ్రామాలకు చెందిన పోస్టల్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పిస్తున్న అనిల్

శుద్ధి నీటితోనే ఫ్లోరోసిస్‌కు దూరం

పీసీపల్లి,జనవరి23(ఆంధ్రజ్యోతి):ఆర్వో ప్లాంట్ ద్వారా శుద్ధిచేసిన నీటిని తీసుకోవడం ద్వారా ఫ్లోరోసిస్ బారిన పడకుండా ఉండవచ్చునని జిల్లా ఫ్లోరోసిస్ కోఆర్డినేటర్ డాక్టర్ అనిల్ అన్నారు.జాతీయ ఫ్లోర్లరోసిస్ నియంత్రణ, నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మురుగుమ్మి, దివాకరపల్లి గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలకు ఫ్లోరోసిస్ వ్యాధి గురించి అవగాహన కల్పించారు. మురుగుమ్మి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. అక్కడి విద్యార్థినీ విద్యార్థులకు విటమిన్ సీ, కాల్షియం ఫుడ్ యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. ఆ గ్రామంలో కమ్యూనిటీ సర్వే నిర్వహించిన ఆయన డెంటల్ ఫ్లోరోసిస్, స్కేలేటర్ ఫ్లోరోసిస్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మంజుల, హెల్త్ సూపర్‌వైజర్ రేణుకాదేవి, ప్రధానోపాధ్యాయులు షేక్.ఖాసీం, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు తదితరులు ఉన్నారు.

అదుపు తప్పితే అంతే

కిక్కిరిసిన కూలీలతో ఆటోలు

మిరప కాయలు కోసేందుకు వెళ్తున్న వైనం



మిర్చి కాయలు కోసేందుకు దర్శి నుంచి ముండ్లమూరు, అగ్రహారం, తమ్మలూరుకు కిక్కిరిసిన కూలీలతో వెళుతున్న ఆటోలు





ముండ్లమూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మిర్చి కోసేందుకు కూలీలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో సుదూర ప్రాంతాల నుంచి కూలీలు ఆటోలు, ఫోర్ వీల్ ఆటోలు, ట్రాక్టర్లలో వస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయాందోళనలు చెందుతున్నారు. ఒక్కొక్క ఫోర్ విల్ ఆటోకు 30 నుంచి 40 మంది వరకు కూలీలను ఎక్కించుకొని ఆటో డ్రైవర్లు వేగంగా తరలి వెళ్తున్నారు. ఆటోల్లో అయితే 20 నుంచి 30 మంది వరకు ఆటోల్లో వెళ్తున్నారు. ప్రమాదం ఎప్పుడు ఏ రూపంలో ముంచుకొస్తుందోనని కూలీలు సైతం భయాందోళనలు చెందుతున్నారు. ముండ్లమూరు మండలంలోని పూరివెంట్ల, ఉమామహేశ్వర అగ్రహారం, నాయుడుపాలెం, తమ్మలూరు, పసుపుగల్లు, సుంకరవారిపాలెం, నూజెండ్లపల్లితో పాటు ముండ్లమూరు గ్రామాల్లో ముమ్మరంగా మిరప కాయల కోతలు వచ్చాయి. దీంతో గత రెండు వారాల నుంచి దాదాపు వందకు పైగా ఆటోలు, త్రీవిల్ ఆటోలు దర్శి, తాళ్లూరు మండలం, దర్శి మండలాల నుంచి కూలీలను ఎక్కించుకొని మండలంలోని పలు గ్రామాలకు తీసుకు వెళ్తున్నారు. పరిమితికి మించి ఆటోల్లో కూలీలను ఎక్కించుకొని వెళ్తున్నారు. సింగిల్ రూట్లు కావటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని భయ పడుతున్నారు. గత ఏడాది మండలంలోని వేముల, రమణారెడ్డిపాలెం మధ్య మిరప కాయల కోతలకు వెళ్లే కూలీల ఆటో బోల్తా పడి ఒకరు చనిపోగా మరి కొంత మంది గాయ పడ్డారు. అలాగే అద్దంకి - దర్శి ప్రధాన రహదారిపై పలుచోట్ల కూలీలతో వస్తున్న ఆటోలు సైతం ప్రమాదానికి గురైన సంఘటనలు ఉన్నాయి.

యువతకు స్ఫూర్తి నారా లోకేశ్

- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజకీయాల్లో యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని గడియారస్తంభం సెంటర్‌లో లోకేష్ పుట్టినరోజు సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావులు



కనిగిరిలో లోకేశ్ బర్త్‌డే కేకును కట్ చేసి శ్రేణులకు పంచిపెడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కేకు కట్ చేసి అభిమానులకు పంచారు. దివంగత ఎన్టీఆర్, దివంగత మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, అధికార ప్రతినిధి గుర్రం బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు కల్లూరి సుబ్బు, టీడీపీ దర్శి పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, నాయకులు సంగా తిరుపతిరావు, మారెళ్ళ వెంకటేశ్వర్లు, నారపుశెట్టి మధు, గొర్రె సుబ్బారెడ్డి, వీసీ రెడ్డి, బేళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో పార్టీని అధికారంలోకి తెచ్చిన ఘనుడు లోకేశ్

బర్త్‌డే వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి : రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టి అటు ప్రజలకు, పార్టీ శ్రేణులకు భరోసాగా నిలిచి 2024 ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తెచ్చిన ఘనుడు లోకేష్ అని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. లోకేష్ 41వ పుట్టినరోజు వేడుకలను స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనతికాలంలో రాష్ట్రంలో అభివృద్ధి బాటలు వేయటంలో లోకేష్ పాత్ర ఎంతో ప్రాధాన్యమైనదన్నారు. అనంతరం కేకును కట్ చేసి శ్రేణులకు పంచిపెట్టారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీవీఆర్ మనోహరరావు (చిరంజీవి), తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు, ఫిరోజ్, అహ్మద్, నజిముద్దీన్, లక్ష్మయ్య, చింతలపూడి తిరుపాలు, ఐవి నారాయణ, బ్రహ్మంగౌడ్, తాతపూడి బ్రాక్, తెలుగుమహిళలు మాజీ కౌన్సిలర్ షేక్ వాజిదా బేగం, కరణం అరుణ, దొరసాని, అమ్ములవమ్మ, తులసి, కే నీరజ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరులో

తాళ్లూరు : టీడీపీ జాతీయ కార్యదర్శి, రాష్ట్రమంత్రి నారా లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు మండల టీడీపీ,రాష్ట్ర తెలుగు యువత ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వద్ద టీడీపీ శ్రేణులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ కార్యకర్తలకు వెన్నుదన్నుగా నిలుసూ భరోసా కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు బి.ఓబుల్‌రెడ్డి, తెలుగుయువత రాష్ట్రకార్యదర్శి జి.వేణుబాబు, టీడీపీ నాయకులు ఇడమకంటి శ్రీనివాసరెడ్డి, తూము శివనాగిరెడ్డి,రాచకొండ వెంకట్రావు, మన్నేపల్లి సమర, కైపు రామకోటిరెడ్డి, కె.రామయ్య, పిన్నిక రమేష్‌బాబు, నుసుం ఆదినారాయణ రెడ్డి, గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కె.సుబ్బారెడ్డి, బద్దులశ్రీను, మాగంటి శ్రీను, నాదెండ్ల శ్రీను, షేక్ అన్వర్‌బాష, నల్లపాటి సత్యం, బొడ్డు హనుమారెడ్డి, కోట అంకమ్మ, నాగార్జునరెడ్డి, వల్లభనేని శ్రీను, పాలెపోగు రాజు,ఎర్రాయిమ్, యాతం శ్రీనివాసరెడ్డి, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.



తాళ్లూరులో లోకేశ్ పుట్టిన రోజు కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు

దొనకొండలో..

దొనకొండ : మండల టీడీపీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేకు కట్ చేసి కార్యకర్తలకు, అభిమానులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ దర్శి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, నాయకులు వడ్లమూడి చెన్నయ్య, డాక్టర్ మల్లిఖార్జునశర్మ, పత్తి వెంకటేశ్వర్లు, కొమ్మతోటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో

ముండ్లమూరు : లోకేశ్ జన్మదిన వేడుకలు గురువారం మండల టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లోని స్వర్గీయ ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద భారీ కేక్ ఏర్పాటు చేయగా టీడీపీ దర్శి



దర్శిలో లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా కేకు కట్ చేస్తున్న టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే పాపారావు తదితరులు

నియోజక వర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత సాగర్‌లు కేక్ కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ కొక్కెర నాగరాజు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

పామూరులో

పామూరు : రాజకీయాల్లో తండ్రికి తగ్గ తనయుడుగా లోకేష్ రాణిస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు కొనియాడారు. లోకేష్ జన్మదిన వేడుకలను మండల తెలుగుయువత అధ్యక్షుడు ఉప్పలపాటి హరిబాబు ఆధ్వర్యంలో టీడీపీ కూటమి శ్రేణులు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేయించిన కేక్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లుతో కలిసి కట్ చేసి శ్రేణులకు పంచిపెట్టారు.

కురిచేడులో

కురిచేడు : మంత్రి లోకేష్ జన్మదిన వేడుకలు కురిచేడులో గురువారం ఘనంగా జరిగాయి. వినుకొండ రోడ్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద మండల తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో భారీ కేక్ కోసి అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పిడతల నెమిలయ్య, నాయకులు కాట్రాజు నాగరాజు, షేక్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లిలో..

పీసీపల్లి : లోకేష్ పుట్టినరోజు వేడుకలను మండలంలో పార్టీశ్రేణులు ఘనంగా జరుపుకున్నారు.మారెళ్ల గ్రామంలో టీడీపీ నాయకులు ప్రత్యేకంగా చేయించిన కేకును కట్‌చేసి పార్టీశ్రేణులకు పంచిపెట్టారు.

28న హెల్త్ పింఛన్ల పరిశీలన

పీసీపల్లి,జనవరి23(ఆంధ్రజ్యోతి):గతంలో అనారోగ్య కారణాలతో మంచానికే పరిమితమైనట్లుగా సర్టిఫికెట్లు చూపి ప్రభుత్వం నుంచి పింఛను పొందుతున్న వారిని ఈనెల 28వ తేదీన వైద్యబృందం పరిశీలించనున్నట్లు ఎంపీడీవో ప్రభాకరశర్మ తెలిపారు. మండలంలో హెల్త్ పింఛను పొందుతున్న 18మందికి సమాచారం కూడా ఇచ్చామన్నారు. వైద్యబృందం తనిఖీకి వెళ్లే సమయంలో పింఛనుదారులు తప్పనిసరిగా ఇంటివద్ద అందుబాటులో ఉండి పింఛను తనిఖీలో వైద్యబృందానికి సహకరించాలని అన్నారు. వైద్యబృందం తనిఖీకి వచ్చిన సమయంలో పింఛనుదారులు అందుబాటులో లేకపోతే అట్టి వారి పింఛనును నిలిపివేస్తామని ఆయన అన్నారు.

డాక్టర్ వెంగయ్యకు సన్మానం

పామూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : న్యాయశాస్త్ర విభాగంలో పట్టా పొందిన సీఎస్‌పురం మండల టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ వెంగయ్యను పామూరు టీడీపీ శ్రేణులు గురువారం శాలువాతో ఘనంగా సన్మానించారు. స్థానిక డోలా క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వెంగయ్యను సన్మానించి అభినందించారు. డోలా శేషు, ఆరే కొండ హరిప్రసాద్, రఫి ఉన్నారు.

వైసీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

కురిచేడు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ అనుబంధ సంఘాల అధ్యక్షులను రాష్ట్ర పార్టీ కార్యాలయం ప్రకటించింది. మాజీ ఎంపీపీ మేరువ సుబ్బారెడ్డిని దర్శి నియోజకవర్గ పంచాయతీ రాజ్ వింగ్ అధ్యక్షుడిగా, ఇంటలెక్చ్వల్ వింగ్ అధ్యక్షులుగా మాజీ ఎంపీపీ వీరగంధం కోటయ్య, బీసీ సెల్ అధ్యక్షులుగా నిమ్మకాయల రాజయ్య, వాణిజ్య విభాగం అధ్యక్షులుగా పెండేల సాంబశివరావులను ఎంపిక చేశారు.

బూత్ కమిటీ అధ్యక్షుడిగా రమణయ్య

దొనకొండ: వైసీపీ దర్శి నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడిగా మండలంలోని మల్లంపేటకు చెందిన కాలూరి రమణయ్యను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు అందాయి.

ముండ్లమూరు: మండలంలోని తమ్మలూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు బంకా నాగిరెడ్డిని దర్శి నియోజక వర్గ వైసీపీ రైతు సంఘం అధ్యక్షుడిగా నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నియామక పత్రాన్ని అందజేశారు

బెంగళూరు రోడ్డు ప్రమాదంలో పసుపుగల్లు యువకుడు మృతి

ముండ్లమూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని పసుపుగల్లు గ్రామానికి చెందిన లోకిరెడ్డి వెంకటేశ్వరెడ్డి(28) అనే యువకుడు బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడన్న విషయం గురువారం ఉదయం వెంకటేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగి పోయారు. తల్లి శ్రీదేవితో పాటు బంధువులు హుటాహుటిన బెంగళూరు వెళ్లారు.



గుంటూరు : మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, ఇండస్ట్రియల్ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్, లెదర్ ఇండస్ట్రియల్ డెవలప్‌లంట్ కార్పొరేషన్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, క్రిస్టియన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల మ్యానీ, టీడీపీ నాయకులు కనపర్తి శ్రీనివాసరావు తదితరులు



బాపట్ల : తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ టీడీపీ నేతలు

అమ్మాయిలే కావాలి



దత్తతకు పెరుగుతోన్న డిమాండ్

ముగ్గురే పిల్లలు.. పదుల సంఖ్యలో దరఖాస్తులు

దత్తత కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తోన్న జంటలు

అనాథ శరణాలయాల్లో అనేక మంది ఉన్నా ప్రహసనంలా ప్రక్రియ



అమ్మా నాన్న.. అన్న పిలుపు కోసం. అదీ అమ్మాయిలతోనే అనిపించుకోవాలనుకునే వారు రోజురోజుకు ఎక్కువ అవుతున్నారు. గతంలో అబ్బాయిలు కావాలని ఎదురుచూసేవారు. సంతానంలో అమ్మాయి ఉన్నా అబ్బాయి పుట్టేవరకు బిడ్డలను కనేవారు. ఇక సంతానం కలగని వారు దత్తతలో అబ్బాయిలకే ప్రాధాన్యం ఇచ్చే వారు. వరుసగా అమ్మాయిలు జన్మిస్తున్నా తప్పనిసరి పరిస్థితుల్లో అబ్బాయిలను దత్తత తీసుకునేందుకు ఆసక్తి చూపేవారు. అయితే కాలంతో పాటు తల్లిదండ్రుల్లోనూ మార్పులు వచ్చాయి. గత కొంతకాలంగా సంతానంగా లేదంటే దత్తత విషయంలోనూ అమ్మాయిలే కావాలంటున్నారు. ప్రేమ, ఆప్యాయతలు పంచే విషయంలో ఆడపిల్లలే మెరుగని, అలాగే వివాహం అనంతరం ఆడపిల్ల వైపు నుంచి ఉండే బంధుత్వం మరింత బలంగా ఉంటుందని అనేకమంది అభిప్రాయం. అందుకే ఎక్కువ మంది దత్తత విషయంలో ఆడపిల్లల వైపే ఆసక్తి చూపుతున్నారు. ఇక దత్తత ఓ ప్రహసనంలా మారడంతో తల్లిదండ్రులు లేక పిల్లలు, ఆ పిల్లలను తమ వద్దకు వచ్చే మార్గం లేక తల్లిదండ్రులు మోడులా మిగిలిపోతున్నారు.

పిల్లల దత్తతను సులభతరం చేయాలని అమికస్‌క్యూరిగా వ్యవహరిస్తున్న సీనియర్ న్యాయవాది పీ శ్రీరఘురాం ఇటీవల హైకోర్టుకు నివేదించారు. దత్తత ప్రక్రియ జటిలం అవ్వడంతో పిల్లలు కావాలనుకునేవారు చట్ట వ్యతిరేక మార్గాలను ఆశ్రయిస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో దత్తత ప్రక్రియను సులభతరం చేయాలని ఆయన సూచించారు.

సులభతరం చేయాలి

కోర్టు ముందు ఉన్న అనేక శిశు విక్రయ కేసుల్లో తల్లి, లేదా తండ్రి అనుమతితోనే జరిగిందని, అయినా దత్తత తీసుకున్న వారు కోర్టు మెట్లు ఎక్కుతున్నారన్నారు. శిశువులను విక్రయించిన తర్వాత అనేక మంది తమ పిల్లలు అదృశ్యమయ్యారని ఫిర్యాదు చేస్తున్నారని వీటిని అరికట్టేందుకు దత్తత సులభతరం చేయాలన్నారు.



ఆశలు అడియాసలు..

భగవంతుడు పిల్లలను ఇవ్వకుండా చిన్న చూపు చూస్తే.. నియమాలు, నిబంధనలు పేరుతో దత్తత ప్రక్రియ ప్రహసంగా మారి అమ్మ, నాన్న పిలుపులకు దూరం చేస్తుంది. అనాథ పిల్లలకు అమ్మ, నాన్న అవుతామన్నా దత్తత నిబంధ నలు వారిని అనేక ఇబ్బందులు పెడుతున్నాయి. చట్టబద్ధంగా పిల్లలను పొందాలనుకునే జంటల ఆశలు అడియాసలుగా మిగిలిపోతున్నాయి. ప్రవాసనంలా మారిన దత్తత ప్రక్రియ ఇందుకు ఒక కారణం. అందుబాటులో పిల్లలు లేకపోవడంతో అనేక మంది దత్తత కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు.



గుంటూరు(తూర్పు), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వైవాహిక జీవిత బంధం మరింత బలోపేతం కావడానికి తొలి అడుగు పిల్లలు. మాతృత్వ మాధుర్యాన్ని అనుభవించాలని ప్రతి తల్లికి.. భుజాలపై మోస్తూ గుండెలపై ఆడించుకోవాలని ప్రతి తండ్రికి ఆశ ఉంటుంది. ఆ అల్లర్లను భరించాలని, పిల్లలను పెద్ద చేసి సమాజంలో మంచి పౌరుడుగా తీర్చి దిద్దాలని ప్రతి తల్లి తండ్రి కలలు కంటారు. అందుకే సంతానం కోసం ప్రతి జంట తహతహలాడుతుంటోంది. అయితే గతంలో సంతానం విషయంలో అబ్బాయిలు ఉండాలని తల్లిదండ్రులు భావించేవారు. అబ్బాయిల కోసం ఎదురుచూసేవారు. అమ్మాయిలు ఎంతమంది ఉన్నా ఒక్క మగ నలుసు పుట్టాలని కోరుకునేవారు. సంతాన భాగ్యానికి నోచుకోలేని జంటలు అనాథ పిల్లలను దత్తత తీసుకునే క్రమంలోనూ అబ్బాయిల వైపే మొగ్గు చూపేవారు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి కనుమరుగైంది. అబ్బాయిల కంటే అమ్మాయిలు సంతానంగా ఉండాలని కోరుకుంటున్నారు. దత్తత తీసుకునే విషయంలో అమ్మాయిల కోసం దరఖాస్తు చేసుకునే వారే ఎక్కువ అవుతున్నారు. అమ్మాయి చేత అమ్మ, నాన్న అని పిలిపించుకోవాలని కలలుగంటున్నారు.

పిల్లల కోసం తహతహ..

ఇక పిల్లలు పుట్టరు అనుకునే వారే దత్తత తీసుకుంటారని చాలామంది అనుకుంటారు. కానీ వీరితో పాటు అనాథ పిల్లలను పెంచాలనుకునేవారు. పిల్లలు ఉన్నా కానీ మరొకరిని పెంచే శక్తి ఉన్నవారు. పిల్లలను కనడం ఇష్టం లేనివారు, జన్యుపరమైన లోపాలతో బాధపడు తున్నవారు. వివిధ కారణాల వల్ల పిల్లలను మధ్యలో కోల్పోయిన వారు, అండగా ఉంటారని 15-18 వయస్సు కలిగిన పిల్లలు కావాలనుకునేవారు, అందరూ మగపిల్లలు ఉన్నచోట ఆడపిల్ల కావాలని, ఆడపిల్లలు ఉన్నచోట మగపిల్లలు కావాలని.. ఇలా అనేక రకాల కారణాలతో పిల్లలను దత్తత తీసుకుంటున్నారు. అందుకే జిల్లాల్లో దత్తత దరఖాస్తులు వందల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి గాక రిజిస్ట్రేషన్ ప్రక్రియ సరిగా పూర్తి చేయక వివ రాలు నమోదు కానివారు, అసలు ఎక్కడ రిజిస్ట్రేషన్ చేసుకోవాలో తెలియని జంటలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వారి సంఖ్యతో పోల్చుకుంటే వీటి సంఖ్య రెట్టింపు అవుతుంది. గతంలో బంధువుల పిల్లలను దత్తత తీసుకునే సంప్రదాయం ఉండేది. కానీ వారి పెంపకంలో పూర్తి అధికారాలు తమతో పాటు బంధువులకు కూడా ఉంటున్నాయి. దీంతో తల్లిదండ్రుల బాధ్యతను పూర్తిగా ఆ స్వాదించలేక బయటి పిల్లలను దత్తత తీసుకునేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు.

దరఖాస్తులు పెండింగ్..

ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి 2021- 2022 ఏడాదికి 48, 2022-23లో 40, 2023-24లో 43 జంటలు (మిగతా 6వ పేజీలో)

ఇక నిఘా పక్కా

- ప్రధాన కూడళ్లన్నీ నిఘా నేత్రం కిందకి
- నేడు డీజీపీచే కమాండ్ కంట్రోల్‌రూం ప్రారంభం
- చీరాలలో ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ తుషార్‌డూడీ




డీజీపీ పర్యటన నేపథ్యంలో చీరాల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ, డీఎస్పీ మొయిన్, సీఐలు శ్రీనివాసరావు, నాగభూషణం

చీరాలటౌన్, బాపట్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ.. నేరాల సమయంలో దోషుల గుర్తింపునకు సీసీ కెమెరాలు కీలకంగా మారాయి. ఈ క్రమంలో జిల్లాలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. వాటి పర్యవేక్షణకు పోలీసు శాఖ ఏర్పాట్లు చేసింది. సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షించాలని జిల్లా పోలీస్‌శాఖ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇప్పటికే ఉన్న సీసీ కెమెరాలకు తోడు మరో 4,000 వరకు అమర్చాలని ప్రతిపాదనలు రూపొందించి ఆ దిశగా పోలీస్ విభాగం అడుగులేస్తోంది. చీరాలతో పాటు వాడరేవు సముద్ర తీరం మొత్తాన్ని సీసీ కెమెరాలో నిఘాలోకి పోలీసులు తెచ్చారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తి చేయడమే కాకుండా కమాండ్ కంట్రోల్ రూంను చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేశారు. శుక్రవారం చీరాల, కారంచేడుల్లో డీజీపీ ద్వారకా తిరుమలరావు పర్యటించనున్నారు. ఈ క్రమంలో చీరాల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు రానున్న డీజీపీ తొలుత అక్కడ ఖాకీల పనితీరును పరిశీలిస్తారు. అనంతరం స్టేషన్ రెండో అంతస్తులో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంను ప్రారంభించనున్నారు. తర్వాత కారంచేడు పోలీస్ స్టేషన్‌ను సందర్శించనున్న డీజీపీ అక్కడ సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన విశ్రాంతి గదులను ఉపయోగంలోకి తేనున్నారు. ఈ క్రమంలో గురువారం ఎస్పీ తుషార్‌డూడీ చీరాలలో డీజీపీ పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్పీ వెంట డీఎస్పీ ఎండీ మొయిన్, వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు, టూటౌన్ సీఐ నాగభూషణం, ఎస్‌బీ సీఐ నారాయణ, ఎస్‌ఐలు కమలాకర్, రాజ్యలక్ష్మి ఉన్నారు.


ప్రోత్సాహకాలేవి?

- పది విద్యార్థులపై జడ్పీ చిన్నచూపు
- పరీక్షలు సమీపిస్తున్నా అధికారుల నిర్లక్ష్యం
- విద్యార్థులకు అందని విద్యాజ్యోతి.. అల్పాహారం
- నిధులు కేటాయించని జిల్లా పరిషత్ పాలకవర్గం
- పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు.. విద్యార్థుల ఆకలి కేకలు
- ప్రతీ ఏటా ఈ పాటికి పాఠశాలల్లో మెటీరియల్ పంపిణీ

- ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలి. 100 రోజుల ప్రణాళిక ప్రకారం విద్యార్థులను తీర్చిదిద్దాలి. ఎక్కడా అలసత్వం వద్దు... అంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.
- పాఠశాలల్లో ఇటీవల ముగిసిన ఎఫ్ఏ -1, 2 పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించారు. వారిని ఉపాధ్యా యులు దత్తత తీసుకుని చదివించే కార్యక్రమాన్ని మొదలుపెట్టారు.



తెనాలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పదిలో మెరుగైన ఫలితాల కోసం.. అటు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందించింది. ఇటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు చర్యలకు ఉపక్రమించారు. అయితే జిల్లాపరిషత్‌లో మాత్రం స్పందన లేదు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నా పాలకవర్గం కానీ, అధికారులు కానీ విద్యార్థులకు అందించాల్సిన ప్రోత్సాహకాల గురించి పట్టించుకోవడంలేదు. ప్రతీ ఏటా ఈ పాటికి విద్యార్థులకు మెటీరియల్‌తో పాటు ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు బలవర్థమైన అల్పాహారాన్ని అందించేవారు. అయితే వీటికి సంబంధించి ఇంతవరకు జడ్పీ నిధులు కేటాయించలేదు. పరీక్షలకు ఇంకా 52 రోజులే సమయం ఉంది. పరీక్షలకు మూడు నెలలకు ముందుగా జడ్పీ అందించే విద్యాజ్యోతి మెటీరియల్ ఇంకా సిద్ధమే కాలేదు. పాఠశాలల వారీగా అందించాల్సిన అల్పాహారం పంపిణీ చేయడంలేదు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థుల్లో నిస్పృహ, నిస్తేజం నెలకొన్నాయి. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే సొంతగా విద్యార్థులకు అల్పాహారం అందిస్తుంటే, మరికొన్నిచోట్ల దాతల సహకారంతో అందిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరానికి అల్పాహారం, విద్యాజ్యోతి మెటీరియల్ అందకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లోనూ ఆందోళన నెలకొంది. జిల్లాల పునర్విభజనతో గుంటూరు జిల్లా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలుగా విడిపోయినా, జడ్పీ మాత్రం ఇంకా ఉమ్మడి జిల్లా పరిధిలోనే కొనసాగుతోంది. అంటే గుంటూరులో ఉన్న జడ్పీ నుంచే మెటీరియల్, అల్పాహారానికి సంబంధించిన నిధులు మూడు జిల్లాలకు అందాలి. కానీ విభజన పాపంలా మారిందో, నిధుల లేమి కారణాలో తెలియదు కానీ పది విద్యార్థులు నష్టపోవాల్సి వస్తోంది. గుంటూరు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు 11,092 మంది ఉంటే, బాపట్ల, పల్నాడు జిల్లాలో మరో 28,202 మంది (మిగతా 6వ పేజీలో)



తల్లిదండ్రులపై భారం

పదోతరగతి చదువుతున్న చిన్నారులు మంచి ఫలితాలు సాధించేందుకు ఉపకరించే విద్యాజ్యోతి పేరుతో మెటీరియల్‌ను జిల్లా పరిషత్ ప్రతి సంవత్సరం అందించడం ఆనవాయితీ. అయితే ఈ మెటీరియల్‌ను పరీక్షలకు కనీసం మూడు నెలల ముందు అందించేవారు. మొదటి నుంచి ఈ మెటీరియల్‌ను విద్యా సంవత్సరం ప్రారంభంలో కానీ, కనీసం మధ్యలో ఎఫ్ఏ పరీక్షలు జరిగేటప్పుడైనా అందించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. అయితే ఈ విద్యా సంవత్సరానికైతే మరీ దారుణంగా పరీక్షలకు 52 రోజుల గడువు ఉన్నా మెటీరియల్ జాడలేదు. దీంతో విద్యార్థులు మార్కెట్‌లో దొరికే గైడ్‌లు కొనుగోలు చేసి వాటి ఆధారంగా పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఏడు సబ్జెక్టులకు సంబంధించి గైడ్ల కొనుగోలుకు రూ.1000 నుంచి రూ.1500 వరకు తల్లిదండ్రులపై అదనపు భారం పడుతోంది. అదే జడ్పీ నుంచి విద్యాజ్యోతి మెటీరియల్ అంది ఉంటే ఈ భారం పడేదికాదు.

సర్వే.. సతమతం

- రెవెన్యూ సదస్సుల్లో వేల సంఖ్యలో అర్జీలు
- మండలానికి ఓ గ్రామంలో రీ సర్వే మొదలు
- రెవెన్యూ, సర్వే విభాగాలను వెంటాడుతున్న సిబ్బంది కొరత



కొల్లూరు మండల పరిధిలోని గురువిందపల్లి గ్రామంలో రీసర్వే చేస్తున్న సిబ్బంది

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల వైసీపీ పాలనలో చోటుచేసుకున్న భూ సమస్యలను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తున్నది. ఈ క్రమంలో ఒకవైపు సిబ్బంది కొరత.. మరోవైపు పనుల ఒత్తిడితో రెవెన్యూ, సర్వే యంత్రాంగం సతమవతమవుతోంది. గ్రామసభలు, రెవెన్యూ సదస్సుల అర్జీల పరిష్కారంలో వేగం పెంచాలని ఉన్నతాధికారుల ఒత్తిళ్లు, రెగ్యులర్‌గా ప్రజాసమస్యల వేదికలో వచ్చే అర్జీలు, ఈనాం భూముల చిక్కులు, బ్లాక్ రికార్డు సమస్యలు ఇవి మరో ఎత్తు. ఇక సాంకేతికంగా ల్యాప్ టాప్‌లు కూడా సరిపడా లేకపోవడం, రోవర్స్ పనిచేయకపోవడం కూడా రీసర్వే ఘట్టానికి ప్రతిబంధకాలుగా మారాయి. ఒకేసారి సమాం తరంగా ఇన్ని పనులు చేయాల్సి రావడంతో దేని విషయంలో శ్రద్ధ పెట్టలేకపోతున్నామన్నది రెవెన్యూ, రీ సర్వే సిబ్బంది వాదన. గత ప్రభు త్వంలో రీసర్వే జరిగిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. దీనికి కొనసాగింపుగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను ఇటీవలే ప్రభుత్వం పూర్తి చేసింది. రీసర్వే గ్రామాల్లో వచ్చిన అభ్యంతరాల పరిష్కారం ఓ కొలిక్కి రాగా, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల విషయంలో కసరత్తు ముమ్మరంగా జరుగుతోంది. ఇవి జరుగు తుండగానే మండలానికి ఓ గ్రామం చొప్పున ఎంపిక చేసి రీ సర్వేకి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఒకేసారి వేల సంఖ్యలో రెవెన్యూ అర్జీలను పరిష్కరించాల్సి రావడం, రెగ్యులర్‌గా కార్యాలయాల్లో ఉండే పనులు ఇవన్నీ ఒకేసారి మీద పడడంతో సర్వే సిబ్బంది ఒకేసారి ఇన్ని పనులా అని వాపోతున్నారు. గ్రామసభల్లో వచ్చిన 4,115 అర్జీల్లో 700 అర్జీలకు సంబంధించి ఇంకా రెవెన్యూ విభాగం కసరత్తు చేస్తూనే ఉంది. రెవెన్యూ సదస్సుల్లో భాగంగా వచ్చిన 5,900 అర్జీల్లో కొలిక్కి వచ్చి నవి సగమే. ఇవి జరుగుతుండగానే ఈ నెల 20 నుంచి మండలానికి ఓ గ్రామం చొప్పున 25 గ్రామాల్లో రీసర్వే ఘట్టం ప్రారంభమైంది. మొత్తం 52,467 ఎకరాలను రీ సర్వే చేయాల్సి ఉండగా ఈ మూడు రోజుల్లో 4,635 ఎకరాల రీ సర్వేను పూర్తి చేశారు. రైతులకు నోటీసులు జారీ చేయడం, వారి సమక్షంలోనే రీసర్వేని పూర్తి చేయాల్సి ఉండడంతో సిబ్బంది మరింతగా ఒత్తిడి ఎదుర్కొంటున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత..

బాపట్ల జిల్లాగా ఆవిర్భవించి రెండున్నరేళ్లు దాటినా ఇప్పటికీ కార్యాలయాల్లో సిబ్బంది కొరత వెంటాడుతూనే ఉంది. సర్వే విభాగంలో ఇద్దరు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ల పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. ఇదే శాఖకు సంబంధింఇ మండలాల పరిధిలో దాదాపు 15 వరకు వివిధ విభాగాల్లో ఖాళీలు ఉన్నాయి. జిల్లా కార్యలయంలో పనిచేస్తున్న 8 మంది సిబ్బందిని రీ సర్వే విధుల్లో ఉన్నారు. దీంతో కలెక్టరేట్‌లోని రీ సర్వే జిల్లా కార్యాలయంలో పనులు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఇక రెవెన్యూ విభాగంలో తహసీల్దార్లు 8, డీటీలు 25, రీ సర్వే డీటీలు 11, సీనియర్ అసిస్టెంట్స్ 14, జూనియర్ అసిస్టెంట్స్ 12, టైపిస్టులు 25, వీఆర్‌వోలు 61, ఆఫీస్ సబార్డినేట్స్ 51 ఖాళీలు జిల్లా వ్యాప్తంగా ఉన్నాయి. దాదాపు మూడో వంతు పోస్టులు రెవెన్యూ విభాగంలో భర్తీకి నోచుకోవడం లేదు.

నివేశన స్థలాలకు భూములు గుర్తించాలి

- వచ్చే నెల 28 నాటికి నివేదిక రూపొందించాలి
- వినియోగంలో లేని భూములను తిరిగి తీసుకోవాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నివేశన స్థలాలు పంపిణీ చేయడానికి ప్రభుత్వ భూములను గుర్తించి ఫిబ్రవరి 28వ తేది నాటికి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధుల విన్నపాల పరిష్కారాలకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ అవసరాల కోసం ఇచ్చి వినియోగంలో లేని భూములను తిరిగి తీసుకోవాలన్నారు. గ్రామాల్లో శ్మశాన భూములకు అవసరమైన భూములను పరిశీలించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల నిర్మాణాలకు అవసరమైన భూములను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. తాగునీటి పథకాలు, సాగునీటి కాల్వల మరమ్మతులకి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

- చీరాల మండలంలో ఎత్తిపోతల పథకం ద్వారా 4,500 ఎకరాలకు సాగునీరు అందించడానికి ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. చీరాల కుందేరు వాగు ఆక్రమణలను పరిశీలించాలని రెవెన్యూ, డ్రెయినేజి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మోటుపల్లి వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి పరిశీలన చేయాలని దేవదాయశాఖాధికారులను ఆదేశించారు. జాతీయ రహదార్ల భూసేకరణలో నష్టపోయిన ప్రజలకు పరిహారం చెల్లించాలన్నారు. సమావేశంలో జేసీ ప్రఖర్‌జైన్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, వ్యవసాయాధికారి రామకృష్ణ, వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, ఆర్డీవో పి.గ్లోరియా, మహిళా శిశు సంక్షేమశాఖాధికారి కె.ఉమ, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

అక్షరాస్యులుగా చేయాల్సిన బాధ్యత మీదే

అద్దంకిటౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): గ్రామాలల్లో నిరక్షరాస్యులుగా ఉన్న ప్రజలను అక్షరాస్యులుగా చేయాల్సిన బాధ్యత ఉల్లాస్ సభ్యులపై ఉందని వయోజన విద్యా సూపర్‌వైజర్ టీ పోతురాజు సూచించారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ సభ్యులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరక్షరాస్యుల్లో మొదటి విడతలో 650 మహిళలను గుర్తించడం జరిగిందని, ప్రతి 10 మంది నిరక్షరాస్యులకు ఒక స్వచ్ఛంద సంస్థ ఉపాధ్యాయురాలిని గుర్తించినట్లు చెప్పారు. అలా గుర్తించిన వారికి ఈనెల 23వ తేదీ నుంచి అక్షరాలు నేర్పడం, అంకెలు, ఆన్‌లైన్ మోసాలును ఎలా అరికట్టవచ్చు తో పాటు ఆ ర్థిక అక్షరాస్యతపై శిక్షణ ఇచ్చారు. ప్రతి గ్రామంలో సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటలలోపు అక్షరాలు నేర్పే కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో 2- బూదాటి సుధాకరరావు, ఏపీవో కోటేశ్వరరావు, సీసీలు పాల్గొన్నారు.

అన్ని పాఠశాలల్లో గణతంత్ర వేడుకలు

- గ్రామాల్లో విద్యార్థులతో మార్చ్‌ఫాస్ట్
- పాఠశాల విద్యా కమిషనర్ వి.విజయరామరాజు

ఒంగోలు విద్య, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఈనెల 26న రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పాఠశాల విద్యా కమిషనర్ వి.విజయరామరాజు ఉత్తర్వులు జారీచేశారు. పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు జాతీయజెండాను ఎగురవేయాలన్నారు. ఉదయం పూట విద్యార్థులతో గ్రామాల్లో జాతీయ, దేశ భక్తి గీతాలు ఆలపిస్తూ మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాలన్నారు. గణతంత్ర వేడుకల సందర్భంగా పాఠశాలలో నిర్వహించాల్సిన కార్యక్రమాలను అన్ని విద్యాసంస్థలకు తెలియజేసి ఘనంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆర్జేడీ, డీఈవోలను కమిషనర్ ఆదేశించారు.

అమ్మాయిలే కావాలి

(5వ పేజీ తరువాయి)

దత్తత కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లు వివరాలు కూడా అందుబాటులో ఉంచితే ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కానీ గుంటూరు జిల్లాలో దత్తత అవకాశం ఉన్న పిల్లలు ముగ్గురు మాత్రమే ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వివిధ శిశు సంరక్షణ కేంద్రాల్లో, స్వచ్ఛంద సంస్థలు, అనాథ శరణాలయాల్లో అనేక మంది పిల్లలు ఉన్నారు. వీరితో పాటు గార్డియన్ సంరక్షణలో మరికొందరు పిల్లలు ఉన్నారు. వీరందరూ దత్తతకు అర్హులే. కానీ వీరిని గుర్తించి దత్తతకు కావాల్సిన ఏర్పాట్లు చేయడంలో అధికారులు శ్రద్ధ చూపడంలేదన్న విమర్శలున్నాయి. ఎక్కడైనా దొరికిన పిల్లల సమాచారం పోలీసులకు ఇస్తే వారిని మాత్రమే దత్తత ఇస్తున్నారు. మిగిలిన వారి గురించి పట్టించుకోవట్లేదని సమాచారం.

సుదీర్ఘంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ..

పిల్లల దత్తత తీసుకునే తల్లిదండ్రుల రిజిస్ట్రేషన్ ప్రక్రియే సుదీర్ఘంగా సాగుతుంది. పిల్లలు కావాలనుకునే వారు ముందుగా 'సీఏఆర్ఏ.ఎన్ఐసీ.ఇన్' అనే వెబ్‌సైట్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆ తర్వాత ఇద్దరూ కలిసి దిగిన ఫొటో, పాన్ కార్డు, చిరునామా, ఆధార్, పెళ్లి, ఆదాయ ధ్రువీకరణపత్రాలు, దీర్ఘకాలిక వ్యాధులు లేవని తెలిపే వైద్యుల సర్టిఫికెట్ వంటి పది రకాల పత్రాలను సదరు సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. వీటితో పాటు రూ.6 వేలు డీడీ తీయాలి. ఆ తర్వాత ఆయా వివరాలు సరైనవా కాదా, నమోదు చేసిన చిరునామాలోనే ఉంటున్నారా అని ఐసీడీఎస్ పీడీ, మెడికల్ అధికారి, చైల్డ్ అధికారులు, శిశు గృహ పర్యవేక్షకులతో కూడిన రిపోర్టు కమిటీ విచారణ చేపడుతుంది. వారు వివరాలు సరైనవి అని ధృవీకరించిన తర్వాతనే సదరు తల్లిదండ్రుల రిజిస్ట్రేషన్ అందుబాటులోకి వస్తుంది. ఈ రిజిస్ట్రేషన్‌కు మూడేళ్ల కాలపరిమితి ఉంటుంది. రిజిస్ట్రేషన్ నెంబరు ప్రకారం వీరి సంఖ్య వచ్చినపుడు వీరు చెప్పిన పిల్లలు అందుబాటులో ఉంటే అప్పుడు తల్లిదండ్రులకు చట్టప్రకారం దత్తత ఇస్తారు.

- దత్తత తర్వాత పిల్లల పరిస్థితిపై అధికారులు నిత్యం పర్యవేక్షిస్తారు. శారీరక హింసలకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే దత్తత ప్రక్రియను రద్దు చేసి, పిల్లలను వెనక్కి తీసుకుని తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తారు.
- 2017కు ముందు ఏఏ జిల్లాలో పిల్లలు దొరికితే ఆ జిల్లాలో దరఖాస్తు చేసుకున్న తల్లిదండ్రులకు మాత్రమే దత్తత ఇచ్చేవారు. కానీ ఆ తర్వాత ఏ రాష్ట్రం వారైనా పిల్లలను దత్తత తీసుకునే అవకాశాన్ని కేంద్రం కల్పించింది.

సమాచారం ఇవ్వండి..



జిల్లాలో ఉన్న అనాథ పిల్లలు. పోషణకు భారమైన పిల్లలు సమాచారాన్ని ఐసీడీఎస్ కార్యాలయంలో సమాచారం ఇవ్వండి. దత్తత విషయంలో ఎలా దరఖాస్తు చేసుకోవాలి...ఎంత సమ యం పడుతుంది అనే విషయాలపై చాలామందికి అవగాహన లేదు. అందుకే ప్రక్రియ ఆలస్యమవుతుంది. కొంతమంది ఈ రోజు దరఖాస్తు చేసుకుని రేపే పిల్లలు కావాలంటారు. కాస్త ఆలస్యమవ్వగానే ప్రత్యామ్నయ మార్గాలు ఎంచుకుంటారు. చట్టబద్ధంగా దత్తత సురక్షితం. భవిష్యత్తులో పిల్లలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేస్తాం.

- విజయలక్ష్మి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ మేనేజర్, గుంటూరు జిల్లా

ప్రోత్సాహకాలేవి?

(5వ పేజీ తరువాయి)

విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఈ విద్యార్థులకు జడ్పీ నుంచి అందాల్సిన ప్రోత్సాహకాల గురించి అధికారులు, పాలకవర్గం ఆలోచించడంలేదు.

దాతల సహకారంతో అల్పాహారం

విద్యార్థులను పరీక్షలకు సమాయత్తం చేసేందుకు సాధారణ తరగతులే కాకుండా అదనపు సమయాల్లోనూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు అటు సాధారణ తరగతులు, ఇటు ప్రత్యేక తరగతులతో విద్యార్థులు తీవ్రంగా అలసిపోతున్నారు. మధ్యాహ్న భోజనం తర్వాత వారికి ఎటువంటి అల్పాహారం అందదు. ఈ పరిస్థితుల్లో వీరికి అవసరమైన అల్పాహారాన్ని ఏటా జడ్పీ అందిస్తుంది. ప్రభుత్వం రూపొందించిన వంద రోజుల ప్రణాళిక ప్రకారం జనవరి నుంచి ప్రత్యేక తరగతులు జరుగుతున్నాయి. ఉదయం 8 నుంచి 9, సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య ప్రత్యేక తరగతులు జరుగుతున్నాయి. రోజంతా చదువు కోసమే కేటాయిస్తుండటంతో విద్యార్థులు మంచి ఆహారం లేక అలసిపోతున్నారు. ప్రత్యేక తరగతుల సమయంలో పౌష్టికాహారం తరహాలో వేరుశనగ ఉండలు, చిక్కీలు, పెసలు, బఠానీలు, శనగల వంటివాటిని ఉడకబెట్టి అల్పాహారం కింద అందించేవారు. ఇందుకు గతంలో రోజుకు ఒక్కో విద్యార్థికి రూ.10 నుంచి రూ.15 వరకు వెచ్చించేవారు. ఇదంతా జనవరిలోనే మొదలు కావాలి. అయితే ఫిబ్రవరి సమీపిస్తున్నా ఇంతవరకు జడ్పీ నిధులే కేటాయించలేదు.

రెండు రోజుల్లో అందిస్తాం

విద్యాజ్యోతి మెటీరియల్ ప్రింటింగ్‌లో ఉంది. రెండు రోజుల్లో అందిస్తాం. విద్యార్థులకు అల్పాహారం కూడా త్వరలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. నిధులతో సంబంధం లేకుండా విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా సకాలంలో అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

- జ్యోతిబసు, జడ్పీ సీఈవో, గుంటూరు

ఇటీవల చీమకుర్తి బాలికల వసతిగృహాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడ పరిస్థితులను మంత్రి దృష్టికి తీసుకెళ్లి శిథిలావస్థకు చేరుకున్న భవనాన్ని కూల్చివేసి తిరిగి నూతన భవనం, గదుల నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ నుంచి రూ.2కోట్లు మంజూరు చేశారు. అందుకు అవసరమైన అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ అనుమతులు రావాల్సి ఉంది.

గిద్దలూరులో బాలికల గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలకు నూతన భవనం కోసం స్థానిక ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి... ప్రభుత్వం నుంచి రూ.5కోట్ల నిధులను మంజూరు చేయించారు. నిధులు మంజూరై 3 నెలలు గడుస్తున్నా భవన నిర్మాణానికి స్థలం దొరకలేదు. యడవల్లి సమీపంలో స్థలం కేటాయిస్తారని తెలిసింది. త్వరితగతిన స్థలం కేటాయిస్తే పనులు మొదలుపెట్టే అవకాశం ఉందని ఐటీడీఏ ఏఈ జయరాజ్ తెలిపారు.

ఎర్రగొండపాలెం సంక్షేమ హాస్టళ్లలో వసతులు సరిగా లేవని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఇటీవల విద్యాశాఖ మంత్రి లోకేశ్, కలెక్టర్‌ల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ వసతిగృహాల నిర్మాణాలు, మరమ్మతులకు కోసం నిధులు మంజూరు చేసింది. స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్ మరమ్మతుల కోసం రూ.40లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఆ పనులు త్వరలో చేపట్టనున్నారు.

వసతికి మహర్దశ

- కొత్త భవనాలకు రూ.54.65 కోట్లు మంజూరు
- హాస్టళ్ల మరమ్మతులకు మరో రూ.9.3కోట్లు
- విద్యార్థులకు తీరనున్న కష్టాలు
- త్వరలో ప్రారంభం కానున్న పనులు
- కొన్నిచోట్ల స్థల సమస్యతో ఆలస్యం



జిల్లాలో సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు మంచిరోజులు వచ్చాయి. ఇప్పటికే ఉన్న భవనాలకు మరమ్మతులతో పాటు అవసరమైన చోట కొత్త భవనాలను నిర్మించనున్నారు. ఆమేరకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాలు మొత్తం 81 ఉండగా ఇందులో దాదాపు 8 వేల మంది విద్యార్థులు చదువును కొనసాగిస్తున్నారు. అందులో 42 మాత్రమే ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్నాయి. వీటిలో మౌలిక వసతులు అందుబాటులోకి రానున్నాయి.

ఒంగోలు నగరం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సమస్యలతో సతమతమవుతున్న సంక్షేమ వసతిగృహాల విద్యార్థుల వెతలు తీరనున్నాయి. జిల్లాలో అన్ని ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాల్లో త్వరలో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం బడుగువర్గాల పిల్లలు ఉండి చదువుకునే వసతిగృహాల బాగోగులను ఏ మాత్రం పట్టించుకోలేదు. కనీస సౌకర్యాల కల్పనకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతో ఎక్కడికక్కడే సమస్యలు తిష్టవేశాయి. విద్యార్థులు చదువు కొనసాగించటానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాంఘిక శాఖామాత్యులు స్వామి వసతిగృహాల్లో కనీస సౌకర్యాల కల్పనపై దృష్టిసారించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 810 సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాల్లో కనీస సౌకర్యాల కల్పనకు మొత్తం రూ.133కోట్లు విడుదల చేశారు. జిల్లాలో ఉన్న 42 ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాల్లో సౌకర్యాల కల్పనకు మొత్తం రూ.10 కోట్లు విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 81 వసతిగృహాలు ఉండగా వీటిలో 42 మాత్రమే ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్నాయి. ఆ వసతి గృహాల్లో కనీస వసతులు కల్పనకు నిధులు విడుదలయ్యాయి. మేజర్ పనుల నిర్వహణకు రూ.1.94 కోట్లతో, మైనర్ పనులు రూ.7.4 కోట్లతో చేపట్టనున్నారు.



సంతపేటలో బాలికల హాస్టల్‌కు శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, కలెక్టర్, ఎమ్మెల్యే జనార్దన్ (ఫైల్)

రూ.54.65 కోట్లతో నూతన భవనాలు



జిల్లాలోని పలు వసతిగృహాలకు నూతన భవన నిర్మాణాలకు కూడా నిధులను కేటాయించారు. ఈ నిధులు జిల్లా మినరల్ ఫండ్, కేంద్రప్రభుత్వం నుంచి ప్రధాన మంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన ద్వారా విడుదల చేశారు. జిల్లా మినరల్ ఫండ్ నుంచి రూ.16.25కోట్లు కేటాయించగా ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన కింద రూ.38.40కోట్లు రాబట్టనున్నారు. వీటితో నూతన భవనాలను నిర్మించనున్నారు. నీడలేక ఇబ్బందులు పడుతున్న సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహ విద్యార్థులకు జీప్లస్ పద్ధతిలో అధునాతన భవనాలను నిర్మించనున్నారు. వీటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తేనున్నారు.

నిర్మాణాలు - నిధులు ఇవీ..

- ఒంగోలు సంతపేటలోకి బాలికల వసతిగృహాన్ని రూ.6.15కోట్లతో జీప్లస్3 పద్ధతిలో నిర్మించనున్నారు. ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.
- రూ.2కోట్లతో సంతనూతలపాడులోని బాలుర వసతిగృహం, చీమకుర్తిలో ఉన్న బాలికల హాస్టల్‌లో అదనపు వసతి గదుల నిర్మాణానికి మరో రూ.2కోట్లు మంజూరయ్యాయి.
- ఒంగోలులో కళాశాల వసతిగృహాల విద్యార్థులకు జీప్లస్3 పద్ధతిలో రూ.5.50 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించనున్నారు.
- వీటితోపాటు వెలుగు టీటీడీసీ భవనాలకు సమీపంలో ఉన్న పరివర్తన భవన్‌కు రూ.60లక్షలతో మరమ్మతు పనులను చేపట్టనున్నారు. ఈ నిర్మాణాలను జిల్లా మినరల్ ఫండ్ నిధులతో చేపట్టనున్నారు.
- ప్రధాన మంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన కింద ఒంగోలులోని బాలుర హాస్టల్‌కు జీప్లస్ 3 పద్ధతిలో రూ.6కోట్లతో, కళాశాల బాలుర వసతిగృహాన్ని రూ.9కోట్లతో, బాలుర వసతిగృహం-2ను రూ.9కోట్లతో నిర్మించనున్నారు.
- వీటితోపాటు వైపాలెంలో బాలుర వసతిగృహాన్ని రూ.3కోట్లు, బాలికల వసతిగృహాన్ని రూ.6కోట్లు, గిద్దలూరులో బాలుర వసతిగృహం రూ.3కోట్లు, బాలికల వసతిగృహం మరో రూ.3 కోట్లతో నిర్మించనున్నారు.
- సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాలతోపాటు జిల్లాలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాల నిర్మాణాలు, మరమ్మతులకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

ఘనంగా లోకేష్ పుట్టినరోజు వేడుకలు

చీరాలటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రం క్లిష్ట పరిస్థితులలో ఉన్నప్పుడు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ యువగళంతో ప్రజల్లో చైతన్యం నింపారని, రాష్ట్ర భవిష్యత్ సుభిక్షంగా ఉండాలంటే ప్రజలకు అండగా లోకేష్ ఉండాలని టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్ అన్నారు. ఎమ్మెల్యే కొండయ్య ఆదేశాల మేరకు గురువారం చీరాల నియోజకవర్గంలో ఘనంగా లోకేష్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహేంద్రనాథ్ ముందుగా చీరాల ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. గడియార స్తంభం కూడలిలో టీడీపీ కూటమి నాయకులతో కలిసి కేక్ కటింగ్ నిర్వహించారు. జాండ్రపేట హైస్కూల్‌లో విద్యార్థులకు రాత పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. వేటపాలెం మండల పరిధిలోని దేశాయిపేట నీలకంఠాపురం వద్ద ఆశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. వేటపాలెం గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో నారా లోకేష్ సేవలను కొనియాడారు. ఆయన వెంట హ్యాండ్‌లూమ్స్ కార్పొరేషన్ చైర్మన్ సజ్జా హేమలత, టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అద్దంకి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను గురువారం టీడీపీ నేతలు నిర్వహించారు. అద్దంకిలోని పోతురాజుగండి వద్ద టీడీపీ కార్యాలయంలో అద్దంకి పట్టణ బీసీ సెల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు య ద్రాకుల రామాంజనేయులు, కోటిలింగాచారి, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని మణికేశ్వరంలో గ్రామ తెలుగుదేశం ఆధ్వర్యంలో 18 మంది పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, బడావలి, మీరావలి పాల్గొన్నారు. పట్టణంలోని కాకానిపాలెం తెలుగు మహిళల అధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

అద్దంకిటౌన్ : తెలుగునాగు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షురాలు గడ్డం అనంతలక్ష్మి ఆధ్వర్యంలో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారి డాక్టర్ అనితాజ్యోతి చేతులమీదుగా రోగులకు పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, టీడీపీ సభ్యులు పి.అనంత నారాయణ, వి. సుబ్బాయమ్మ, కె.నాగమణి, పి.అంజమ్మ, టీడీపీ 151బూత్ ఇన్‌చార్జి మురకొండ శ్రీధర్, గొట్టిముక్కల హరిష్, వరుణ్‌కుమార్, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.



వృద్ధులకు వస్త్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్

పర్చూరు : మంత్రి లోకేష్ జన్మదిన వేడుకను గురువారం మండలంలో తెలుగు తమ్ముళ్లు ఘనంగా నిర్వహించారు. బొమ్మల సెంటర్‌లో కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో బుల్లా మేస్త్రీ, హైటెక్ సుభానీ, చందనాల, చెరుకూరి చింపయ్య(శ్రీధర్), కొండ్రగంటి శివనాగేశ్వరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, మల్లాది సురేష్ షేక్ గౌస్, అల్లం శ్రీను, చంద్ర, పఠాన్ బాజీ పాల్గొన్నారు.

చినగంజాం : టీడీపీ కార్యాలయంలో మంత్రి లోకేష్ పుట్టిన రోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల కార్యాలయ ఆవరణలో మండల పార్టీ ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కలాం అజాద్ అధ్యక్షతన జరిగిన సభలో మండల అధ్యక్షుడు పొద వీరయ్య కేకు కట్ చేసి నాయకులకు పంచి పెట్టారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెరుకూరి రాఘవయ్య, టీ.జయరావు, మోటుమర్రి రామసుబ్బారావు, నరహరి శ్రీనివాసరావు, బెల్లంకొండ రమేష్‌బాబు, బీవీ.రమణారెడ్డి, పి.మోహనరావు, పర్వతరెడ్డి పార్థసారిధి, జి.నరసింహారావు, షేక్.జిలాని, ఎం.పద్మావతి, గంటా నరసింహారావు, షేక్.హుస్సేన్‌బాషా, రేపు నాంచార్లు, వాటుపల్లి ఏడుకొండలు, చినగంజాం, నీలాయపాలెం గ్రామ సర్పంచ్‌లు రాయని ఆత్మారావు, శ్రీనివాసరావులు పాల్గొన్నారు.



ఏలూరి క్యాంప్ ఆఫీస్‌లో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

మార్టూరు : మంత్రి లోకేష్ జన్మదిన వేడుకలను గురువారం మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి లోకేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో కామేపల్లి హరిబాబు, మిన్నెకంటి రవికుమార్, పొదవీరయ్య, పెంట్యాల శ్రీను,గుంటి వెంకటేశ్వర్లు, అనిల్ పాల్గొన్నారు. అదేవిధంగా మార్టూరులో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో లోకేష్ జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, ఇంటూరి ఆంజనేయులు, కమ్మశివ నాగేశ్వరరావు, గొట్టిపాటి వెంకట్రావు, కన్నెగంటి శ్రీనివాసరావు, అడుసుమల్లి శ్రీనివాసరావు, రామకృష్ణ, మువ్వా సాంబయ్య, జంపని శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మణికేశ్వరంలో పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు



పర్చూరులో కేక్ కట్‌చేసి లోకేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న తమ్ముళ్లు



దుప్పట్లను పంపిణీ చేస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు వీరయ్య

క్లస్టర్ రిసోర్స్‌సెంటర్లకు రూ.1.50 కోట్లు విడుదల

ఒంగోలు విద్య, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా ఏర్పాటైన క్లస్టర్ రిసోర్స్ సెంటర్ (సీఆర్‌సీ) స్కూలు కాంప్లెక్స్‌లకు 2024-25కి సీఎస్‌సీ గ్రాంటు విడుదల చేస్తూ సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో గతంలో 241 స్కూలు కాంప్లెక్స్‌లు ఉండగా వాటిని తాజాగా 150కి కుదించారు. సమగ్రశిక్ష ప్రాజెక్టు అప్రూవల్ బోర్డు 2024-25 (పీఏబీ) ఆమోదం మేరకు సీఆర్‌సీ గ్రాంటును విడుదల చేశారు. కొత్తగా ఏర్పాటైన సీఆర్సీ స్కూలు కాంప్లెక్స్‌లు ఒక్కొక్క దానికి రూ.లక్ష చొప్పున జిల్లాలోని 150 సీఆర్సీ స్కూలు కాంప్లెక్స్‌లకు రూ.1.50 కోట్లను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నిధులు ఎలా వినియోగించుకోవాలో మార్గదర్శకాలు కూడా జారీచేశారు. ఒక్కొక్క సీఆర్సీ స్కూలు కాంప్లెక్స్‌కు ఇచ్చిన రూ.లక్షలో మెయింటినెన్స్‌కు రూ.30వేలు, కంటింజెన్సీకి రూ.35వేలు, టీఎల్ఎంకు రూ. 25వేలు, రవాణా భత్యాలకు రూ.10వేలు వ్యయం చేసేందుకు అనుమతించారు.

ఒంగోలు-దొనకొండ

రైల్వే లైన్‌పై కదలిక

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా జిల్లా ప్రజానీకం ఎదురుచూస్తున్న ఒంగోలు-దొనకొండ నూతన రైల్వేలైన్ పొదిలి మీదుగా ఏర్పాటు చేసేందుకు డిటైల్ ప్రాజెక్టు రిపోర్టును రూపొందిస్తున్నట్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. ఈ మేరకు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి లిఖితపూర్వకంగా తెలిపారు. రైల్వేలైన్ ఏర్పాటు కోసం ఇటీవల కేంద్రమంత్రిని ఎంపీ కలిసి ఆవశ్యకతను వివరించారు. ఆ ప్రాంతంలో రైల్వేలైన్ ఏర్పాటు చేయడంతో కలిగే ప్రయోజనాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ పొదిలి మీదుగా ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఒంగోలు-పొదిలి రైల్వేలైన్‌ను కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మాగుంట కోరారు. ఈ నేపథ్యంలో స్పందించిన కేంద్రమంత్రి ఆ రైల్వేలైన్ ప్రాజెక్టు డిటైల్ ప్రాజెక్టు నివేదికను రూపొందిస్తున్నట్లు లేఖను పంపారు.

పోస్టల్ బీమాను సద్వినియోగించుకోండి

మార్కాపురం డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు

దొనకొండ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తక్కువ ప్రీమియంతో ఎక్కువ లాభం పొందే పోస్టల్ బీమా పాలసీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రతి ఒక్కరూ గ్రామాల్లో ప్రజలను చైతన్యపర్చాలని మార్కాపురం డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు పేర్కొన్నారు. దొనకొండకు చెందిన ఖాసిం అనే ప్రభుత్వ ఉద్యోగి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన రూ.399 చెల్లించి పోస్టల్ బీమా చేయించుకోవటంతో ప్రమాద బీమా క్రింద మంజూరైన రూ.10లక్షల చెక్కును మృతుడి కుమారుడికి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పోస్టల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ గ్రామాల్లో నివసించే వారిలో కుటుంబ పెద్ద ఆకస్మాత్తుగా చనిపోతే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేలా పోస్టల్ బీమా పాలసీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తహసీల్దార్ బీ. రమాదేవి , ఎంపీడీవో శ్రీదేవి, కంభం పోస్టల్ శాఖ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ అలీ, ఐపీపీబీ మేనేజర్ సాయిరామ్, స్థానిక పోస్టు మాస్టర్ హర్షద్‌ఖాన్, మండలంలోని పలు గ్రామాలకు చెందిన పోస్టల్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆ రోడ్లకు మోక్షం ఎప్పుడో?


తారు రోడ్డు ఆనవాళ్లు కూడా లేని సాధునగర్ - గోవాడ రోడ్డు


సాధునగర్ - గోవాడ రోడ్డులో ఉన్న పెద్ద పెద్ద గోతులు


శాంతినగర్ - మైలవరం రోడ్డులో గోతులు


తారు ఆనవాళ్లు లేకుండా గోతులుగా ఉన్న వీకొప్పెరపాడు - చినజమ్ముల మడక రోడ్డు

- రెండు దశాబ్దాల క్రితం నిర్మాణం
- కనీస మరమ్మతులు లేక 10 గ్రామాల ప్రజలు అవస్థలు
- గొట్టిపాటి మార్టూరు ఎమ్మెల్యేగా ఉన్నకాలంలో నిర్మాణం
- ఆ తర్వాత అతీగతీ లేదు
- మంత్రిపైనే ప్రజల ఆశలు

అద్దంకి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రెండు దశాబ్దాల కిందట ఆ రోడ్లను నిర్మించారు. మరలా కనీస మరమ్మతులు కూడా చేపట్టలేదు. శాఖల బదిలీతో అసలుకే మోసం ఏర్పడింది. అద్దంకి, బల్లికురవ మండలాలలోని మూడు గ్రామీణ రోడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో రాకపోకలకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గొట్టిపాటి రవికుమార్ మార్టూరు ఎమ్మెల్యేగా ఉన్న తొలినాళ్లలో అప్పట్లో మార్టూరు నియోజకవర్గం పరిధిలో ఉన్న అద్దంకి మండలంలోని వెంపరాల, ఉప్పలపాడు, మైలవరం, ఏలేశ్వరవారిపాలెం, బల్లికురవ మండలం చినజమ్ములమడక, వెలమవారిపాలెం, కొత్తూరు గ్రామాలకు మెరుగైన రవాణా వసతి కల్పించేందుకు సుమారు 20 కి.మీ మేర పంచాయతీరాజ్ శాఖ (పీఐయూ) ద్వారా రెండు దశాబ్దాల కిందట తారు రోడ్డు నిర్మాణం జరిగింది. మైలవరానికి చెందిన ఓ ఇంజనీరింగ్ అధికారి ఉన్నతస్థాయిలో ఉండడంతో అప్పట్లో రోడ్డు నిర్మాణానికి వేగవంతంగా నిధులు మంజూరు అయ్యాయి. అదే సమయంలో అద్దంకి మండలంలోని (అప్పటి ఎన్ఆర్‌టీ రోడ్డు ప్రస్తుతం నామ్ రోడ్డు) సాధునగర్ నుంచి గోవాడ వరకు సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర కూడా తారు రోడ్డు నిర్మాణం జరిగింది. అయితే పంచాయతీరాజ్ శాఖలో రోడ్ల నిర్మాణం చేయడమే కాని మరమ్మతులకు నిధులు కేటాయింపు ఉండకపోవడంతో అనంతరం మరమ్మతుల ఊసే లేకుండా పోయింది. దీంతో కనీస మరమ్మతులు కూడా లేకపోవడంతో పలు సందర్భాలలో ఆయా గ్రామాల ప్రజలే తాత్కాలిక మరమ్మతులు చేసుకొని ప్రయాణాలు సాగించినా మరలా కొద్ది రోజులకే యథాస్థితికి చేరుకుంటున్నాయి. పంచాయతీరాజ్‌శాఖలో నిధుల లేమితో మధ్యలో ఆర్అండ్‌బీ పరిధిలోకి మార్పు ప్రతిపాదనలు జరిగినా ఆ శాఖలో కూడా అప్పట్లో నిధులు లేకపోవడంతో పంచాయతీరాజ్ పరిధిలోనే కొనసాగిస్తున్నారు. చాలాచోట్ల కనీసం తారు రోడ్డు ఆనవాళ్లు కూడా లేకుండా పూర్తి శిథిలావస్థకు చేరాయి. దీంతో ఆయా గ్రామాలకు గొట్టిపాటి రవికుమార్ పర్యటనలకు వెళ్లిన ప్రతిసారీ ప్రజలు ఆ రోడ్ల గురించే ప్రస్తావిస్తున్నారు. అదే సమయంలో 2024 ఎన్నికలకు ముందు కూడా ఆయా గ్రామాల ప్రజలకు హామీ కూడా ఇచ్చారు. ఇటీవల గోవాడలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమైన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి కూడా రోడ్ల దుస్థితిని ఆయా గ్రామాల ప్రజలు తీసుకువచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే ఆయా రోడ్ల పునఃనిర్మాణానికి మంత్రి రవికుమార్ [illegible] సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకుపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ రోడ్లకు పెద్ద ఎత్తున నిధులు కేటాయింపు జరిగి మరమ్మతులు జరుగుతున్నా పంచాయతీరాజ్ పరిధిలో ఉండడంతో ఆ మూడు రోడ్లకు మోక్షం కలగలేదు. ఈ నేపథ్యంలో త్వరలో నాబార్డు లేదా ఇతర నిధుల నుంచి ఆయా రోడ్లకు నిధులు మంజూరయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

మంత్రి రవికుమార్ ఆదేశాలతో ప్రతిపాదనలు

శాంతినగర్ - మైలవరం, వి.కొప్పెరపాడు - చినజమ్ములమడక, నామ్ రోడ్డు - గోవాడ రోడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పునఃనిర్మాణం కోసం మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగింది. నిధులు మంజూరైన వెంటనే రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుంది.

- రమేష్‌బాబు, డీఈఈ, పీఆర్ఐ, సంతమాగులూరు


రైతులకు సూచనలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

శనగలో తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టండి

పంగులూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : సాగులో ఉన్న శనగ పైరుకు విల్ట్‌తో పాటు వేరుకుళ్లు తెగులు ఆశించిందని, దాని నివారణకు తగిన సస్య రక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని కొండమంజులూరు, కోటపాడు గ్రామాలలో గురువారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగులో ఉన్న వరి, శనగ పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో నేతలు గడ్డం నాగేశ్వరరావు, కార్యదర్శి శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది శైలేష్, అక్షరరాణి, రైతులు పాల్గొన్నారు.

బాలికలు ధైర్యంగా హక్కులు సాధించాలి


విద్యార్థినులకు బహుమతులను అందజేస్తున్న సీడీపీవో సుధ

బల్లికురవ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : బాలికలు తమ హక్కులను ధైర్యంగా సాధించాలని ఐసీడీఎస్ సీడీపీవో సుధ అన్నారు. గురువారం బల్లికురవ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంతా విద్యార్థినులకు పలు పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. బాలికలకు సమస్యలుంటే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సుధ సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోటీలతో జ్ఞాపకశక్తి మెరుగు


బహుమతులు అందుకున్న విద్యార్థినులతో ప్రతినిధులు

చీరాలటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : విద్యాభ్యాస పోటీలలో పాల్గొనడం వలన విద్యార్థులకు జ్ఞాపకశక్తితో పాటు జనరల్ నాలెడ్జి పెరుగుతుందని పలువురు వక్తలు అన్నారు. గురువారం బత్తుల సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో పెన్షనర్స్ కార్యాలయంలో వేమన పద్య కంఠస్థ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు వలివేటి మురళీకృష్ణ, బత్తుల బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ వేమన గొప్ప సంఘ సంస్కర్త అని చెప్పారు. వేమన పద్యాలను సీపీ బ్రౌన్ వెలుగులోకి తెచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

హోం ట్రయాంగిల్ యాప్‌తో ఉపాధి అవకాశాలు

అద్దంకి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి అవకాశాలను మరింత పెంచేందుకు హోమ్ ట్రయాంగిల్ యాప్ దోహదపడుతుందని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో సర్వీస్ ప్రోవడైర్లకు గురువారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం చేతివృత్తి పని చేసే వారి ఆదాయాన్ని మరింత పెంచేందుకు హోమ్ ట్రయాంగిల్ యాప్‌తో సర్వీస్ ప్రొవైడర్లను అనుసంధానం చేస్తుందన్నారు. పట్టణంలో వివిధ చేతివృత్తి పనిచేసే 70 మంది సర్వీస్ ప్రొవైడర్‌లు పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. ఏసీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్‌మిషన్, వాటర్‌ప్యూరిఫైర్, గ్రీజర్‌రిపేర్, వడ్రంగి, ప్లంబింగ్, విద్యుత్, బ్యూటీషియన్ తదితర సేవలను హోమ్ ట్రయాంగిల్ ద్వారా బుక్ చేసుకోవచ్చన్నారు. దీని ద్వారా వినియోగదారులకు త్వరితగతిన సేవలు పొందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీదేవి, మెప్మా సీవో శ్రీలత పాల్గొన్నారు.


సర్వీస్ ప్రొవైడర్ల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవీంద్ర

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి

వేటపాలెం(చీరాలటౌన్), జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో గురువారం ఘనంగా స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా కార్యక్రమాల్లో ముందుగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి జడ్పీ పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మెడబలిమి శేఖరరావు, ఉపాధ్యాయులు వేణుగోపాలరావు, బుద్ధి మోహన్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు. నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో జనరథం కూడలి సెంటర్‌లో నేతాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు బండారుపల్లి హేమంత్‌కుమార్, చుండూరి కృష్ణమూర్తి, పవని భానుచంద్రమూర్తి, మణిబాబు, కనపర్తి రామారావు, చంద్రమౌళి, సుబ్బరామయ్య, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, శీలం రవికుమార్ పాల్గొన్నారు. ఈపురుపాలెం నేతాజీ యువజన స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.


విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఉపాధ్యాయులు

మహిళ మండలిలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, వెంకటరావు, లలిత, సీయోను, విజయ్, సంధ్యారాణి, శిరీష, జ్యోతి, ధనమ్మ, సుకీర్తన, గీత పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : పోరాడితేనే స్వాతంత్ర్య వస్తుందని నమ్మి చివరి వరకు తను నమ్మిన సిద్ధాంతాన్ని అనుసరించిన మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ యు. దేవపాలన అన్నారు. గురువారం బోసు జయంతి సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో కొత్తపేటలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి మురళీసుధాకరరావు, ట్రెజరర్ శ్రీనివాసరావు, ఏజీ మహమ్మద్ రఫీ, శ్రీనివాసరావు, అంజాద్‌బాషా పాల్గొన్నారు.

బల్లికురవ : మండలంలోని చెన్నుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం నేతాజీ బోసు జయంతిని మార్టురు రోటరీ క్లబ్ వారు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు కోటేశ్వరరావు, సాంబయ్య, ఉపాధ్యాయులు శేషగిరి, కృష్ణయ్య, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ఇంకొల్లు : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ 128 జయంతి ఘనంగా నిర్వహించారు.పాఠశాల ఆవరణలో నేతాజిసుభాష్‌చంద్రబోస్ విగ్రహం మరియు నాగులచెరువుకట్ట వద్ద సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఎన్సీసి ఆఫీసర్ ఎ.శ్రీమన్నారాయణ,ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు టి.ఆదినారాయణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి ఎన్‌సీసీ క్యాడెట్లు


బోసు విగ్రహానికి నివాళులర్పిస్తున్న రోటరీ సభ్యులు

రేపు ఏలూరి క్యాంప్ కార్యాలయంలో జాబ్ ఫెయిర్

మార్టూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం 8 గంటలకు గ్రీన్‌స్పార్క్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్ ఫెయిర్‌ను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన సారథ్యంలో గ్రీన్‌స్పార్క్ ఫౌండేషన్, హెచ్ఆర్‌కో కంపెనీలు సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ ఫెయిర్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ జాబ్ ఫెయిర్‌లో 10వతరగతి నుంచి పీజీ వరకు విద్యార్హత కలిగిన వారికి ఇంటర్వ్యూలను నిర్వహిస్తారు. మొత్తం 8 ప్రముఖ కంపెనీలు పాల్గొని నిరుద్యోగులకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తారు. అందులో గ్రీన్‌స్పార్క్ ఫౌండేషన్ టీం రిజిస్ట్రేషన్ చేసిన అభ్యర్థులతోపాటు, ఆన్‌లైన్‌లో రిజిస్టర్ అయిన ప్రతి ఒక్కరికీ వారి అర్హతలను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ జాబ్ ఫెయిర్‌ను నిర్వహిస్తున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

రసాయన రహిత ఆహార ఉత్పత్తులకు ప్రాముఖ్యం

అద్దంకిటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రసాయన రహిత ఆహార ఉత్పత్తులకు ప్రాముఖ్యత రాబోతుందని, రైతులందరూ ఆ దిశగా పంటను పండించాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పరిధిలో సాగు చేసిన పంటలను పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడుతూ రైతులు తము సాగు చేసిన పంటలకు ఆయా గ్రామంలో రసాయన పురుగు మందుల వాడకుండా 10 ఎకరాలలో శనగను పండిస్తున్నట్లు తెలిపారు. పంట పూత దశలో ఉన్నందున వేప నూనె పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు, రైతులు అడుసుమల్లి శ్రీనివాసరావు, గుర్రం పేరయ్య పాల్గొన్నారు.

శరవేగంగా ఆలేరు వాగు భూ సేకరణ ప్రక్రియ

ఎమ్మెల్యే ఏలూరి చొరవతో ప్రక్రియ వేగవంతం

నాయుడువారిపాలెం(కారంచేడు) జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఆలేరు వాగు భూ సేకరణ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. దశాబ్ద కాలంగా పరిష్కారానికి నోచుకోని ఆలేరు వాగు (లెఫ్ట్ ఆర్మ్) కాలువ నిర్మాణానికి భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం అందించే విధంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవ చూపారు. ఆ ప్రక్రియను పూర్తి చేసే విధంగా స్థానిక నేతలను సన్నద్ధం చేశారు. దీంతో ఆలేరు వాగు భూ సేకరణలో భూములు కోల్పోయిన రైతుల జాబితాను సిద్ధం చేసుకొని నష్టపరిహారం అందించే విధంగా భూ సేకరణ ఫార్మలా కమిటీ అధ్యక్షుడు విజయ్ కుమార్ నేతృత్వంలో రైతుల సమస్య పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నారు.


రైతులకు సంబంధించిన భూముల పత్రాలను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు


పశు పోషకులకు మందులను పంపిణీ చేస్తున్న అధికారులు

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

జిల్లా పశు వైద్యాధికారి వేణుగోపాల్

నాగులపాలెం(పర్చూరు), జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేవిధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా పశు వైద్యశాఖ అధికారి వేణుగోపాల్ అన్నారు. గురువారం మండలంలోని నాగులపాలెంలో పశు సంవర్ధక శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధికారి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీహెచ్‌వో మాట్లాడుతూ పశువులకు మెరుగైన వైద్య సేవలను అందించడంతో పాటు, పశుపోషకులను పోత్సహించే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పి.షానిలా ఏడీ మాధవి, సీహెచ్ చంద్రశేఖర్, వైద్యులు అరుణ, భాగ్యరాజ్, సిబ్బంది, పోషకులు పాల్గొన్నారు.

పంగులూరు : పశు పోషణలో రైతులు మెళకువలను పాటించాలని పశు వైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని కల్లంవారిపాలెం గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరాన్ని టీడీపీ గ్రామ నేత గుడిపాటి సుబ్బారెడ్డి ప్రారంభించారు. గొర్రెలు, దూడలకు నట్టల నివారణ మందు తాగించారు. గేదెలకు సూడి పరీక్షలు నిర్వహించి ఎద ఇంజక్షన్లు చేశారు. కొండమూరు గ్రామంలో డాక్టర్ సైదయ్య ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఎద సమయంలో గేదెలకు ఇంజక్షన్లు చేయించడం ద్వారా సూడిమోసిన గేదెలకు పడ్డ దూడలు పుట్టే అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని డాక్టర్ సైదయ్య సూచించారు. కార్యక్రమంలో ఏహెచ్‌ఏలు శ్రీనివాసులు, అర్షియా, శివనాయక్, మహాలక్ష్మి, అంకయ్య, రమేష్, ఏలియా పాల్గొన్నారు.

బల్లికురవ : పశువులకు గ్రామాలలోనే మెరుగైన వైద్యాన్ని అందిస్తామని పశు వైద్యాధికారులు మహేశ్వరరావు, పావనీకుమారిలు పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొమ్మినేనివారిపాలెం, వైదన గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు ప్రభుత్వం విడుదలచేసిన ఆరోగ్య శిబిరాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వైద్యులు పశువులకు, గొర్రెల కోసం మందులను అందజేశారు.

సీసీ రోడ్డు వివాదంలో ఏడుగురిపై బైండోవర్

బల్లికురవ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబడిపూడి గ్రామంలో సిమెంట్ రోడ్డు విషయమై రెండు కుటుంబాల మధ్య ఏర్పడిన వివాదంపై బైండోవర్ కేసు నమోదు చేశారు. గురువారం తహసీల్దార్ రవినాయక్ వద్ద ఏడుగురిని బైండోవర్ చేశారు. అంబడిపూడి గ్రామానికి చెందిన పల్లపు రామకృష్ణ, మన్నెం శ్రీనివాసరావు మధ్య సీసీ రోడ్డు వద్ద వివాదం జరుగుతుంది. ఇరువురు పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు. వివాదం పెద్దది కాకుండా రెండు కుటుంబాలకు చెందిన వారిని తహసీల్దార్ సమక్షంలో బైండోవర్ చేశారు.

పెంచిన ధరలను విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న హమాలీలు

చీరాలటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కూలి ధరలు చాలక అవస్థలు పడుతున్నామని హమాలీ వర్కర్లు అన్నారు. ప్రభుత్వం ధరలను పెంచడం ఆనందదాయకమని, అయితే వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా గురువారం ఎంఎల్‌సీ పాయింట్ వద్ద నిరసన చేపట్టారు. 2024లో నిలిచిన కార్మికులకు అందాల్సిన వేతనాలతో పాటు పెంచిన ధరలను కూడా విడుదల చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బాధ్యులు బాసి షైడయ్య, వెంకటరమణ, శ్రీను, రమణ, అప్పన్న పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

చినగంజాం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో ఈ నెల 25వ తేదీ ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి తెలిపారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి జడ్పీటీసీ, మండల పరిధిలోని ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.


జనసేన పార్టీ నాయకుల హర్షం


కేకు కట్ చేస్తున్న కూటమి నాయకులు

చినగంజాం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీకి గాజు గ్లాసు గుర్తు కేటాయించడంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం రాజకీయ పార్టీల జాబితాలో శాశ్వత గుర్తుగా జనసేన పార్టీకి గాజు గ్లాసును కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా గురువారం స్థానిక రైల్వే గేటు సెంటర్‌లోని జనసేన పార్టీ మండల కార్యాలయంలో కేకు కట్ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు సందు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కూటమి నాయకులు కేకు కట్ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తుమ్మలపెంట సతీష్, నరహరి శ్రీనివాసరావు, చెరుకూరి రాఘవయ్య, పి.పార్థసారిధి, సందు శ్రీనివాసరావు, డి.ఏసునారాయణ, హరి, టి.ఆదినారాయణ, ఎన్.గోపీనాథ్, సీహెచ్.లక్ష్మణ్ పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాను వినియోగించుకోవాలి

చీరాలటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) :చీరాల మండలం ఈపూరుపాలెం ఎస్‌కెబీఎస్‌ఎం ఐటీఐ కళాశాలలో శనివారం మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాబివృద్ధి సంస్థ అధికారి ప్రణయ్ తెలిపారు. ఉపాధి, సీడాప్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాలో 100 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ప్రముఖ కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లమో, పీజీ కోర్సులను పూర్తిచేసిన నిరుద్యోగులు 8008986256, 9988853335 నంబర్‌లను సంప్రదించాలని ఆయన కోరారు.



సోమశిలలో 68.737 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 1,884 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 68.737 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,550, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

6 1 నుంచి నెల్లూరులో సీపీఎం మహాసభలు



నెల్లూరు : జిల్లా టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న సోమిరెడ్డి, అజీజ్, కోటంరెడ్డి తదితరులు

అట్టహాసంగా..

మంత్రి లోకేష్ జన్మదిన వేడుకలు



కందుకూరులో మహిళకు కుట్టుమిషను అందజేస్తున్న శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే ఇంటూరి

రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు జన్మదిన వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీశ్రేణులు నిర్వహించాయి. పార్టీ కార్యాలయాల్లో కేకులు కట్‌చేసి, సంబరాలు చేసుకున్నారు. అలాగే, ఆలయాల్లో లోకేష్ పేరిట పూజలు, కుట్టుమిషన్లు, విద్యాసామగ్రి పంపిణీతోపాటు అన్నదానం చేశారు. నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. కందుకూ రులో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. కావలిలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, నెల్లూరు రూరల్‌లో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కేకు కట్ చేశారు. నెల్లూరు నగరం, ఆత్మకూరు, ఉదయగిరి, సర్వేపల్లి, కోవూరు తదితర ప్రాంతాల్లో టీడీపీ నాయకులు లోకేష్ జన్మదిన వేడుకలను అట్టహాసంగా జరిపారు.

ఆ అధికారం

స్థానిక సంస్థలదే!

- నుడా అధికారాలు బదలాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- లేఅవుట్లు, భవనాల అనుమతుల అధికారం మున్సిపాలిటీలదే
- ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారాలు కూడా వాటికే అప్పగింత
- పంచాయతీలు మాత్రం నుడా పరిధిలోనే

నగరపాలక సంస్థ, మున్సిపాలిటీలు వంటి స్థానిక సంస్థలకు పెద్దపీట వస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. లేఅవుట్లు, పెద్ద భవనాల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసే అధికారాన్ని స్థానిక సంస్థలకు కట్టబెడుతూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకూ పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో ఉన్న కీలక అధికారాలను మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు బదలాయిస్తూ జీవో నెం.5 విడుదల చేసింది.



నెల్లూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎక్కడ లేఅవుట్ వేసినా ఇప్పటివరకూ నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) అనుమతులు మంజూరు చేస్తుండేది. ఇకపై నెల్లూరు కార్పొరేషన్‌తోపాటు కావలి, కందుకూరు, ఆత్మకూరు మున్సిపాలిటీలు, బుచ్చి, అల్లూరు నగర పంచాయతీల పరిధిలో వేసే లేఅవుట్లకు ఆయా స్థానిక సంస్థలే అనుమతులు మంజూరు చేయనున్నాయి. భవనాల అనుమతులకు కూడా ఇదే విధానం అమలవుతుంది. అయితే పంచాయతీలను మాత్రం నుడాలోనే కొనసాగించారు. అక్కడ ఎటువంటి లేఅవుట్ వేసినా నుడా అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఇక మరో కీలకమైన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారాన్ని కూడా స్థానిక సంస్థలకే కట్టబెట్టారు. అక్రమ లేఅవుట్లు, అనధికార భవనాలపై నిఘా ఉంచి, చర్యలు తీసుకునే అధికారాలను కార్పొరేషన్,

- మిగతా 6లో..

ఎస్సీ కార్పొరేషన్ లక్ష్యాల అమలుకు ఆమోదం

నెల్లూరు (హరనాథపురం) జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఈ ఆర్థిక సంవత్సరానికి జిల్లా ఎస్సీ కార్పొరేషన్‌కు కేటాయించిన లక్ష్యాల అమలుకు కలెక్టర్ ఆమోదం తెలిపారని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ సీసీఎఫ్‌సీ లిమిటెడ్ ఛైర్మన్ మొత్తం 1134 వివిధ సెక్టార్లకు యూనిట్లను జిల్లాకు లక్ష్యంగా నిర్దేశించారని పేర్కొన్నారు. ఈ యూనిట్ల విలువ రూ.38.8కోట్లు కాగా, ఇందులో సబ్సిడీ రూ.17.86కోట్లుగా పేర్కొన్నారు. బ్యాంకు రుణం రూ.18.69కోట్లుగా తెలిపారు. ట్రాన్స్‌పోర్టు సెక్టారుకు 316, పశుసంవర్ధకశాఖకు 320, ఐఎస్‌బీకు 380, అగ్రికల్చరల్‌కి 118 యూనిట్లు కేటాయించారని ఆమె తెలిపారు. ఈ పథకాలకు అర్హత కలిగినవారు ఆధార్‌కార్డు, కుల, ఆదాయ, పుట్టినతేదీ ధ్రువపత్రాలు, రేషన్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఫోన్ నెంబరుతో ఏపీ ఓబీ ఎంఎంఎస్ పోర్టల్ విడుదల కాగానే నమోదు చేసుకోవడానికి సిద్ధంగా ఉండాలని ఆమె తెలిపారు. వయసు 21 నుంచి 50 ఏళ్లలోపు ఉండాలన్నారు.

● రీసర్వేపై సందేహాల నివృత్తికి కాల్ చేయండి

భూ యజమానులకు, సర్వే సిబ్బందికి, రెవెన్యూ సిబ్బందికి, రీసర్వేలో వచ్చిన సందేహాల నివృత్తికి రాష్ట్రస్థాయిలో హెల్ప్ లైన్‌ను ఏర్పాటు చేశారని సర్వేశాఖ జిల్లా సహాయ సంచాలకులు నాగశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టోల్ ఫ్రీ నెంబరు 81436 79222గా ఆయన పేర్కొన్నారు. కార్యాలయ పనిదినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల్లోగా పైనెంబరుకు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు.

పన్ను లక్ష్యం రూ.130 కోట్లు

వసూలు 48 కోట్లే!

నెల్లూరు నగర పాలక సంస్థకు భారీగా ఆదాయం వచ్చే మార్గం ఉన్నా దానిని రాబట్టుకునే ధ్యాస అధికారులకు కరువైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో పన్నుల ద్వారా రూ.130 కోట్లు కార్పొరేషన్ ఖజానాకు జమకావాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.48.64 కోట్లే జమ అయింది. మరో 2 నెలల్లో ముగియనున్న ఆర్థిక సంవత్సరానికి రూ.81.36 కోట్ల పన్ను వసూలు సాధ్యమవుతుందా!? మొండి బకాయిల వైపు కన్నెత్తి చూడని ఆర్‌ఐలు వ్యక్తిగతంగా ఆదాయాన్ని తెచ్చిపెట్టే కొత్త అసెస్‌మెంట్లతోనే రోజులు గడిపేస్తున్నారు. ప్రతిరోజూ కమిషనర్ సూర్యతేజ, వీలైనప్పుడల్లా మంత్రి నారాయణలు సమీక్షలు పెట్టినా ఆశించిన ప్రగతి రెవెన్యూ విభాగంలో కనపడటం లేదన్న వాదన వ్యక్తమవుతోంది. కాగ రూ.55.72 కోట్ల నీటి పన్ను వసూళ్లకుగాను 12 శాతం రాబట్టిన రెవెన్యూ అధికారులు అంతటితో సరిపెట్టుకున్నారు.

- కార్పొరేషన్‌లో రెవెన్యూ విభాగం తీరిది
- మొండి బకాయిల ఊసెత్తని ఆర్‌ఐలు
- 2 నెలల్లో 62.7 శాతం వసూలు సాధ్యమేనా!?
- కొత్త అసెస్‌మెంట్లపైనే ధ్యాసంతా!
- 12 శాతానికే పరిమితమైన నీటి పన్ను వసూలు

నెల్లూరులోని 54 డివిజన్లలో 1,40,122 అసెస్‌మెంట్ల ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వివిధ పన్నుల ద్వారా రూ.69.63 కోట్లు, మొండి బకాయిలు ద్వారా మరో రూ.60.77 కోట్లు కార్పొరేషన్ ఖజానాకు చేరాల్సి ఉంది. ఇందులో ఇప్పటివరకు రెవెన్యూ విభాగం రూ.48.64 కోట్లు మాత్రమే వసూళ్లు చేసింది. సాధారణంగా కార్పొరేషన్‌కు వచ్చే పన్నులను మాత్రమే ఆర్‌ఐలు వసూళ్ల కింద చూపుతూ కాలం గడిపేస్తున్నారు. మొండి బకాయిల జోలికి మాత్రం వెళ్లడం లేదు. దీంతో అవి గుదిబండగా మారాయి. రూ.60.77 కోట్ల మొండి బకాయిలలో ఆర్‌ఐలు ఇప్పటివరకు రూ.8.10 కోట్లు మాత్రమే వసూలు చేసి చేతులు దులుపుకున్నారు. కార్పొరేషన్‌లో నెల వారి ఖర్చులు పెరుగుతున్నా జమలు మాత్రం అధికారికంగా ఖజానాలో నమోదవుడంలేదన్న విమర్శ ఉంది. ప్రతి నెల విద్యుత్ బకాయి రూ.కోటి, వాహన ఆయిల్ ఖర్చు మరో రూ.కోటి, ఉద్యోగుల జీతాలు ఇంకో రూ. కోటి వరకు లెక్కల్లోకి ఎక్కుతోంది. ఇలా రూ.3 కోట్లు ప్రతి నెల కార్పొరేషన్ సాధారణ చెల్లింపులకే సరిపోతోంది. దీనికి తగ్గట్టుగా ఆదాయం ఉన్నా వసూళ్లు మాత్రం అంతంతా మాత్రంగానే ఉంటోంది.

● 2 నెలల్లో రూ.81 కోట్లు సాధ్యమేనా?

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికి 10 నెలలు పూర్తయ్యాయి. ఇప్పటివరకు రూ. 130 కోట్లకు రూ. 48 కోట్లు మాత్రమే రెవెన్యూ విభాగం పన్నులు వసూలు చేసింది. మిగిలిన రెండు నెలల్లో రూ.81 కోట్ల వసూలు సాధ్యమేనా!? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. పది నెలల కాల వ్యవధిలో 37 శాతం మాత్రమే పన్ను వసూలు చేసిన ఆర్‌ఐలు రెండు నెలల్లో ఏకంగా 62 శాతం పన్నులు ఖజానాకు జమ చేయగలరా!? అన్నది చర్చనీయాంశంగా మారింది. కార్పొరేషన్‌కు ఆదాయం తెచ్చిపెట్టే రెవెన్యూ విభాగం పనితీరు సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

● నీటి పన్ను 12 శాతంతో సరి

కొళాయిలు, అపార్టుమెంట్ల వద్ద మీటర్లు ఇతర మార్గాల ద్వారా కార్పొరేషన్‌కు రూ.55.72 కోట్ల ఆదాయం రావాల్సి ఉంది. కానీ కేవలం రూ. 5.55 కోట్లు (12శాతం) వసూలు చేసి చేతులు దులుపుకున్నారు. రెండు నెలల్లో ముగియనున్న ఆర్థిక సంవత్సరానికి మిగిలిన రూ.50.17 కోట్ల వసూలలు సాధ్యమేనా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఎస్‌ఎంసీకి ఆదాయం తెచ్చిపెట్టే మార్గాలు ఉన్నా వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారంటూ పాలన యంత్రాంగంపై విమర్శలు ఉన్నాయి. అటు మంత్రి నారాయణ, ఇటు కమిషనర్ సూర్యతేజ నిర్వహించే సమీక్షలు ఆచరణకు నోచుకోవడం లేదన్న వాదన వ్యక్తమవుతోంది.



● వ్యక్తిగత ఆదాయంపైనే..

చెంబు అమ్మి ముంతకొనుకున్న సామెతగా తయారైంది రెవెన్యూ విభాగం పరిస్థితి. గతంలో పాత ఆర్‌ఐలు రోజుకు రూ.30-50 లక్షల వరకు రెవెన్యూ వసూళ్లను ఖజానాకు జమ చేస్తుంటే వాళ్లంతా పాతుకుపోయారన్న సాకుతో ఉన్నతాధికారులు కొత్తవారికి బాధ్యతలు అప్పగించారు. వీరు రోజుకు కనీసం రూ. 10 లక్షలు కూడా పన్ను వసూళ్లు చూపలేకపోవడం గమనార్హం. పైగా కొత్త అసెస్‌మెంట్లపైనే ధ్యాసంతా పెట్టడం విశేషం. వ్యక్తిగత ఆదాయాన్ని తెచ్చిపెట్టే కొత్త పన్నుల విధింపుపై మొగ్గు చూపుతున్న కొత్త ఆర్‌ఐలు పేర్ల మార్పిడి, పన్ను హెచ్చు, తగ్గులపై మాత్రమే శ్రద్ధ వహిస్తున్నారు. మొండి బకాయిల వైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)



డీఆర్‌వో సమక్షంలో వాకాటిని చైర్మన్‌గా ప్రతిపాదనలు చేస్తున్న సభ్యులు

రెడ్‌క్రాస్ చైర్మన్‌గా విజయకుమార్

నెల్లూరు (వైద్యం) జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ పాలకవర్గ చైర్మన్‌గా వాకాటి విజయ కుమార్‌రెడ్డి ఎన్నికయ్యారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఉదయ భాస్కర్‌రావు సమక్షంలో ఏకగ్రీవంగా ఈ ఎన్నిక జరిగింది. అలాగే వైస్ చైర్మన్‌గా చామర్తి జనార్ధన్‌రాజు, కోశాధికారిగా సురేష్ కుమార్ జైన్ ఎన్నికయ్యారు. తొలుత రెడ్‌క్రాస్ పాలకవర్గ సభ్యుడు గునుపాటి ప్రసాద్‌రెడ్డి వాకాటి విజయ కుమార్‌రెడ్డిని చైర్మన్‌గా ప్రతిపాదించారు. ఇందుకు సభ్యులంతా ఏకగ్రీవంగా

- మిగతా 6లో..

అన్ ఎయిడెడ్ సిబ్బందికి

న్యాయం జరిగేనా?

వైసీపీ ప్రభుత్వంలో ఎయిడెడ్ స్కూళ్ల విలీనం

ఎయిడెడ్ స్కూళ్లలో పనిచేసిన టీచింగ్ స్టాఫ్ పరిస్థితి ప్రశ్నార్ధకంగా మారింది. ఏళ్ల తరబడి అన్‌ఎయిడెడ్, పార్ట్‌టైమ్ టీచింగ్‌లో సేవలందించిన సిబ్బంది ప్రస్తుతం ఉద్యోగాలు లేక, వయసు మీరి పోవడంతో ఎక్కడా చేరలేక అవస్థలు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యావిధానంలో ఎయిడెడ్ పాఠశాలలను ఆస్తులతో సహా పాఠశాలలను నాటి ప్రభుత్వంలో విలీనం చేశారు. 2004 నుంచి 2017 వరకు రిక్రూట్‌మెంట్‌పై నిషేధం ఉండడం, రెగ్యులర్ టీచర్లు రిటైర్డ్ కావడంతో ఈ పాఠశాలల్లో మంజూరు పోస్టుల్లో పనిచేసేందుకు విధుల్లో చేరిన పార్ట్‌టైమ్, అన్‌ఎయిడెడ్ టీచింగ్ సిబ్బంది నేడు ఏ ఉద్యోగాలు లేక అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి) : ఎయిడెడ్ పాఠశాలల్లో టెట్ క్వాలిఫై అయిన నిరుద్యోగులు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఐదేళ్ల నుంచి 30 ఏళ్లుగా పనిచేస్తున్న సిబ్బందిని నాటి కరస్పాండెంట్‌లు వారి విద్యార్హతలను, నైపుణ్యాలను పరిశీలించి నియామకాలు చేపట్టారు. నాటి నుంచి వీరంతా ఎయిడెడ్ పాఠశాలల అభివృద్ధికి, విద్యాబోధన అందించడంలోనూ, విద్యార్థుల సంఖ్యను పెంచడంలోనూ ఎంతో కృషి చేశారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వంలో విలీనం చేసేందుకు యాజమాన్యాలు ఆమోదం తెలిపాయి. అదే క్రమంలో ఈ పాఠశాలల్లో పనిచేస్తున్న అన్ ఎయిడెడ్, పార్ట్‌టైమ్ టీచర్స్ గురించి కూడా యాజమాన్యాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాయి. ఇందులో భాగంగా గత ప్రభుత్వం ఏ యాజమాన్యాలు అయితే ఆస్తులతోసహ ప్రభుత్వానికి ఎయిడెడ్ పాఠశాలలను అప్పగిస్తారో అందులో పనిచేసే సిబ్బందికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారు. అయితే గత ప్రభుత్వం అన్‌ఎయిడెడ్ టీచర్స్ గురించి పట్టించుకోకుండా కంటితుడుపు చర్యగా వారి వివరాలను మాత్రం సేకరించారు. వీరికి ఎక్కడ ఉద్యోగాలు ఇవ్వాలి, ఎలా ఇవ్వాలన్న దానిపై స్పష్టత లేకపోవడం, అవగాహన రాహిత్యం కారణంగా వీరంతా రోడ్డున పడ్డారు. ఎప్పటి నుంచో ఎయిడెడ్ స్కూల్స్‌ను నమ్ముకుని జీవిస్తున్న ఈ సిబ్బందిని మాత్రం పక్కన పెట్టేశారు. అయితే వీరు పనిచేసిన పాఠశాలల్లో మాత్రం ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే టీచర్లను, సర్‌ప్లస్ ఎయిడెడ్ టీచర్లను నియమించి ఈ పాఠశాలలను ప్రభుత్వ పాఠశాలలుగా మార్పు చేశారు. జీవో నెం.50లో మాత్రం మార్పు చేసే పాఠశాలల్లో అన్ ఎయిడెడ్, పార్ట్‌టైమ్ సిబ్బందిని కూడా పరిగణలోకి తీసుకోవాలని, నియామకాలు చేపట్టాలని స్పష్టంగా ఉన్నా నాటి ప్రభుత్వం వీరిని పట్టించుకోకపోవ డంతో వీరి భవిష్యత్ నేడు ప్రశ్నార్ధకంగా మారింది. నెల్లూరుతోపాటు రాష్ట్రంలోని రాజమహేంద్రవరం, కర్నూలు జిల్లాల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోందని, ఉన్నత విద్యలో నాలుగు డిగ్రీ కళాశాలలు ప్రభుత్వంలోకి విలీనం చేసినా అందులో పనిచేస్తున్న అన్‌ఎయిడెడ్, పార్ట్‌టైమ్ సిబ్బందికి మాత్రం అవుట్ సోర్సింగ్, గెస్ట్, కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు ఇస్తూ జీవో విడుదల చేశారు. మూడేళ్లుగా తాము అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

● న్యాయం జరిగేనా?

సుదీర్ఘకాలంగా ఎయిడెడ్ పాఠశాలల్లో సేవలందించిన అన్‌ఎయిడెడ్, పార్ట్‌టైమ్ సిబ్బందికి న్యాయం చేయాలని సిబ్బంది కోరుతున్నారు. న్యాయపరంగా తమకు రావాల్సిన ఉద్యోగం గురించి ప్రభుత్వానికి, అధికారులకు విన్నవించినా తమ గోడు పట్టించుకోవడం లేదని కన్నీటి పర్యంతమవుతున్నారు. కొన్ని ఎయిడెడ్ స్కూల్స్ మాత్రం ప్రభుత్వానికి అప్పగించకుండా వారే నిర్వహిస్తుండగా ఆ పాఠశాలల్లో ప్రస్తుతం రిక్రూట్‌మెంట్లు చేపడుతున్నారని తెలిపారు.



సపోర్టు ఉన్నా ఒరిగిపోయింది!

పెంట్రాల పంచాయతీ పరిధిలోని చీమలపెంట బ్రాంచి కాలువ ఎదురు గా ఉన్న పొలం గట్టుపై విద్యుత్ స్తంభం ఒరిగి ప్రమాదకరంగా ఉంది. వీటిని ఈ మధ్యకాలంలో ఏర్పాటు చేశారని అయినా ఈ సమస్య నెల కొందని రైతులు, రోడ్డున వెళ్లే ప్రయాణికులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో ఏడెనిమిది విద్యుత్ స్తంభా లు ఇలాగే ఉన్నాయని పొలాలకు వెళ్లే రైతులు భయాందోళన చెందుతున్నారు. వీటిలో కొన్ని స్తంభాలకు 33/11కేవీ హైటెన్షన్ విద్యుత్ తీగలు ఉన్నాయని చెబుతున్నారు.

- లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి)

క్విజ్ పోటీల విజేత కేవీ



నెల్లూరు(విద్య), జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 'భారత్ హై హమ్' ధారావాహిక నుంచి సూచించిన అంశాలతో నగరం లోని కొత్తూరులోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాల యం(కేవీ)లో గురువారం జరిగిన క్విజ్ పోటీల్లో పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం విజేతగా నిలిచింది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి వందమందికిపైగా ఈ పోటీల్లో పాల్గొనగా కేవీకి చెందిన సాన్విఅనిల్ ప్రథమ స్థానం, జవహర్ నవోదయ విద్యాలయానికి చెందిన విక్రమ్‌రెడ్డి ద్వితీయ స్థానం, కేవీకి చెంది న మహ్మద్ ఒమ ర్ తృతీయ స్థానం దక్కించుకున్నారు. విజేతలకు కృష్ణపట్నం పోర్టు కస్టమ్స్ అధికారి క్రిష్ణేంతు రాజమింటూ బహుమతులు అందచేశా రు. కార్యక్రమంలో కేవీ ప్రిన్సిపాల్ కే శంకరయ్య, సీసీఏ కో ఆర్డినేటర్ అలివేలు మంగా బాయి, హెచ్ ఎం టీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పారేసిన దస్త్రాలకు పరిష్కారమేది!?

బుచ్చి తహసీల్దారు కార్యాలయం వరండాలో ఏడాదికిపైగా దర్శనమిస్తున్న ఇవన్నీ జగనన్న సురక్ష దస్త్రాలే. జగన్ ప్రభుత్వ హయాంలో అర్హులంతా ఉచితంగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందారు. ఆ వెంటనే ప్రభుత్వం జగనన్న సురక్ష ప్రవేశపెట్టింది. ఆ పథకానికి జనాదరణ కరువైంది.దీంతో రెవెన్యూ అధికారులే సర్టిఫికెట్లు తీసుకున్నామని చెప్పినా, ఏ ఒక్కరిని వదలకుండా వలంటీర్లు కుటుంబంలోని అందరి వివరాల సేకరించారు. ఇలా బుచ్చి నగర పంచాయతీతోపాటు మండలంలో 12వేలకు పైచిలుకు కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేసినట్టు లెక్కలు రాసుకుని రికార్డు సృష్టించారు. ఆ పథకం పాపమే తహసీల్దారు కార్యాలయంలో నేటికీ ఇలా దస్త్రాలు దర్శనమిస్తున్నాయి. వీటిని తొలగించే నాథుడే కరువయ్యాడు.

- బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి)





స్వప్న యోగం

ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప సంపద యోగా. దానిని జీవన విధానంగా మార్చుకున్నారు డాక్టర్ స్వప్న. యోగాలో అద్భుతాలను సృష్టిస్తూ జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందడమేకాక డాక్టరేట్ సాధించారు. గృహిణిగా ఇంటి బాధ్యతలు నిర్వర్తిస్తూనే యోగా గురువుగా రాణిస్తున్నారు. ఆధునిక సమాజానికి తగ్గట్లు యోగాలో టెక్నాలజీని మిళితం చేసి యువతకు తర్ఫీదునిస్తున్నారు. నేటితరం విద్యార్థులు, ఉద్యోగులు ఒత్తిళ్లను అధిగమించి, ఆరోగ్యాన్ని కాపాడుకోవడమెలాగో యోగాతో నేర్పుతున్నారు. యోగా గొప్పదనాన్ని ప్రపంచానికి చాటిచెప్పడమే ధ్యేయంగా కృషి చేస్తున్నారు. భారతీయ సాంస్కృతిక సంబంధాల మండలి (ఐసీసీఆర్) ద్వారా అంతర్జాతీయంగా యోగా తత్వశాస్త్రాన్ని ప్రచారం చేస్తున్నారు. తల్లిగా, గృహిణిగా కుటుంబానికి ప్రాధాన్యతనిస్తూనే యోగా విద్యావేత్తగా ఎదిగిన ఆమె మహిళా లోకానికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

- యోగాలో అద్వితీయ ప్రతిభ
- భారతీయ ప్రాచీన విద్యలో డాక్టరేట్
- సామాజిక మాధ్యమాలతో యోగా థెరపీ
- ఎంతో మందికి బోధన
- కేంద్ర ప్రభుత్వ గుర్తింపు
- అంతర్జాతీయ స్థాయిలో ప్రచారానికి సిద్ధం



యోగాలో డాక్టరేట్ అందుకుంటున్న స్వప్న



సినీ నటి రేణూదేశాయ్ నుంచి ఉత్తమ యోగా ఉపాధ్యాయిని అవార్డు అందుకుంటూ...

నెల్లూరు(విద్య), జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరుకు చెందిన డాక్టర్ జేకే స్వప్న యోగా ప్రస్థానం ఒనమాలతో ప్రారంభమై డాక్ట రేట్ వరకు సాగింది. నగరంలోని చిన్నబజారు ప్రాంతానికి చెందిన ఆమెకు ఇంటర్ తర్వాత కుటుంబ సభ్యులు వివాహం చేశారు. ఆ తర్వాత ఇద్దరు పిల్లల తల్లిగా ఉంటూనే కుటుంబ సభ్యుల సహకారంతో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఆమె ప్రతిభను గుర్తించిన కళాశాల యాజమాన్యం అదే కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగావకాశాన్ని కల్పించారు.

మూడేళ్లు బోధనా రంగంలో సేవలందించిన స్వప్న, ఆ తర్వాత మద్రాస్ ఐఐటీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో ఎంటెక్ పూర్తి చేశారు. అనంతరం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేశారు. 2010లో యోగాపై దృష్టి సారించారు. క్రమంగా అందులో నైపుణ్యాన్ని పెంపొందించుకుని ఉత్తమ ఉద్యోగినిగా, ప్రపంచ యంగ్ యోగా ఇన్‌స్ట్రక్టర్‌గా గుర్తింపు పొందారు.

యోగాలో తనకున్న 16 ఏళ్ల అనుభవంతో యోగా థెరపీలో ప్రావీణ్యం పొందిన స్వప్న అనేక మంది జీవితాలను మారుస్తున్నారు. ఆమె నిర్వహించే యోగాలయం యూట్యూబ్ చానెల్ ద్వారా వందకుపైగా వ్యాధుల కోసం యోగా థెరపీలను అందిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఆమెకున్న అనుభవాన్ని దృష్టిలోపెట్టుకుని కార్పొరేట్ ఉద్యోగుల మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా ద్వారా కృషి చేస్తున్నారు. అలాగే, చిన్ననాటి విద్యలో యోగ తత్వాన్ని, రామాయణం, మహాభారతం, పంచతంత్ర వంటి పురాణ కథలతో సమన్వయం చేసే పరిశోధన చేస్తున్నారు. మినిస్ట్రీ ఆఫ్ ఆయుష్ యోగా సర్టిఫికేషన్ బోర్డు ద్వారా యోగా పరీక్షకురాలిగా ఎంపికైన డాక్టర్ స్వప్న యోగా విద్యలో నాణ్యతా ప్రమాణాలను నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎన్నో విశ్వవిద్యాలయాలు, ప్రఖ్యాత సంస్థల్లో ప్రత్యేక శిక్షణ శిబిరాలను నిర్వహించారు. తాను నేర్చుకున్న యోగాను అందరికీ పంచాలన్న లక్ష్యంతో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం సహా పలు మెడికల్, ఇంజనీరింగ్ కళాశాల ల్లో యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. అంతేకాదు, అంతర్జాతీయ వేదికపై భారతీయ యోగాను ప్రచారం చేయడానికి సిద్ధమవుతున్నారు.

ఆరోగ్య జీవనానికి యోగాతో కృషి

బహుముఖ ప్రజ్ఞ

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం నుంచి కంప్యూటర్ సైన్స్‌లో డాక్టరేట్ సాధించారు స్వప్న. భారతీయ తత్వశాస్త్రంలో డిప్లమో, తమిళనాడు అన్నామలై యూనివర్సిటీ నుంచి యోగాలో ఎమ్మె స్సీ, తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యా లయం నుంచి యోగా పీజీ డిప్లమో కోర్సులను పూర్తి చేశారు. ప్రీనేటల్ యోగా, చైర్ యోగా వంటి ప్రత్యేకతలతో శిక్షణ పొందిన ఆమె యోగా అలయన్స్ యూఎస్ఏ ద్వారా గుర్తింపు పొందిన ఆర్‌వైటీ-500 (రిజిస్టర్ యోగా టీచర్)గా సేవలందిస్తున్నారు. తాజాగా ఇటీవల బెంగళూరుకు చెందిన ఎస్‌వైశ్య యూనివర్సిటీ నుంచి యోగాలో డాక్టరేట్ సాధించారు. హరిద్వార్‌లోని ఇండియన్ యోగా అసోసియేషన్ యోగా చికిత్స ఆచార్య బిరుదుతో ఆమెను సత్కరించింది.

యోగా ప్రతిష్ట పెంచడమే లక్ష్యం

యోగా ప్రతిష్టను, కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాను. లైఫ్‌స్టైల్ రుగ్మతలను యోగా చికిత్స ద్వారా తగ్గించేలా శిక్షణ ఇస్తున్నాను. ఆచార (ప్రవర్తన), విచార (ఆలోచనలు), ఆహార(ఆహారం), వ్యవహార(ప్రవర్తన) అనే నాలుగు స్తంభాలతో ఉన్న సమగ్ర దృక్పథాన్ని విశ్వసిస్తూ పనిచేస్తున్నాను. భారతీయ సాంస్కృతిక ఉపాధ్యాయురాలిగా ప్రభుత్వం ఎంపిక చేసింది. ప్రపంచంలో ఏదో ఒక దేశాన్ని కేటాయించి రెండేళ్లపాటు ఆ దేశంలో యోగాను అభివృద్ధి చేసేందుకు కృషి చేసేలా అనుమతులిచ్చారు. ఆధునికతను అనుసరిస్తూనే సంప్రదాయాలను గౌరవించేలా ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనం కొనసాగించాలన్నదే నా ధ్యేయం.

- డాక్టర్ జేకే స్వప్న



పూణే కైవల్యధామ యోగా ఇనిస్టిట్యూట్‌లో ఉత్తమ యోగా థెరఫిస్ట్ అవార్డు అందుకుంటూ..

కష్టకాలంలో పార్టీకి అండగా లోకేష్

- యువగళంతో ప్రజల్లో విశ్వాసాన్ని నింపారు
- టీడీపీ నేతలు సోమిరెడ్డి, అజీజ్, కోటంరెడ్డి
- టీడీపీ కార్యాలయంలో అట్టహాసంగా కేక్ కటింగ్

నెల్లూరు (వైద్యం), జనవరి 23 (ఆంధ్ర జ్యోతి) : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ కష్టకాలంలో పార్టీని అండగా నిలిచారని టీడీపీ నాయకులు వెల్లడించారు. గురువారం టీడీపీ జిల్లా కార్యాలయంలో లోకేష్ జన్మదిన వేడుకలు అట్టహాసంగా జరిగాయి. కేక్ కట్ చేసి నేతలకు తినిపించారు. బాణాసంచా కాల్చి నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ నారా లోకేష్ యువగళం పేరుతో గత ఎన్నికలలో పార్టీలో నూతన ఉత్తేజాన్ని రేకెత్తించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన విద్యావ్యవస్థను గాడిలో పెట్టారని కొనియాడారు. వారసత్వం పేరుతో వ్యవస్థలను తప్పుదోవ పట్టించకుండా ఒక సిస్టంతో ముందుకు వెళుతున్నారని చెప్పారు. రెడ్‌బుక్ తెరచి తప్పు చేసిన వారికి గుణపాఠం చెప్పవలసిందేనని అన్నారు. ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ రాష్ట్రానికి అమూల్య నాయకుడిలా లోకేష్ మారబోతున్నారని వెల్లడించారు. ఒక అనుభవమైన లెజెండ్ లీడర్ నాయకత్వంలో లోకేష్ పనిచేస్తున్నారని తెలిపారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నారా లోకేష్‌ను హోప్ ఆఫ్ ది ఆంధ్రప్రదేశ్‌గా ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల గుండెల్లో లోకేష్ చిరస్థాయిగా నిలుస్తారం టూ అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత లు కంభం విజయరామి రెడ్డి, చేజెర్ల వెంకటే శ్వరెడ్డి, జెడ్ శివప్ర సాద్ తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్ అజీజ్‌కేక్ తినిపిస్తున్న సోమిరెడ్డి, పక్కన కోటంరెడ్డి తదితరులు

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యం

- 'ఉల్లాస్'పై శిక్షణలో డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

నెల్లూరు (హరనాథపురం) జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడమే ఉల్లాస్ కార్యక్రమ ఉద్దేశమని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఉల్లాస్ కార్యక్రమం అమలుపై ఎంపీడీవోలు, డీఆర్‌డీఏ ఏపీఎంలకు, వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ జిల్లాలోని పొదుపు సంఘాల్లో నిరక్షరాస్యులను గుర్తించి, వారికి అక్షర జ్ఞానం కల్పించేందుకే ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో అభ్యాసకులంతా కేంద్రాలకు వచ్చి అక్షరాలు నేర్చుకునేలా చూడాలని డీఆర్‌డీఏ సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీవోలు ఈ కార్యక్రమ పురోగతిని పరిశీలించాలన్నారు. వయోజనవిద్య డిప్యూటీ డైరెక్టర్ ఎస్.మహమ్మద్ ఆజాద్ మాట్లాడుతూ జిల్లాలో పొదుపు సంఘాల్లోని 19,178 మంది నిరక్షరాస్యులను గుర్తించి, వారికి ప్రత్యేకంగా రూపొందించిన పాఠ్యపుస్తకాలు, వీడియో పాఠాల ఆధారంగా అక్షరజ్ఞానం కల్పించనున్నట్లు చెప్పారు. అనంతరం వయోజనవిద్యకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శిక్షకులు శైలజ, మస్తాన్‌రెడ్డి, నారాయణరావు, రాజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

1 నుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు

నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి): సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్య దర్శి వీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రజా నాట్య మండ లి రూపొందించి సీడీని గురువారం ఆయన నెల్లూరు లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల తర్వాత నెల్లూరులో రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని చెప్పారు. నగరంలోని అనిల్ గార్డెన్స్‌లో ఫిబ్రవరి 1,2,3వ తేదీల్లో ఈ సభలు జరుగుతాయన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి పార్టీ నేతలు పాల్గొంటారని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నాయకులు చంద్రా రాజగోపాల్, మంగళం పుల్లయ్య, ప్రసాద్, రెహనా బేగం, మోహన్‌రావ్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మహా సభల సీడీని ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు

ఆ అధికారం స్థానిక సంస్థలదే!

(5వ పేజీ తరువాయి)

మున్సిపాలిటీలకు బదలాయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నూతన విధివిధానాలు ఇవే..

- ఇప్పటివరకూ కొన్ని రకాల భవనాలకు మాత్రమే మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ, పంచాయతీల పరిధిలో అనుమతులు జారీ చేసే అధికారం ఉండేది. 500 చదరపు మీటర్లు దాటిన భవనాలకు నుడా నుంచి అనుమతులు తెచ్చుకోవాలి. ఇకపై అన్ని రకాల భవనాలకు, 500 చదరపు అడుగుల విస్తీర్ణానికి మించినవి కూడా నుడా పరిధిలోకి రావు. వీటన్నిటికీ కార్పొరేషన్ లేదా ఆయా మున్సిపాలిటీలే అనుమతులు జారీ చేస్తాయి. నగర పంచాయతీల్లో మాత్రం గ్రూప్ డెవలప్‌మెంట్ పథకం కింద నిర్మించే ఇళ్లు, హైరైస్ బిల్డింగ్‌లు మినహాయించి మిగిలిన అన్ని భవనాలకు అనుమతులు మంజూరు చేసే అధికారం ఇచ్చారు. ఈ రెండు కేటగిరీలకు మాత్రం డీటీసీపీ అనుమతులు ఇస్తుంది. ఇక పంచాయతీలకు 300 చదరపు అడుగులు లేదా పది మీటర్ల ఎత్తు భవనాల వరకూ అనుమతులు ఇచ్చే అధికారం కల్పించారు. అంతకుమించితే నుడా పరిధిలోకి వస్తుంది.
- అర్బన్ డెవలప్‌మెంట్ చట్టం ప్రకారం అన్ని రకాల లేఅవుట్లకు ఇప్పటివరకూ నుడా అనుమతులు మంజూరు చేస్తూ ఉండేది. ఇకపై నెల్లూరు కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో వేసే లేఅవుట్లకు ఆయా స్థానిక సంస్థలే అనుమతులు ఇస్తాయి. నగర పంచాయతీల పరిధిలో మూడు ఎకరాల్లోపు వేసే లేఅవుట్లకు అక్కడే అనుమతులు మంజూరు చేస్తారు. అంతకుమించితే డీటీసీపీ దగ్గర అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. పంచాయతీల్లో వేసే లేఅవుట్లు మాత్రం నుడా పరిధిలోనే ఉంటాయి. అదేవిధంగా అప్రూవ్డ్ లేఅవుట్లలోని ప్లాట్లను సబ్ డివిజన్ చేసే బాధ్యత కూడా ఆయా కార్పొరేషన్, మున్సిపాలిటీలకే అప్పగించారు.
- అనధికార లేఅవుట్లు, భవనాలపై పర్యవేక్షణ బాధ్యతలను కూడా మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు, నగర పంచాచయతీలకు అప్పగించారు. అక్రమంగా లేఅవుట్లు వేసినా, అనుమతులకు విరుద్ధంగా భవనాలు నిర్మించినా వాటిని ఎప్పటికప్పుడు తనఖీ చేస్తూ నోటీసులిచ్చే అధికారం వాటికి కల్పించారు. ఇప్పటి వరకూ లేఅవుట్లు, పెద్ద భవనాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారం నుడాకు ఉండేది.

ఉత్తర్వులు అందాయి

లేఅవుట్లు, భవనాలకు అన్ని రకాల అనుమతులను మున్సిపాలిటీ ఇచ్చే విధంగా ఉత్తర్వులు వచ్చాయి. అయితే ఆన్‌లైన్‌లో దానికి సంబంధించి ఇంకా మార్పులు చేయలేదు. అది చేయగానే మేమే అనుమతులు మంజూరు చేస్తాం.

- జీ శ్రావణ్‌కుమార్, కావలి కమిషనర్

రెడ్‌క్రాస్ చైర్మన్‌గా విజయకుమార్ ఎన్నిక

(5వ పేజీ తరువాయి)

అంగీకారం తెలపడంతో ఆయన ఎన్నికయినట్లు డీఆర్వో ప్రకటించారు. మొత్తం 15 మంది ఉన్న సభ్యుల్లో ఐదుగురిని కలెక్టర్ ఆనంద్ తొలగించడంతో మిగిలిన 10 మంది సభ్యులు చైర్మన్‌ను ఎన్నుకోవాల్సి ఉంది. అయితే సభ్యుడు సురేష్‌కుమార్ జైన్ అందుబాటులో లేకపోవడంతో 9 మంది సభ్యులు మాత్రమే పాల్గొన్నారు. కలెక్టర్ ఆనంద్ నూతన చైర్మన్ ఎన్నికయినట్లు ప్రకటన కూడా విడుదల చేయటంతో రెడ్‌క్రాస్ కార్యాలయంలో సంబరాలు జరిగాయి.

● సభ్యుల తొలగింపుపై హైకోర్టు స్టే

రెడ్‌క్రాస్‌లో ఐదుగురు సభ్యుల తొలగింపుపై గురువారం హైకోర్టు స్టే విధించింది. మాజీ చైర్మన్ పర్వతరెడ్డి పెంచలరెడ్డితోపాటు మలిరెడ్డి కోటారెడ్డి, నేతాజి సుబ్బారెడ్డి, దామిశెట్టి సుధీర్‌నాయుడు, గంధం ప్రసన్నాంజనేయులను పాలకవర్గం నుంచి కలెక్టర్ ఆనంద్ ఇటీవల తొలగించారు. వీరంతా హైకోర్టును ఆశ్రయించడంతో మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు జారీ చేసింది. రెడ్‌క్రాస్ ప్రాథమిక సభ్యత్వంతోపాటు సభ్యులుగా కొనసాగించాలని ఆ ఉత్తర్వులలో పేర్కొంది. అయితే నూతన చైర్మన్ ఎన్నిక ఆపాలని హైకోర్టును కోరగా ఇందుకు 14 రోజుల తర్వాత కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు తెలియచేసింది.

బాలికల విద్య.. భద్రతపై ప్రత్యేక శ్రద్ధ

- తల్లికి వందనం మే నుంచి అమలు
- ఎమ్మెల్యేతో కలిసి పెదపవని బాలికల గురుకులం తనిఖీ
- రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి బాల వీరాంజనేయస్వామి

లింగసముద్రం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బాలికల విద్య, భద్రత, ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. గురువారం మంత్రి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి పెదపవని బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి కొందరు విద్యార్థినులతో సౌకర్యాల గురించి ఆరా తీశారు. సమస్యలుంటే తన దృష్టికి తేవాలన్నారు. అనంతరం బాత్‌రూంలు, మరుగుదొడ్లు పరిశీలించి ప్రిన్సిపాల్ స్నేహలతపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఉండే డార్మిటరీని, డైనింగ్ హాలును పరిశీలించి 10వ తరగతి, ఇంటర్ విద్యార్థినులతో మాట్లాడి కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు.

● పేద పిల్లలు.. గొప్పగా ఎదగాలి

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. పేద పిల్లలు సమాజంలో గొప్పగా ఎదగాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి లక్ష్యమన్నారు. బాలిక అంటే వధువు కాదని చదువని చెప్పారు. తల్లికి వందనం ఈ ఏడాది మే నుంచి అమలు చేస్తామన్నారు. గురుకులాల్లో డిగ్రీ కోర్సుతో పాటు టెక్నికల్ కోర్సులు తీసుకొస్తామన్నారు. అనంతరం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడారు. పాఠశాలను ఇంత పెద్ద విస్తీర్ణంలో పాఠశాలను నడపడంపై అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దారు సీతామహాలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసులు, సీఐ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ స్నేహలత, టెలికం అడ్వయిజరీ బోర్డు డైరెక్టర్ మాల్యాద్రి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు సాంబయ్య, మాజీ సర్పంచు నాయబ్‌రసూల్, సోంపల్లి మనోహర్, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి బాల వీరాంజనేయ స్వామి, పక్కన ఎమ్మెల్యే ఇంటూరి తదితరులు

వేళకు రాని ఆర్టీసీ బస్సులు

- 2కిలోమీటర్ల దూరంలో మోడల్ స్కూల్
- కొండాపురం, కావలి మార్గాల విద్యార్థులకు తప్పని తిప్పలు
- ఇళ్లకు వెళ్లేటపుడు ప్రమాదకర ప్రయాణం

కలిగిరి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని ఏపీ మోడల్‌స్కూల్, జడ్పీ హైస్కూల్‌కు వెళ్లే విద్యార్థుల సంఖ్య 1,005 మంది. ఏపీ మోడల్ స్కూల్ పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ పాఠశాలలకు కలిగిరి మండలం నుండే కాకుండా ఏఎస్ పేట, కొండాపురం మండలాల గ్రామాల నుండి బస్సులు, ఆటోల్లో రావాల్సి ఉంది. దూరప్రాంత విద్యార్థులు పాఠశాలలకు రావాలన్నా.. పాఠశాల నుండి ఇంటికి చేరుకోవాలన్నా ఆర్టీసీ బస్సులో తప్పనిసరి అయ్యింది. అయితే కావలి, కొండాపురం మార్గాల్లో విద్యార్థులు కలిగిరి తహసీల్దారు కార్యాలయం వరకు మాత్రమే వస్తారు. అక్కడనుండి పాఠశాలకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం వేళలో రావడానికి కొంతమేర అవకాశం ఉన్నా, సాయంత్రం వేళలో ఇంటికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడతారు. ఈ మార్గంలో నెల్లూరు నుంచి పామూరు వెళ్లే బస్సులు తిరుతుంటాయి. పాఠశాలకు రావడానికి ప్రత్యేక బస్సు లేకపోవడం, ఉదయం, సాయంత్రం వేళలో బస్సులు రద్దీగా ఉండటం, కొన్నిబస్సులు ఆపకపోవడంతో వేళకు ఇళ్లకు చేరుకోలేక పోతున్నారు.

రెండు బస్సులు మారాలి..

ఏపీ మోడల్‌స్కూల్‌కి వచ్చే విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. హసనాపురం, వింజమూరు మార్గాల నుండి వచ్చే విద్యార్థులకు పామూరు బస్సుల్లో నేరుగా వచ్చే అవకాశం ఉంది. కొండాపురం, కావలి మార్గాల నుండి వచ్చే విద్యార్థులు రెండు బస్సులు మారాల్సి వస్తుంది. బస్సు సిబ్బంది దయా దాక్షిణ్యాలమీద ఆధారపడి విద్యార్థులు ప్రయాణం చేస్తున్నారు. విద్యార్థులను పరిమిత సంఖ్యలో ఎక్కాలని కోరుతున్నా బస్సు సిబ్బంది మాటలను విద్యార్థులు లెక్క చేయకుండా ఇంటికి చేరుకోవాలనే నెపంతో వేలాడుతూ ప్రమాద కరంగా ప్రయాణిస్తున్నారు. అవసరమైన సమయంలో తగినన్ని బస్సులు లేక పోవడం, వచ్చిన



ఆర్టీసీబస్సు ఎక్కుతున్న విద్యార్థులు

ఒక్క బస్సులో వీపుకి బ్యాగులు తగిలించుకొని ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రయాణం చేస్తుంటారు. ఈ దృశ్యాలను చూసిన ప్రయాణికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురిఅవుతున్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

సంగం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమనతిప్పకు చెందిన ఓ బాలిక ఈనెల 19వ తేదిన ఇంట్లో అలిగి వెళ్లింది. అప్పటి నుంచి బాలిక తల్లిదండ్రులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో గాలించినా కనిపించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జడ్పీటీసీ ఆగ్రహం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్) (ఆంధ్రజ్యోతి):మూడు నెలలకు ఒకసారి జరిగే కీలక సమావేశానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు డుమ్మా కొట్టడంపై జడ్పీటీసీ సభ్యులు రావిళ్ల నాగేంద్ర, వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల కార్యాలయంలో ఎంపీపీ వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వెల్ఫేర్, అటవీ అధికారులు గైర్హాజరయ్యారు.

న్యూస్ బాక్స్

ఉచిత పశువైద్య శిబిరం

కందుకూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మోపాడు, నరిశెట్టివారిపాలెంలో మండల పశువైద్యాధికారి ఎస్.సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. గేదెలు, దూడలకు డీవార్మింగ్ సిబ్బంది మందులు తాగించటంతో పాటు గర్భకోశవ్యాధులున్న పశువులు, ఎదకు రాని వాటిని పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యశాల సహాయ సంచాలకులు చంద్ర మోహన్ పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్‌కు నాలుగు అర్జీలు

అల్లూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమానికి నాలుగు అర్జీలు మాత్రమే వచ్చాయి. ఈ సమస్యలను ఉన్నతాధికారులు పరిశీలించి అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి, జీఎం రామ్‌మోహన్‌రావు, నెల్లూరు ఎస్ఏవో మురళి, ఈఈ ఎస్.బెనర్జీ, డిప్యూటీ ఈఈ ఎం.రవిచంద్ర, ఏఈ మస్తాన్ షరీఫ్ పాల్గొన్నారు.

డీఎల్పీవో విచారణ

బిట్రగుంట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ కార్యాలయంలో ఐదు నెలల క్రితం మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో పెట్టిన విషయంపై డీఎల్పీవో రాధా మాధవీలత గురువారం విచారణ చేపట్టారు. సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి వచ్చిన లేఖపై టీడీపీ, జనసేన నాయకులతో బహిరంగ విచారణ చేపట్టారు. ఈ విషయమై టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, బోగోలు ఇన్‌చార్జి ముంతాల వెంకయ్యలను విచారించారు. ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వీడాలి

దగదర్తి, (బిట్రగుంట) జనవరి 23 (ఆంధ్రజ్యోతి):ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యంను వీడాలని నెల్లూరు నారాయణ హాస్పిటల్ వైద్యులు లహరి రెడ్డి తెలిపారు. ప్రిన్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు శీరామాపురం సాయిబాబా మందిర ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 152మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న 40మందినిగుర్తించి ఉచిత ఆపరేషన్‌కు రెఫర్ చేశారు. కార్యక్రమంలో సర్పంచు నాగమణి, సుమ, అసోసియేషన్ అధ్యక్షుడు ఇండ్ల కృష్ణయ్య, మల్లికార్జునరెడ్డి, కృష్ణారెడ్డి, వీఆర్వో నాగరాజు, కార్యదర్శి సునీత ఉన్నారు.

పశు వైద్య శిబిరం

కొండాపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భీమవరప్పాడులో గురువారం పశు వైద్య శాఖ అధికారులు గురువారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. శాయిపేట పశువైద్యుడు మధు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దూడలు, పెద్ద పశువులకు నట్టల నివారణ మందును తాపించారు. పశువులకు గర్భకోశ పరీక్షలు, వ్యాధి నివారణ ఇంజక్షన్లు వేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ ఉపసంచాలకులు శ్రీధర్‌రావు, టెక్నికల్ పశువైద్యులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

పారిశుధ్యానికి పెద్దపీట

సంగం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ పేరుతో గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఆత్మకూరు డీఎల్‌పీవో నారాయణ పేర్కొన్నారు. గురువారం ఆయన సంగం మేజర్ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఈవోఆర్డీ ప్రసాదు, పంచాయతీ సెక్రటరీ నరసయ్య పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్టు

బిట్రగుంట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తెల్లగుంట క్రాస్‌రోడ్డుపై సంపంగి వెంగయ్య అనే వ్యక్తి వద్ద దౌర్జన్యం చేసి రూ.5వేలతో పరారైన వ్యక్తిని గుర్తించి అరెస్టు చేసినట్లు ఎస్ఐ భోజ్యం గురువారం రాత్రి తెలిపారు. నెల 19న రాత్రి వెంగయ్య మద్యం సేవించి తిప్పసెంటర్‌లో ఉన్నాడు. ఈ సమయంలో తిప్ప గ్రామానికి చెందిన సముద్రాల క్రాంతి అక్కడకు వచ్చి బెదిరించి అతని వద్ద ఉన్న నగదును లాక్కెల్లాడు. బాధితుడి ఫిర్యాదు విచారణ చేపట్టగా విష యం వెలుగులోకి వచ్చిందన్నారు.

యువగళం పాదయాత్రతో ప్రజల్లో విశ్వాసం

- కావలి ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి
- ఘనంగా మంత్రి నారా లోకేష్ జన్మదినం
- కందుకూరు వేడుకల్లో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యే

కావలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): యువ నాయకుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రతో పార్టీపై ప్రజల్లో విశ్వాసం నింపాడని, ఆయన్ను బావి ముఖ్యమంత్రిగా చేసి.. పార్టీని బలోపేతం చేయాలని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకల ను పార్టీ నాయ కులు, కార్యకర్తలు పండుగలా నిర్వహించారు. పార్టీ కష్టకాలంలో అండగా నిలబడి మంత్రి లోకేష్ మంచిపేరు తెచ్చుకున్నారని కొనియాడారు. టీడీపీ సభ్యత్వాలు కోటికిపైన జరిగాయంటే అది లోకేష్ కృషి అని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, పోట్లూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

● బిట్రగుంట: స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకలో పార్టీ మండల కన్వీనర్ నాగేశ్వరావు కేక్ కట్ చేసి తమ నేతకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సుధీర్ బాబు, వెంకయ్య, వెంకటేశ్వరరెడ్డి, నాగరాజు, వేంకటేశ్వర రెడ్డి, సుబ్బారావు, రామోహన్‌రెడ్డి, రంగయ్య, ఫైడిహర్ష, అశోక్ నాయుడు ఉన్నారు.

● కొండాపురం: మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో నేతలు, కార్యకర్తలు కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పోలినేని రమేష్, చంద్రబాబునాయుడు, దాసరి అశోక్, వి.మణి పాల్గొన్నారు.

● కందుకూరు: రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఎమ్మెల్యే ఇంటూరితో కలిసి స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన వేడుకలో ఎమెల్యేతో కలిసి కేకు కట్ చేశారు. కుట్టుశిక్షణలోని మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. గత ఎన్నికల ముందు పాదయాత్రతో శ్రమించిన లోకేష్ బాబు కృషి మరువలేనిదన్నారు. అలాగే అన్న క్యాంటీన్‌లో జరిగిన కార్యక్రమంలో దామా మల్లేశ్వరరావు, వేముల గోపాలరావు, జనిగర్ల నాగ రాజు, మాదాల లక్ష్మీనరసింహ ఉన్నారు.

● ఆత్మకూరు: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలో నేతలు కేక్‌ను కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, తెలుగు యువత జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రా వెంకటసుబ్బానాయుడు, గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, సాగునీటి సంఘం చైర్మన్ మాదాల మస్తాన్‌నాయుడు పాల్గొన్నారు.

● సంగం: స్థానిక బంగ్లా ఆవరణలో టీడీపీ మండల పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండ లాధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీనివాసులురెడ్డి, సంగం పంపింగ్ స్కీమ్ అధ్యక్షుడు షేక్‌బాబు, హరిరెడ్డి పాల్గొన్నారు.

● అనంతసాగరం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో వేడుకలు నిర్వహించారు. అనంతరం బీసీ బాలుర వసతిగృహ విద్యార్థులకు ప్లేట్లు, గాస్లులు, ఉన్నత పాఠశాలలో ప్యాడ్‌లు అందజేశా రు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్తర కాలువ చైర్మన్ మెట్టుకూరు కృష్ణారెడ్డి, మునగపాటి సునీత, శాఖమూరి సుబ్బారావు, రాపూరు సుబ్బారెడ్డి, కమ్మ ప్రభాకర్ నాయుడు, చల్లా శివారెడ్డి, మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉదయగిరి: రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌బాబు యువగళం పాదయాత్ర చేపట్టి రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాడని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన వేడుకలో నాయకులతో కలిసి 43 కేజీల కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం వైద్యశాలలో రక్తదాన శిబిరాన్ని సందర్శించి అభినందించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బయ్యన్న, బొజ్జా నరసింహులు, కలివెల జ్యోతి, నల్లిపోగు నరసింహ, సందానీ, సజీల్, రెడ్డిబత్తిన వెంకటేశ్వర్లు, నరసింహ పాల్గొన్నారు.

●దుత్తలూరు: స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన వేడుకలో నేతలు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

● వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): అధికార పార్టీకి చెందిన ఇరువర్గీయులు పోటా పోటీగా వేడుకలు నిర్వహించారు. మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయ ప్రాంగణంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్, తెలుగు యువత అధ్యక్షులు ముజ్జె లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. మరో వర్గానికి చెందిన [illegible] మాలకొండ్రాయుడు, మాజీ జడ్పీటీసీ, పీఏసీఎస్ అధ్యక్షులు భోగినేని శ్రీనివాసులు, కామేపల్లి వెంకటరత్నం, ఆంధ్రా బాలగుర వారెడ్డి తదితరులు పాఠశాలల్లో కేకులను కట్ చేసి విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

● సీతారామపురం: బస్టాండ్ సెంటర్‌లో జరిగిన వేడుకలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటీసీ కలివెల జ్యోతి, మం డల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, జిల్లా బీసీ కార్య నిర్వహక అధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్సీ సెల్ కార్యనిర్వహక అధికార ప్రతినిధి జాషువా, జనసేన యువ నాయ కుడు భోగినేని కాశీరత్తయ్య (గాంధి) పాల్గొన్నారు.

● చేజర్ల: స్థానికంగా జరి గిన వేడుకలో జిల్లా టీడీపీ పార్ల మెంట్ సెక్రటరీ రావి పెంచల రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు రావి లక్ష్మీనరసారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో రావి కృష్ణారెడ్డి, హజరత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కావలి: మలిశెట్టికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే



కందుకూరు: కేక్ కట్ చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే



ఆత్మకూరు: కేక్ కట్ చేస్తున్న నేతలు, కార్యకర్తలు



సంగంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



అనంతసాగరం- కేక్ కట్ చేస్తున్న నాయకులు



కొండాపురం: కేకును తినిపిస్తున్న నాయకులు



బిట్రగుంట: తెలుగు తమ్ముళ్ల సంబరాలు

ఇండోర్ స్టేడియం నిర్మాణానికి నిధుల మంజూరు

కావలి టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మినీ స్టేడియం మైదానంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.2.64లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి తెలిపారు. కావలి క్రికెట్ అసో సియేషన్ ఆధ్వర్యంలో 20రోజులుగా మినీ స్టేడియం మైదానంలో జరుగుతున్న డివిజన్‌స్థాయి క్రికెట్ టోర్నమెంట్ గురువారంతో ముగిసింది. అసోసియేషన్ అధ్యక్షుడు సిద్ధు అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని విజేతలకు ట్రోఫీలు చెక్కులను అందజేశారు. మినీ స్టేడియం అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే దివంగత మాగుంట పార్వతమ్మ స్వీయ నిధులతో ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు, మాజీ కౌన్సిలర్ మదన్‌మోహన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రమణారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● కావలి: కలెక్టర్ ఆనంద్ ఈ నెల 28న పర్యటన నేపథ్యంలో ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి అధికారులతో కలిసి పలు ప్రాంతాలను పరిశీలించారు. వెంగళరావు నగర్‌లోని ప్రాథ మిక ఆరోగ్యకేంద్రం భవనం పరిశీలించి, ప్రా రంభోత్సవ ఏర్పాట్లపై ఆరా తీశారు. కొత్త శివాలయం నుంచి ఇందిర మ్మ కాలనీ, రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి మీదుగా వెళ్లే రోడ్డు ప్రాం తాన్ని, శిథిలావస్థ ఉర్దూ ఘర్ షాదీఖానా, వంటేరు వరదారెడ్డి పార్క్‌ను పరిశీలించారు.

నిందితులను అరెస్ట్ చేయాలని రాస్తారోకో

కలువాయి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వెరుబొట్లపల్లికి చెందిన దళిత యువకులపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ గురువారం కలువాయిలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కేసులో దళిత యువకులపై నమోదు చేసిన కౌంటర్ కేసును ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. బస్టాండు సెంటర్‌లోని పొదలకూరు-సోమశిల రోడ్డుపై గంట పాటు రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్ నిలిపోయింది. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ, మందా పెంచలయ్య మాదిగ, జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేద్కర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయ్ మాదిగ, మండల నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి క్లోరినేషన్ తప్పనిసరి

కావలి రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తాగునీటిని తప్పనిసరిగా క్లోరినేషన్ చేయించాలని జిల్లా పరిషత్ సీఈవో విద్యారమ తెలిపారు. గురువారం అన్నగారిపాలెం సమగ్ర మంచినీటి సరఫరా పథకాన్ని తనిఖీ చేసి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ట్యాంకులను 15రోజులకు ఒకసారి శుభ్రపర్చటంతో పాటు ప్రతిరోజూ క్లోరినేషన్ చేయించాలన్నారు. 45 గ్రామాలకు తాగునీరు సక్రమంగా సరఫరా అవుతుందా అని ఆరా తీశారు. నీటి పరీక్షల శాంపిల్స్ పరిశీలించారు. తాగునీటి సరఫరాలోని ఎయిర్‌వాల్స్ లీకేజీతో నీరు వృథా అవుతున్న విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సర్పంచ్ గోళ్ల సుప్రియ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రెడ్డయ్య, డీఈ లీలా ప్రకాష్, ఏఈ సతీష్, కార్యదర్శి అబ్దుల్ సమద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రహదారి భద్రత.. సామాజిక బాధ్యత

కందుకూరు, (ఆంధ్రజ్యోతి):రహదరి భద్రత సామాజిక భద్రత అని సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం పట్టణంలో నిర్వహించిన వాక్‌దాన్ కార్యక్రమంలో పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయం నుంచి పోస్టాఫీసు సెంటర్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా ఏరియా హాస్పిటల్ వరకు రహదారి భద్రత ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కందుకూరు ప్రాంతీయ రవాణా అధికారి టీవీఎన్ నాగలక్ష్మి, ఎంవీఐ సీ హెచ్ రాంబాబు, కావలి ఏఎంవీఐ లక్ష్మీబాయి, వి వేకా ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న సబ్ కలెక్టర్

ట్రంకు రోడ్డుకు మాగుంట పార్వతమ్మ పేరు

కావలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రంకు రోడ్డుకు.. మాగుంట పార్వతమ్మ రోడ్డుగా నామకరణం చేస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ట్రంకురోడ్డును నాలుగులైన్ల రోడ్డుగా విస్తరణ చేయడంలో అప్పటి ఎమ్మెల్యేగా మాగుంట పార్వతమ్మ కృషి చేసింది. ఆమె మరణానంతరం ఆమె పార్థివ దేహానికి నెల్లూరులో నివాళులర్పించిన కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కావలి ట్రంకు రోడ్డుకు మాగుంట పార్వతమ్మ రోడ్డుగా నామకరణం చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపటంతో రాష్ట్ర ప్రభుత్వం పంపడంతో మాగుంట అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యమైన ఉత్పత్తులపై దృష్టి

వలేటివారిపాలెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పొగాకుపై రోజురోజుకు పెరుగుతున్న ఆంక్షలు, తరిగిపోతున్న మార్కెట్ దృష్ట్యా రైతులు నాణ్యమైన పొగాకు ఉత్ప త్తులపై దృష్టి సారించాలని కందుకూరు పొగాకు వేలం కేంద్రం నిర్వాహణాదికారి చంద్రశేఖర్ తెలిపారు. గురువారం అమ్మపాలెంలో నిర్వహించిన పొగాకు రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. పొగాకు రైతులకు ఎన్‌టిఆర్ఎం బుట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోర్డు సిబ్బంది, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలి

సీతారామపురం, జనవరి 23 (ఆంధ్ర జ్యోతి): మైదుకూరు - సింగరాయ కొండ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మారంరెడ్డిపల్లి, గుండుపల్లి వద్ద స్థలాలు, గృహాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందించాలని నిరసన వ్యక్తం చేశారు. పరిహారం చెల్లించకూండా గృహాలు కూల్చడం ఏమిటని అడ్డుకున్నారు.

వేడుకల ప్రారంభం

కందుకూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక క్రీడా వేడుకలను గురువారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో భాస్క రరావు, బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు బాల భాస్కర్, నరేంద్రబాబు పాల్గొన్నారు.

స్క్రీనింగ్ సర్వే తనిఖీ

ఉదయగిరి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఇందిరా నగర్ కాలనీలో డబ్ల్యూహెచ్‌వో ఆదేశాల మేరకు గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యఆరోగ్య సిబ్బంది నిర్వహించిన ఎన్ సీడీ స్క్రీనింగ్ సర్వేను ఎన్‌సీడీసీడీ పరిశీలన అధికారి వాసవి తనిఖీ చేశారు. కార్యక్రమం లో వైద్యాధికారిణి వినీత, సీహెచ్‌వో శివకు మారి, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం

ఉదయగిరి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక చెక్కునగిషీ కేంద్రంలో నిర్వాహకులు గౌసియా బేగం, జాకీర్ హుస్సేన్‌లతోపాటు ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు హాజరయ్యే అవకాశం దక్కించుకున్న సందానీ, షాహీన్ దంపతులను గురువారం టీడీపీ నాయకులు సన్మానించారు. కార్య క్రమంలో పొన్నెబోయిన చెంచల బాబుయాదవ్, బయ్యన్న, రియాజ్, రవీంద్రబాబు ఉన్నారు.

ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి



నివాళులర్పిస్తున్న రామ్‌సెంటర్ బాధ్యులు

కావలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, నేతలు పాల్గొని నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, ప్రధాన కార్యదర్శి బాబూరావు పాల్గొన్నారు.

రామ్‌సెంటర్ ఆధ్వర్యంలో..

అడవిరాజుపాలెం పాఠశాలలో డాక్టర్ రామ్‌సెంటర్ సభ్యులు నిర్వహించిన వేడుకలో నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రామ్‌సెంటర్ చైర్మన్ మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

● అనంతసాగరం: కామిరెడ్డిపాడు ఉన్నత పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం వసుంధరదేవి, ఉపాధ్యాయులు చెరుకూరి మనోజ్‌కుమార్, వెంకట రమణరాజు తదితరులు పాల్గొన్నారు.

● ఉదయగిరి: స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ నారాయణస్వామి, వైస్ ప్రిన్సిపాల్ నరసింహులు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కేసీ విక్రమ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

వీర జవాన్‌కు ఘన నివాళి

వింజమూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కలిగిరి మండలం తెల్లపాడు గ్రామానికి చెందిన లింగుంట వెంకటనరసయ్య ఢిల్లీలో సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా విధులు నిర్వహిస్తూ మృతిచెందగా స్వగ్రామంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కన్స్యూమర్ రైట్స్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ చేబ్రోలు వసంతరావు జాతీయ జెండాని జవాన్‌పై కప్పి ఘనంగా నివాళి అర్పించారు.

టీచర్ భారతికి డాక్టరేట్

ఆత్మకూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో తెలుగు టీచర్‌గా పనిచేస్తున్న వేలూరు భారతికి యోగి వేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. వైవియు తెలుగు శాఖ ఆచార్యులు రామప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో ఒక శతాబ్దపు రాయలసీమ కథానిక - స్త్రీ (1962 నుండి నేటి వరకు) అనే అంశంపై ఆమె చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. భారతిని యుటిఎఫ్ నాయకులు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు గంగాధర్, శివప్రసాద్‌రావు, షేక్ ఖాదర్‌బాష, పి సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.